www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 241 | బుధవారం 21-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలి

ప్రధాని మోడీకి సురవరం లేఖ



విశాలాంధ్ర బ్యూరో -హైదరాబాద్ :
ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి కేంద్రాన్ని డిమాండు చేశారు. జటిలమైన ఈ సమస్యను వెనువెంటనే పరిష్కరించాలంటూ ఆయన మంగళవారం ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. వర్గీకరణ కోసం రెండు దశాబ్దాలుగా పోరాటాలు సాగుతున్నాయని, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని ప్రజలు కోరుతున్నారని, ఎస్సీ వర్గాల్లో చాలా మంది దయనీయ జీవితాలు సాగిస్తున్నారని, మాదిగ, మాదిగ ఉప కులాలకు సామాజిక సమన్యాయం దక్కాలంటే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని సురవరం సూచించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండు చేశారు. ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించడం వల్ల అత్యంత దిగువనున్న మాదిగ, మాదిగ ఉప కులాలకు, విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. మాదిగ ఉపకులాలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం జరగడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వర్గీకరించాలని సురవరం సూచించారు. ఎస్సీ వర్గీకరణ పంజాబ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో అమలు చేశారన్నారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపడంతో పాటు తెలంగాణ శాసనసభ సైతం ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించినా న్యాయం జరగలేదన్నారు. ఉషామెహ్రా కమిటీ నివేదిక సైతం వర్గీకరణ చేయాలని కేంద్రానికి నివేదిక సమర్పించిందని సురవరం గుర్తుచేశారు.

అఖిల సంఘాల కమిటీ



- ప్రత్యేకహోదాకే బాబు జై?
- ఒత్తిడి కోసం ఢిల్లీ యాత్ర
- అవిశ్వాస తీర్మానమే అస్త్రంగా

విశాలాంధ్ర-అమరావతి :
ఇప్పటివరకు ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడుతూ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చివరకు ప్రత్యేకహోదాకే జై కొట్టారు. ఏపీ ప్రయోజనాలను కాపాడుకొనేందుకు కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఢీ కొనేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమైనట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడమే చివరి అస్త్రంగా సీఎం ఎంచుకున్నారు. ఆ మేరకు తన పార్టీ ఎంపీలకు ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ నేతలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీలోని తాజా రాజకీయ పరిణామాలు, బీజేపీ నేతల వ్యాఖ్యలు, పవన్‌కళ్యాణ్, వైయస్.జగన్‌ల సవాళ్ళు తదితర అంశాలపై సొంతపార్టీ నేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు రాజీనామాలతో ఉపయోగం ఉండదన్న అభిప్రాయాన్ని బాబు వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో నిరంతరం పోరాటం చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తేవాలని తన పార్టీ ఎంపీలకు చంద్రబాబు సూచించారు. దీని ద్వారా మనం చేస్తున్న పోరాటంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఆ విషయాన్ని ప్రజలు గ్రహిస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ రెండూ సమానమంటేనే ఒప్పుకున్నామని, విభజన చేసి కాంగ్రెస్ అన్యాయం చేస్తే విభజన తర్వాత బీజేపీ పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇతర రాష్ట్రాలకు నిధులిచ్చి ఏపీకి ఇవ్వకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. ఇబ్బందుల్లో ఉన్న మన రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవటంలో కేంద్రం అంతర్యాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి వచ్చే అందరినీ కలుపుకొని పోదామని, త్వరలోనే అన్ని రాజకీయ - మిగతా 2 లో

ఐక్యపోరు అవశ్యం

- రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ కార్యదర్శి నారాయణ సూచన
- బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ



విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ :
గతంలో కాంగ్రెస్ పార్టీ రిటైల్ అవినీతికి పాల్పడితే ప్రస్తుతం కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ ల్‌సేల్‌గా అవినీతికి పాల్పడుతోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డా॥ కె. నారాయణ విమర్శించారు. మంగళవారం ఇక్కడి గంధమనేని శివయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎజెండాను వెల్లడించాలని డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఎజెండాగా తీసుకుంటే తమ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందన్నారు. ప్రత్యేక ప్యాకేజి కోసం అఖిల పక్షం ఏర్పాటు చేస్తే సీపీఐ భాగస్వామ్యం కాదన్నారు. ప్రత్యేక ప్యాకేజితో రాష్ట్రానికి ప్రయోజనం పెద్దగా - మిగతా 2 లో

నాలుగేళ్లుగా అన్యాయాలే

- బీజేపీతో టీడీపీ, వైసీపీ లాలూచీ వల్లే ఏపీకి అన్యాయం
- ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
రాష్ట్ర విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అంశాలపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. ఆ లేఖ ఇలా ఉన్నది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తూనే వుంది. రాష్ట్ర విభజన చట్టం-2014లో పేర్కొన్న హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ సైతం అటకెక్కించారు. అర్ధాంతరంగా విభజించిన ఒక రాష్ట్రం పరిస్థితి గత 44 నెలలుగా ఇంకా చర్చల స్థాయిలోనే ఉందని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పడం ఏపీకి కేంద్రం చేస్తున్న ద్రోహమే. రాష్ట్ర విభజన అనంతరం రెవెన్యూ లోటు రు.16 వేల కోట్లు ఉండగా, ఇప్పటికీ కేంద్రం రు.3,979 కోట్లు మాత్రమే ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి రు.24,350 కోట్ల రూపాయలు అవసరం కాగా, కేంద్రం కేవలం జిల్లాకు ఏడాదికి రు.50 కోట్లు చొప్పున గత మూడేళ్లలో రు.1050 కోట్లు - మిగతా 11 లో



రైల్వేస్టేషన్లపైనా పంజా

- 99 ఏళ్ల లీజుకు గ్రీన్‌సిగ్నల్?
- దక్షిణ మధ్య రైల్వేకు 3 స్టేషన్ల అప్పగింత
- ఎన్‌బీసీసీకి తిరుపతి, నెల్లూరు స్టేషన్లు
- విజయవాడపై ఐఎల్‌ఎఫ్‌ఎస్, జీఎమ్మార్ కన్ను?

11లో

ప్రైవేటుకు బొగ్గుగనులు



- నాలుగు దశ్దాల తరువాత కేంద్రం కీలక నిర్ణయం
- వాణిజ్య అవసరాలకు వినియోగించే శిలాజ ఇంధన గనులూ ప్రైవేటీకరణ

న్యూఢిల్లీ :
అన్నింటిని ప్రైవేటీకరించడమే పనిగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం మంగళవారం బొగ్గు గనులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నది. 1973లో బొగ్గుగనులను జాతీయం చేశారు. ఆ తరువాత ఇంత పెద్ద సంస్కరణ తీసుకురావడం ఇదే మొదటిసారి. బొగ్గుగనుల తవ్వకాల్లో ప్రైవేటు కంపెనీల ప్రవేశానికి ఆమోదం తెలుపుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. వాణిజ్య అవసరాలకు వినియోగించే శిలాజ ఇంధనగనులలో ప్రైవేట్ కంపెనీలను ప్రభుత్వం ఇక అనుమతిస్తుంది. దేశంలో బొగ్గు గనుల తవ్వకాల వేలంలో పాల్గొనేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతినికి కేంద్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మైనింగ్ అండ్ మినరల్స్ (డెవెలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1957ను ఆమోదిచినట్టు కేంద్ర, రైల్వే, బొగ్గు శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. ఈ నిర్ణయం కారణంగా తక్కువ ధరకే విద్యుత్ లభించనుందని చెప్పారు. ఈ నిర్ణయంతో బొగ్గు తవ్వకాల్లో వాణిజ్య - మిగతా 11 లో



నేటి నుంచి ఏపీ టెట్

- తొలిసారిగా ఆన్‌లైన్లో పరీక్ష
- ఏపీ, ఇతర రాష్ట్రాల్లో 183 కేంద్రాలు
- మార్చి 2వరకూ రోజుకు రెండు విడతలుగా నిర్వహణ
- పీహెచ్‌సీ, గర్భిణులకు అదనంగా సమయం
- పేపర్-1,2,3లకు హాజరుకానున్న 4లక్షల 60వేల మంది
- మార్చి 16న ఫలితాల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)-2017 పరీక్షలు ఈ నెల 21వ తేదీ బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభంకానున్నాయి.తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న పరీక్షలకు దాదాపు 4లక్షల60వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారంతా హాల్‌టిక్కెట్లను - మిగతా 2 లో

ఢిల్లీకి రండి

- సీఎస్‌కు కేంద్రం కాల్
- 23న ఢిల్లీకి ఉన్నతాధికారులు

3లో

అగ్రిగోల్డ్ కేసు విచారణ మార్చి 5కు వాయిదా

2లో

నేడు కమల్ పార్టీ ప్రకటన

హాజరు కానున్న కేజ్రీవాల్

9లో

కుంభకోణంపై సిట్ దర్యాప్తు

సుప్రీంలో రెండు పిటిషన్లు

9లో

ఇదీ లోకం!



నీటి సదస్సుకు ఏపీ డుమ్మా

- సీఎం ఆదేశాల మేరకే హాజరు కాలేదా?
- ఏపీ ఆటంకాలు కలిగిస్తోందంటూ తెలంగాణ ఫిర్యాదు
- మంత్రి దేవినేని ఉమా తీరుపై సర్వత్రా విమర్శలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
దక్షిణాది రాష్ట్రాల జలవనరుల ప్రాంతీయ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ డుమ్మా కొట్టింది. కేంద్ర జలవనరులశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ నేతృత్వంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సదస్సుకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సదస్సుకు రాష్ట్ర జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెళ్లలేదు సరికదా.. సంబంధిత ఉన్నతాధికారులు కూడా హాజరు కాలేదు. దీంతో ఈ విషయం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, విభజన అంశాలపై బీజేపీ-టీడీపీల మధ్య వాడివేడిగా చర్చ జరుగుతున్న తరుణంలో సీఎం చంద్రబాబు సూచన మేరకే ఈ సదస్సుకు గైర్హాజరైనట్లుగా తెలుస్తోంది. దీంతో ఇదే అదనుగా భావించిన తెలంగాణ నీటిపారుదల శాఖమంత్రి హరీష్‌రావు ఏపీ తమను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని కేంద్రసహాయమంత్రికి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా పోలవరం నిర్మాణం వల్ల తెలంగాణలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై వెంటనే కేంద్రం కల్పించుకొని ముంపును నివారించాలన్నారు. అలాగే కృష్ణానదీ - మిగతా 2 లో

మరణ మృదంగం

- వారంలో ఆరుగురి మృతి
- సమస్యల వలయంలో ఒంగోలు రిమ్స్
- పేదలకందని వైద్య సేవలు
- నెఫ్రాలజిస్టు లేని డయాలసిస్ సెంటర్



విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో :
ఒంగోలు రిమ్స్‌లో మరణ మృదంగం మ్రోగుతోంది. పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, దీనికి అనుగుణంగా అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అసమర్థతతో ప్రకాశంజిల్లా కేంద్రమైన ఒంగోలు రిమ్స్‌కు గ్రహణం పట్టింది. వెనుకబడిన ప్రకాశంజిల్లాలో ఏర్పాటు చేసిన రిమ్స్‌లో కనీస వైద్య సదుపాయాలు అందక పేదల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. మెరుగైన వైద్యం చేయించుకోలేని పేదలు ఏమిచేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో రిమ్స్‌లో చేరితే కనీస వైద్య సేవలు అందించలేని దుస్థితిలో రిమ్స్ ఉంది. గడిచిన వారం రోజుల్లోనే ఆరుగురు మృతి చెందారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది డెంగ్యూ, విష జ్వరాలతో వందలాది మంది మృతి చెందగా ప్రస్తుతం కిడ్నీ వ్యాధితో బాధితులు మృత్యువాత పడుతున్నారు. వివరాలలోకి వెళితే ఒంగోలులో ఒకప్పుడు 500 పడకలు కూడా నిండక ఇబ్బంది పడ్డ రిమ్స్ వైద్యశాల నేడు రోగులతో కిటకిటలాడుతూ పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేని దుస్థితికి చేరుకుంది. పెరిగిన రోగులకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటంతో తగిన సదుపాయాలు అందక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చివరకు కిడ్నీ బాధితుల కోసం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో దానిని పర్యవేక్షించాల్సిన నెఫ్రాలజిస్టును - మిగతా 2 లో

మెర్కెల్‌కు కుడిభుజం...

సీడీయూ సెక్రటరీ జనరల్‌గా అన్నెగ్రెట్ నియామకం



బెర్లిన్ : క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సీడీఐ) సెక్రటరీ జనరల్‌గా సార్లాలాండ్ గవర్నర్ అన్నెగ్రెట్ క్రాంప్- కార్రెన్ బ్యుయర్‌ను నియమిస్తూ పార్టీ అధినేత్రి, జర్మన్ ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్ సోమవారం ప్రకటించారు. మెర్కెల్‌కు కుడి భుజంగా పరిగణించే అన్నెగ్రెట్ భవిష్యత్‌లో పార్టీ పగ్గాలు చేపట్టే అవకాశాలు ఉన్నట్టు విశ్లేషకులు అంటున్నారు. సీడీయూ/ సీఎస్‌యూ బ్లాక్, సెంటర్-లెఫ్ట్ సోషల్ డెమొక్రాట్స్ (ఎస్‌పీడీ) మధ్య సంకీర్ణం ఏర్పడ డంలో 55ఏళ్ల అన్నెగ్రెట్ పాత్ర కీలకం. సార్లాలాండ్ రాష్ట్ర ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో ఆమెది అంద వేసిన చేయి. కొత్త బాధ్యతలను చేపట్టేందుకుగాను ఆమె త్వరలోనే బెర్లిన్‌కు రానున్నారు. సార్లాలాండ్ గవర్నర్ పదవికి రాజీ నామా చేయనున్నారు. ఆమె బెర్లిన్ రాక భవిష్యత్‌లో ఫెడరల్ రాజకీయాలకు బాటగా పరిగణించబడుతోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పీటర్ తౌబర్ స్థానం లోకి అన్నెగ్రెస్ రాబోతున్నారు. ఈనెల 26న పార్టీ కాన్ఫరెన్స్ ఆమె బాధ్యతల స్వీకరణకు వేదిక కానున్నది. మెర్కెల్ సోమవారం సీడీయూ కేంద్ర కార్యాలయంలోని కొనార్డ్-అండ్రెన్యూయర్ ఇంటి నుంచి అన్నె గ్రెట్ నియామక ప్రకటన చేశారు. ఈ పదవికి తానే అర్హురాలి నంటూ అన్నెగ్రెట్ తనను తాను సిఫార్సు చేసుకొన్నారని మెర్కెల్ వెల్లడించారు. పార్టీ, దేశంపై ప్రాదేశిక రాజకీయ నేతల నిబద్ధ తను ప్రశంసించారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితి నుంచి జర్మనీని బయటపడేయాలన్న తన ఆకాంక్షే ఈ ముంద దుగుకు ప్రేరణగా అన్నెగ్రెట్ క్రాంప్- కార్రెన్‌బ్యుయర్ విలేకరు లతో చెప్పారు. 1998-2000 వరకు మెర్కెల్ ఈ పదవిలో కొనసాగగా ఆమె తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీగా పగ్గాలు చేపట్టే మహిళగా అన్నెగ్రెట్ నిలిచారు. మెర్కెల్ త్వరలో రాజకీయాల నుంచి తప్పుకొనే అవకాశం ఉండడంతో.. ఆమె తర్వాత అన్నెగ్రెట్ పార్టీ పగ్గాలు చేపట్టవచ్చునని జర్మనీ మీడియా అంచనాలు వేస్తోంది.

విశాలాంధ్ర ప్రపంచం

ఇది యుద్ధమా? నరమేధమా?

- 21వ శతాబ్దపు మరణహోమానికి సాక్షి
- సిరియాలో బాంబుల వర్షం : వందలాది మరణాలు
- శిథిలమైన నాలుగు ఆసుపత్రులు



డమాస్కర్ : సిరియాలోని తూర్పు గౌటాలో మారణహోమం సంభవించింది. సుమారు వంద మంది చనిపోగా.. కొన్ని వందల మంది గాయ పడ్డారు. డమాస్కస్‌లో చోటుచేసుకున్న నరమేధంపై స్థానిక కోర్టులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. గత వారంలో చోటుచేసుకున్న మరణాలను మినహాయిస్తే కేవలం మూడునెలల్లో 700మందికిపైగా మరణించి నట్టు చెబుతున్నాయి. సోమవారం నాలుగు ఆసుప త్రులపై బాంబుల దాడి 21వ శతాబ్దపు మారణ హోమానికి సాక్షి అంటూ గౌటాలోని ఓ డాక్టర్ అన్నారు. 1990లో స్రెబ్రెనికా.. 1980లో హలబ్జా, సబ్రా, ఛాటిలాల ఇప్పుడు తూర్పు గౌటాలో మారణ హోమం సంభవించిందన్నారు. 'కొంతసేపు క్రితం ఓ పిల్లాడిని నా వద్దకు తీసుకొచ్చారు. అతడి ముఖం నీలంగా మారిపోతోంది.. అతికష్టంమీద శ్వాసను తీసుకోగలుగుతున్నాడు. అతడి నోరంతా ఇసుకతో నిండివుంది. నా చేతుల్లో దానిని బయటకు తీశాను. మేం ఇక్కడ చేస్తున్నది ఏ వైద్య పాఠపుస్తకాల్లో ఉం దదు. తీవ్రంగా గాయపడిన ఆ పిల్లవాడు ఇసుకతో నిండివున్న ఊపిరితిత్తులతో శ్వాస తీసుకుంటుండడం మనసును కలచివేసింది. పిల్లాడిని రాళ్లు, ఇసుక శిథిలాల కింద నుంఇచ తీశారు. ఆ బాబు ఎవ్వరో కూడా తెలియదు. మానవసంఘాలు, హక్కుల సంఘాలంటారు గానీ అవన్నీ ఎందుకు పనికిరావు. ఉగ్రవాదం కూడా నిర్థకమైనది. అన్ని రకాల మారణా యుధాలతో పౌరులను చంపడానికి మించిన ఉగ్ర వాదం మరేముంటుంది? ఇది యుద్ధమా? కాదు.. మారణహోమం... నరమేధం' అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం ఒక్క రోజులో 110 మర ణాలు సంభవించాయంటే సిరియాలో ఏ స్థాయిలో జనసంహారం జరుగుతున్నదో మనం అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఏడేళ్ల తర్వాత ప్రాదేశిక, ప్రపంచ శక్తులు జోక్యం చేసుకొన్నప్పటికీ మానవ సంక్షోభం తగ్గకుండా పెరగడం; అసద్ ప్రభుత్వం రాజకీయ రాజీ కోసం చర్యలు తీసుకోకుండా మిత్రదేశాలపై రష్యా, ఇరాన్‌తో కలిసి మిలటరీ గెలుపునకు యత్నిస్తుండడం బాధాకరం. కాగా, 2013లో తూర్పు గౌటాలో 1300 మంది చనిపోయినట్టు సహాయక బృందాలు వెల్లడించాయి. అసద్ హయాంలో సరయిన్ గ్యాస్‌తో పాటు బ్యారల్ బాంబుల వినియోగం జరిగినట్టు తెలిపాయి. వీటి వినియోగాన్ని మానవహక్కుల వాచ్‌డాగ్స్ యుద్ధనేరంగా పరిగణిస్తున్నట్టు తెలిపాయి. యుద్ధ విమానాలు, ఫిరంగుల దాడులు జరిగాయన్నాయి. తూర్పు గౌటాలోని పరిస్థితి ప్రపంచ అంతాన్ని సూచిస్తోందని వాలంటీర్ సంఘం 'వైట్ హెల్మెట్స్' డిప్యూటీ డైరెక్టర్ మౌనీర్ ముస్తఫా అభిప్రాయపడ్డారు. ఈ సంస్థ బాంబు దాడి నేపథ్య శిథిలాల నుంచి ప్రజలను రక్షిస్తుంది. సోమవారం జరిగిన బాంబుల దాడిలో తమ వాలంటీర్ ఫిరాస్ జుమా మరణించినట్టు వైట్ హెల్మెట్స్ పేర్కొంది. ఇదిలావుండగా, ప్రసూతీ కేంద్రంతో సహా నాలుగు ఆసుపత్రులు పూర్తిగా ధ్వంసమైనట్టు వైద్యసంఘాలు తెలిపాయి. ఓ అనెస్‌థెసిస్ట్ కూడా మరణించినట్టు వెల్లడించాయి. ఏం జరుగుతున్నదో కూడా గ్రహించే అవకాశం లేకుండా బాంబుల వర్షంలో కురిసిందని యూనియన్ ఆఫ్ మెడికల్ అండ్ రిలీఫ్ ఆర్గనైజేషన్స్ (యూఓఎస్ఎస్ఎం) భద్రతాధికారి అహ్మద్ అల్ దిబ్రీస్ అన్నారు.ఇక్కడ జనసంహారం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.



తుపాకీ సంస్కృతికి కళ్లెం వేయండి...!

వైట్ హౌస్ ఎదుట విద్యార్థుల నిరసన ప్రదర్శన

వాషింగ్టన్: విద్యార్థులను పొట్టన పెట్టుకున్న ఫ్లోరిడా హైస్కూల్ కాల్పుల ఘటన అనంతరం అమెరికాలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న తుపాకీ సంస్క ృతికి కళ్లెం వేయాలన్న డిమాండ్ క్రమంగా ఊపందుకుంటోంది. అమెరికా అధ్యక్షుని కార్యాల యం వైట్‌హౌస్ ఎదుట పలువురు విద్యార్థులు నేలపై 3నిమిషాలపాటు పరుండి తమ నిరసన వ్యక్తం చేసారు. కొంతమంది విద్యార్థులు 'విల్ ఐ బి ద నెక్స్' అనే ప్లకార్డులు పట్టుకుని తుపాకీ సంస్కృతిని తీవ్రంగా నిరసించారు. గన్ రిఫార్మ్ అనే ఆర్గనైజేషన్‌ను స్థాపించి టీనేజర్స్ ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రభుత్వం తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా తగిన చర్యలు చేపడుతుందని తమకు ఆశగాఉందని ట్వీట్‌చేసారు. ఫ్లోరిడా కాల్పుల ఘటన విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ, విచ్చలవిడిగా కొనసాగుతున్న తుపాకీ సంస్కృతిని కట్టడి చేయాలన్న డిమాండ్‌తో అనేక రాష్ట్రాల్లో వేలాది మంది విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. దీనికనుగుణంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ భారీయెత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ మార్చి 14న 17 నిమిషాల పాటు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల నుండి వాకౌట్ చేయాలని మహిళా మార్చ్ అనే సంస్థ నిర్వాహకులు టీచర్లు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వమే స్కూళ్లను నిర్వహించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న నెట్‌వర్క్ ఫర్ పబ్లిక్ ఎడ్యుకేషన్ అనే సంస్థ ఏప్రిల్ 20న దేశవ్యాప్తంగా వున్న స్కూళ్లు, విద్యాసంస్థలన్నింటిలో వాకౌట్‌లు, సిట్‌లు వంటి వాటితో నిరసన తెలియజేసింది.

1999లో ఇదే రోజు కొలరాడోలోని కొలంబియన్ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో 12 మంది విద్యార్థులు ఒక టీచర్ మరణించిన విషయం తెలిసిందే. దీనితో పాటు ఫ్లోరిడా కాల్పులపై నిరసన వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా శనివారం సోషల్ మీడియా వేదికగా నిరసనలు వెల్లువెత్తాయి. తుపాకీ సంస్క ృతిని కట్టడి చేయాలని, అందుకు ప్రత్యేకంగా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేస్తూ కాల్పుల ఘటన జరిగిన పార్క్‌లాండ్‌లోని మార్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్, అక్కడికి 40 కి.మీ దూరంలో వున్న ఫోర్ట్ లాడర్‌డేల్, సెంట్ పీటర్స్‌బర్గ్ తదితర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఫ్లోరిడా కాల్పుల ఘటనకు సంబంధించిన అనుమానితుడు నికొలస్ క్రుజ్‌కు సంబంధించిన తాజా వివరాలు వెల్లడి కావటంతో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి.

అమెరికాలో 'ప్రెసిడెంట్స్ డే'

వాషింగ్టన్ : అమెరికా తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ (1732-1799) జన్మదినాన్ని 'ప్రెసిడెంట్స్‌డే'గా పాటించడం ఆనవాయితీ. ఈరోజు ఫెడరల్ సంస్థలు, స్కూళ్లు, బ్యాంకులు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉంటుంది. అయితే దీనిని పాటించడం తప్పనిసరి కాదు. దేశ తొలి అధ్యక్షుడు ఫిబ్రవరి 22న పుట్టినప్పటికీ ఆయన మరణానంతరం ప్రతిఏటా రెండోనెల మూడో సోమవారాన్ని 'ప్రెసిడెంట్స్ డే'గా పాటిం చాలని 60వ దశకం చివర్లో నిర్ణయం జరిగినట్టు చరిత్ర చెబుతోంది. 'ఉమ్మడి సోమవారం సెలవు చట్టం'కు కాంగ్రెస్ ఆమోదించిందని, అది 1971లో అమలైందని తెలుస్తోంది. అనేక రాష్ట్రాల్లో వాషిం గ్టన్, లింకన్‌తో సహా ఇతర దిగ్గజ నేతల గౌరవార్థం ప్రెసిడెంట్స్ డేను పాటిస్తారు. తమ అధ్యక్షులను స్మరించుకునేందుకు ఇదో సదవకాశంగా భావిస్తం టారు. ఈ ఏడాది ఈ రోజున దేశ 44, 45వ అధ్యక్షులను గుర్తుచేసుకోవాలి తప్ప ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌ను కాదంటూ వార్తాసంస్థలు. సామాజిక మాధ్యమాల్లో కథనాలు, వ్యాఖ్యలు దర్శనమిచ్చాయి. ఇందుకు వాషింగ్టన్ పోస్టు సంపాదకీయాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. రిపబ్లిక్ టైకూన్‌ను మాజీలతో పోల్చుతూ రాసిన ఎడిటోరియల్‌ను 'ది శాడ్ రియాల్టీ ఆఫ్ ది ప్రెసిడెంట్స్ డే' శీర్షికన ప్రచురించింది. ఇందులో జాతి, కులం, మతం, సంస్కృతి తదితర అంశాలపై ఆధునిక సమాజాన్ని విభజించే ప్రస్తుత అధ్యక్షుడి ప్రభావం లింకన్ పార్టీపై ఉందని పేర్కొంది.

మరణ మృదంగం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో రిమ్స్ వైద్యశాల ఉందంటే అతిశయోక్తి కాదు. నెఫ్రాలజిస్టు లేకుండా బ్లడ్ ఇంజక్షన్ ఇవ్వటం కుదరదు, ఇండెంట్ కావాలంటే నెఫ్రాలజిస్టు సంతకం తప్పని సరి. అలాంటి కీలకమైన డయాలసిస్ కేంద్రంలో నెఫ్రాలజిస్టు లేని కారణంగా రోగులకు బ్లడ్ ఇంజక్షన్ ఇవ్వటం లేదు. బ్లడ్ ఇంజక్షన్ ఇవ్వటం వల్ల డయాలసిస్ చేయించుకునే రోగులలో తగ్గే రక్తంలోని హిమోగ్లోబిన్ శాతాన్ని అదుపు చేస్తుంది, కిడ్నీ రోగులు ఇది చేయించుకోకపోతే వెంటనే నీరసపడిపోయే అవకాశం వుంది. ఇటువంటి విషయాలపై అవగాహన లేని వైద్యులను సెంటర్‌లో నియమించటం వల్ల ప్రధానంగా రోగులు ఇబ్బంది పడతారు. గత నెల కాలంలో ఆరుగురు నిత్యం డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు మృత్యువాత పడ్డా వారికి సీరియస్‌నెస్ అర్థం కాకపోవటం బాధాకరం. పై పెచ్చు బ్లడ్ ఇంజక్షన్ ఇవ్వటం వల్ల రోగి బతికిపోడని, ఆ ఇంజక్షన్ ఇవ్వక పోవటం వల్లనే రోగులు చనిపోలేదని డయాలసిస్ సెంటర్ వార్డ్ ఇన్‌చార్జ్ వైద్యులు పేర్కొనటం రోగుల పట్ల వారికున్న చిత్తశుద్ధిని తెలుపుతోంది. అంతే కాదు డయాలసిస్‌కు వచ్చే రోగులు దాదాపుగా చివరి స్టేజిలో వస్తారని, డయాలసిస్ చేయటం వల్ల కేవలం ఉపశమనం దొరకుతుందే తప్ప పూర్తిగా రోగి కోలుకోడని ఇన్‌చార్జ్ పేర్కొనటం వైద్యవృత్తిస్థాయిలో చెప్పాల్సిన మాటలుగా ఉండడంలేదు. రోగులకు భరోసా కల్పించాల్సిన దీంతో రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందటం లేదు. ఇది రిమ్స్ హాస్పిటల్‌లో ఉన్న వైద్యుల పరిస్థితి. ఈ వార్డులోనే కాకుండా దాదాపుగా అన్ని వార్డులలో సిబ్బంది కొరత కారణంగా రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మొరాయిస్తున్న స్కానింగ్ సెంటర్లు : ప్రధానంగా వ్యాధి నిర్ధారణకు అవసరమైన స్కానింగ్‌లు రిమ్స్‌లో సక్రమంగా పనిచేయటం లేదు. అత్యవసర సమయాలలో అవి పనిచేయకపోవటం రోగులు ప్రైవేటు స్కాన్ సెంటర్‌లను అశ్రయించాల్సి వచ్చింది. వేలాదిరూపాయలు స్కానింగ్‌కు ఖర్చు చేయలేక రోగులు అల్లాడుతున్నారు. ప్రధానంగా ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్ వంటివి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే ఏంచేయమంటారు, రోగుల సంఖ్య పెరగటంతో వర్క్‌లోడు ఎక్కువై మిషన్‌లు వేడెక్కి నిత్యం రిపేర్లు వస్తున్నాయని సమాధానమివ్వం పరిపాటిగా మారింది. ప్రతి రెండు నెలలకు ఒకసారి వంతున రాష్ట్ర మంత్రులు హాస్పిటల్‌ను సందర్శించి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని చెప్పటం తప్ప ఎక్కడా ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైన ప్రభుత్వం రిమ్స్ వైద్యశాల అభివృద్ధిపై దృష్టి సారించి తగు నిధులు విడుదల చేయాలని, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సెమీ అటానమస్ హాస్పిటల్ మాత్రమే డాక్టర్ కె సీతారామయ్య, రిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ సెమీ అటానమస్ వైద్యశాల, దీనిలో పర్మినెంట్ సిబ్బంది ఉండరు. వైద్యుల నుండి డైరెక్టర్ వరకు అందరూ కాంట్రాక్టు బేసిక్ మీద పని చేసేవారే. అందుకే తరచూ సిబ్బంది కొరత ఉంటుంది. ఈపాటికే పలువురు సూపర్ స్పెషాలిటీ వైద్యులతో మాట్లాడి మరింతగా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రయత్నిస్తు న్నాం. తరచూ స్కానింగ్‌లు రిపేర్లు వస్తున్నాయ నటం వాస్తవం, పెరిగిన రోగులకు అనుగుణంగా మిషన్‌లు లేవు. దీంతో మిషన్‌లు ఓవర్‌లోడ్‌కు గురై రిపేర్లపాలవుతున్నాయి. ఈ సమయాలలో స్కానిం గ్‌ల కోసం రోగులను బయటలకు పంపాల్సి వస్తోంది. ఈ పాటికే అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు రెండు మిషన్‌లు తెప్పించాం. పెరిగిన రోగులకు అనుగుణంగా సిబ్బందిలేరనేది వాస్తవం.

రెండు నెలలుగా బ్లడ్ ఇంజక్షన్‌లు ఇవ్వటం లేదు : జి చిన్నమ్మ, కిడ్నీవ్యాధిగ్రస్తురాలు, మహ్మదాపురం, హెచ్ఎం పాడు మండలం

గత 10 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. ఆరు సంవత్సరాలుగా డయాల సిస్ చేయించుకుంటున్నాను. ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఖర్చు భరించలేక రిమ్స్ వైద్యశాలను ఆశ్రయించి వారానికి మూడు సార్లు వచ్చి డయాలసిస్ చేయించుకుంటాను. గత రెండు నెలల కాలంగా బ్లడ్ ఇంజక్షన్ రిమ్స్ లో ఇవ్వటం లేదు. అదే మని అంటే ఇంజక్షన్‌లు లేవు అంటున్నారు. గత శనివారం వైద్యులను గట్టిగా నిలదీస్తే కొద్ది మందికి బ్లడ్ ఇంజక్షన్‌లు ఇచ్చారు. అవి ఇవ్వక పోవటంతో నీరసం మరింత పెరుగుతోంది.

బ్లడ్ ఇంజక్షనా అంటే ఏమిటి : బాల బ్రహ్మం, రావువరం, దర్శి మండలం

నాకు కిడ్నీ వ్యాధి ఎప్పుడు వచ్చిందో కూడా తెలియదు. హైదరాబాద్‌లోని బీబీ నగర్‌లో ఇళ్లకి పాలిష్ రాళ్లు వేస్తు జీవనం సాగిసున్నాను. అక్కడ ఉండే కెమికల్ నీరు తాగటం వల్లనేమో కిడ్నీ వ్యాధి వచ్చింది. రెండు నెలల క్రితం నీరసంగా ఉంటే పరీక్షలు చేయిస్తే కిడ్నీ వ్యాధి వచ్చిందని, వెంటనే డయాలసిస్ చేయించుకోవాలని చెప్పటంతో అప్పటి నుండి ఒంగోలు రిమ్స్‌లో డయాలసిస్ వారానికి రెండు సార్లు వచ్చి చేయించుకుంటున్నాను. రెండు నెలలగా డయాలసిస్ చేయించుకుంటున్నా ఎప్పుడు నాకు బ్లడ్ ఇంజక్షన్ ఇచ్చిన దాఖలాలు లేవు. అసలు బ్లడ్ ఇంజక్షన్ ఎందుకు ఉపయోగ పడుతుందో కూడా తెలియదు.

తాగునీటికీ కిటకిట

హాస్పిటల్‌లోని రోగులను, వారి బంధువులను తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. హాస్పిటల్ ద్వారం వద్ద ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినా అది పూర్తిస్థాయిలో తాగునీటిని ఇవ్వలేకపోతోంది. కొద్ది మందికే ఈ నీరు సరిపోవటంతో మిగిలిన వారు బయట మార్కె ట్‌లో తాగునీటిని కొనుగోలు చేయాల్సివస్తోంది. అంతే కాకుండా రోగుల వెంట వచ్చిన బంధువులకు కూడా సరైన వసతి సౌకర్యం లేకపోవటంతో వరండాలలోనూ, ఆరుబయటే ఇబ్బందులు పడుతూ రోగుల కోసం ఎదరు చూడాల్సిన దుస్థితి రిమ్స్‌లో నెలకొంది.

అందుబాటులోలేని రిమ్స్ డైరెక్టర్

వైద్య సౌకర్యలు, పేదలకు అందుతున్న వైద్యంపై వివరణ కోరేందుకు ఒంగోలు రిమ్స్ డైరెక్టర్ మస్తాన్ సాహేబ్‌ను సంప్రదించగా తాను సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్, స్కానింగ్ పరికరాల పనితీరు, రిమ్స్‌లో ఉన్న వైద్య సౌకర్యాలపై క్రిందిస్థాయి సిబ్బందిని ప్రశ్నించగా డైరెక్టర్ అనుమతి లేకుండా తాము ఎలాంటి వివరాలు చెప్పబోమని స్పష్టం చేశారు.

ఏపీ టెట్

(మొదటిపేజీ తరువాయి)

డౌన్‌లోడింగ్ చేసుకు న్నారు. టెట్ పేపర్-1, పేపర్-2, పేపర్-3 పరీక్షలకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో కలిపి 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఇందులో ఏపీలో 159, హైదరాబాద్-7, బెంగుళూరు-10, చెన్నయి-7 పరీక్షా కేంద్రాలున్నాయి.టెట్ పరీక్షలను మార్చి 2వరకూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు (సెషన్-1), మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ (సెషన్-2) నిర్వహిస్తారు. ప్రతిరోజూ సగటున 52వేల మంది, ప్రతి సెషన్‌కూ 26వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పేపర్-1 పరీక్షకు ఎస్జీటీ, పేపర్-2కు స్కూలు అసిస్టెంట్స్(అన్ని సబ్జెక్టులు), పేపర్-3కు భాషా పండితులు(తెలుగు/హిందీ/సంస్కృతం/ఉర్దూ/ఇంగ్లీషు) రాస్తారు. టెట్ పరీక్షలను(పేపర్-1,2,3)లను 150 మార్కుల చొప్పున 150 నిమిషాలకు(2.30 గంటలు) నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున పూర్తిగా ఆబ్జెక్టివ్ టైపులో పేపర్-1,2,3లు వుంటాయి.మైనస్ మార్కులు లేవు. బీఈడీ, ఎస్జీటీ, లాంగ్వేజీ పండిట్లలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు.ఇందులో అర్హత సాధించిన వారికే డీఎస్సీ(టీఆర్టీ)కి దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పిస్తారు.దీంతో టెట్ పరీక్షకు భారీగా అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఏపీలో తొలిసారిగా ఆన్‌లైన్లో టెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా ఏపీ టెట్‌ను నిర్వహిస్తున్నారు.2014లో ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యాన టెట్ కమ్ టీఆర్టీని నిర్వహించిన విషయం విదితమే. విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు టెట్ రాయాలనే నిబంధన విధించారు.దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 2011, 2012, 2013లో టెట్‌ను ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తొలిసారిగా ఆన్‌లైన్లో నిర్వహించడంపై ప్రభుత్వానికి పెద్ద సవాళ్లుగా నిలిచింది.ఏపీ టెట్-2017 నోటిఫికేషన్ వెలువడ్డాక రెండు విడతలుగా టెట్‌ను వాయిదా వేసిన విషయం విదితమే. అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల నుంచి హాల్ టిక్కెట్ల కేటాయింపు వరకూ అడుగడుగునా ఆటంకాలు నెలకొ న్నాయి. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.జిల్లాలు, రాష్ట్రాలు దాటి అభ్యర్థులకు సెంటర్లు కేటాయించారు.విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో టెట్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల నిర్వహణపై లోపాలు ఎదురయ్యాయి.దీంతో రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగి..ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. దూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు నమోదైన అభ్యర్థులకు మార్చుకునేందుకు మరోమారు అవకాశం కల్పించారు.మొత్తంమీద టెట్ హాల్ టిక్కెట్లు, పరీక్షా కేంద్రాల కేటాయింపులో గందరగోళం నెలకొంది. నేటి నుంచి ఆన్‌లైన్లో నిర్వహించనున్న టెట్ పరీక్షలకు సమర్థవంతంగా సౌకర్యాల్ని కల్పించాల్సిన అవసరముంది.సాంకేతిక పరిజ్ఞానమున్న అభ్యర్థుల్ని ఇన్విజిలేటర్లుగా కేటాయించాలి.లేకుంటే అభ్యర్థులకు ఎదురైన సాంకేతిక అంశాలకు క్షణాల్లో సమాధానాలివ్వాల్సిన అవసరముంది.కంప్యూటర్ల పనితీరు మంచిగా వుండాలి.జనరేటర్లు అందుబాటులో వుండాలి.ఈ సౌకర్యాలు అందుబాటులో లేకుంటే అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారు.

13జిల్లాల డీఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు

రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలలో నిర్వహిస్తున్న టెట్ పరీక్షలను ఆయా జిల్లాల డీఈవోలు పర్యవేక్షించనున్నారు.ఆన్‌లైన్ సెంటర్లలో అభ్యర్థులకు అసౌకర్యం నెలకొంటే సంబంధిత జిల్లా డీఈవోలకు ఫిర్యాదు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.జిల్లాల వారీగా డీఈవోల సెల్ నంబర్ల వివరాలిలా వున్నాయి. శ్రీకాకుళం- 83099 84127, విజయనగరం - 7386788802, విశాఖపట్నం - 9440 340518, ఈస్ట్‌గోదావరి - 9494467452, వెస్ట్ గోదావరి - 9491 969299, కృష్ణా - 9177187187, గుంటూరు - 9959121146, ప్రకాశం - 9704440129, నెల్లూరు - 7995501402, చిత్తూరు - 8572229008, కడప - 9515243740, అనంతపురం - 73372 15212, కర్నూలు - 9849909243 నంబర్లకు ఫోన్‌చేయాలని అధికారులు వెల్లడించారు.టెట్ పరీక్ష రాసే పీహెచ్‌సీలు, గర్భిణీలు, అంధులకు అదనంగా 50 నిమిషాల సమయాన్ని కేటాయించినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ టెట్ హెల్ప్ లైన్ నంబర్లు

ఏపీ టెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం హెల్ప్ లైన్లను అందుబాటులో వుంచింది.టెట్ అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం ఎదురైనా 9505619127, 9505780616 నంబర్లకు ఫోన్ చేయాలి.హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడింగ్‌లో సమస్యలు, హాల్‌టిక్కెట్లలో తప్పులు నమోదైన అభ్యర్థులంతా హెల్ప్‌లైన్లకు ఫోన్‌చేసి సందేహాల్ని నివృత్తి చేసుకోవాలి.

మార్చి 12న టెట్ ఫైనల్ కీ : ఏపీ టెట్ పరీక్షలను ఈ నెల 21 నుంచి మార్చి 2వ తేదీ వరకూ కొనసాగుతాయి. మార్చి 4న ప్రాథమిక కీ, 12న ఫైనల్ కీ విడుదల చేస్తారు. మార్చి 16న తుది ఫలితాలను విడుదల చేస్తారు. టెట్ పరీక్షల ఫలితాల అనంతరం డీఎస్సీ షెడ్యూలును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది.

ఐక్యపోరు అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉండదని, కేంద్రంలో ప్రభుత్వం మారితే ప్యాకేజి అమలు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. దూర దృష్టితో ఆలోచించే చంద్రబాబు నాలుగేళ్ల కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. ఇటీవల ప్రవేశపె ట్టిన బడ్జెట్‌లో తెలుగు ప్రజలకు అన్యాయం చేస్తే అప్పుడే పార్లమెంట్‌లో తెలుగు దేశం పార్టీ ఎంపీలు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంట్‌లో టీడీపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్రంలోని ఇతర పార్టీలతో పాటు తెలంగాణలోని అధికార పార్టీల మద్దతు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర స్థాయిలో అన్ని పార్టీలతో కలిసి పోరాటం సాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు బీజేపీ తమ పాలనను పరిశీలించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. 2014 వరకు దేశంలో రూ. 2 లక్షల కోట్లు బ్యాంకుకు నగదు ఎగవేత ఉంటే 2014 నుంచి ఇప్పటి వరకు ఆ మొత్తం రూ. 7.85 లక్షల కోట్లకు చేరిందన్నారు. దేశం నుంచి అవినీతి బడా బాబులు పారిపోతుంటే అడ్డుకోలేని ప్రధాని దేశంలోని డిపాజిటర్లపై ఒత్తిడి పెంచడం ఎంతవరకు సమంజ సమన్నారు. దేశంలో మూడు పార్లమెంట్ స్థానాలకు ఒక ప్రైవేట్ వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు కల్పిస్తున్నా రని నారాయణ విమర్శించారు. సీపీఐ జిల్లా కార్య దర్శి ఏ. రామానాయుడు మాట్లాడుతూ బుధ, గురు వారాల్లో చిత్తూరులో జరిగే సీపీఐ జిల్లా మహాసభల్లో చిత్తూరు జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై చర్చించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి జె. విశ్వనాథ్ పాల్గొన్నారు.

అఖిల సంఘాల కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలనే కాకుండా విభజన హామీల కోసం కలిసివచ్చే అన్ని ప్రజా సంఘాలతో ఢిల్లీ వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అఖిలపక్షం ఏర్పాటుకు బదులు అఖిల సంఘాల కమిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం నిర్ణయం తీసుకోవటంలో కూడా హోదా పోరాటం ఉధృతం చేసేందుకేనని అర్థమవుతోంది. శాసనసభలో అన్ని రాజకీయ పార్టీలకు స్థాన బలం లేకపోవటంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కమిటీ ఏర్పాటు చేయటమంటే హోదా ఉద్యమాన్ని ఉగ్రరూపంగా దాల్చి కేంద్రాన్ని గందరగోళంలోకి నెట్టే ఆలోచనతోనే సీఎం అఖిల సంఘాల కమిటీ ఏర్పాటుకు నిర్ణయించినట్లు అర్థమవుతోంది. పార్లమెం ట్‌లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రత్యేక హోదా ద్వారా రాష్ట్రానికి ఏమేమి ఇస్తామన్నారో ఆ ప్రయోజ నాలు దక్కాల్సిందేనని, అప్పటివరకు వెనుదిరిగి చూడకూడదని సీఎం ఖరాకండిగా తన పార్టీ నేతలకు సూచించారు. అవిచ్చాం, ఇవిచ్చామంటూ బీజేపీ నాయ కులు చేస్తున్న ప్రకటనలను తప్పుబట్టారు. బీజేపీ నేతలు రాష్ట్రం గురించి అడగకుండా టీడీపీని ప్రశ్నిం చటాన్ని ఆయన ఆక్షేపించారు. జగన్ ఏపీకి న్యాయం జరగకూడదన్న ఆలోచనతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమి చేసినా దిగిరాదని, అవిశ్వాస తీర్మానం పెట్టి పార్ల మెంట్‌లో తీవ్రస్థాయిలో చర్చ జరిపితేనే ఇప్పటికిప్పుడు కాకపోయినా భవిష్యత్తులోనైనా ఏపీకి మేలు జరుగుతుందన్న అభిప్రాయంతోనే చంద్రబాబు ఏపీకి ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

ఏపీ దుమ్మా

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యబోర్డు (కేఆర్ఎంబీ) నీటి పంప కాల్లో స్తబ్ధత నెలకొని ఉందన్నారు. ఇంకా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆధునీకరణ పనులకు ఏపీ అవరోధాలను కలిగిస్తోందని మేఘ్వాల్ దృష్టికి తీసుకొచ్చారు. కాళేశ్వరం విష యంలో ఏపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకల మధ్య ఆర్డీఎస్‌పై త్రిపాక్షిక వప్పందాన్ని అమలుచేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో కూడా కేంద్రం తప్పనిసరిగా జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత 14 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ తుది తీర్పు రాకపోవడం దురదృష్టకరమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జలవివాదాలకు జాతీయ స్థాయిలో ఒకే ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని హరీష్‌రావు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారం కోసం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సూచన మేరకు ఏర్పాటు చేసిన సదస్సుకు ఏపీ కూడా హాజరై ఉంటే పలు సమస్యలకు పరిష్కారం లభించి ఉండేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా నాగార్జునసాగర్ కుడి,ఎడమ కాల్వలకు నీటి విడుదలలో తెలంగాణ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు అవకాశం ఉందంటున్నారు. అలాగే కర్ణాటకతో ఉన్న వివాదాల్లో కూడా కొన్నైనా పరిష్కారమయ్యేవని చెబుతున్నారు. అత్యంత ముఖ్యమైన సదస్సుకు హాజరు కాకుండా రాష్ట్ర జలవనరులశాఖ కార్యాలయంలో సొంత నియోజకవర్గమైన మైలవరం అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడమే కాకుండా తన శాఖతో సంబంధంలేని ప్రధానోపాధ్యాయుల సమావేశానికి హాజరుకావడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావును 'విశాలాంధ్ర' ప్రతినిధి ప్రశ్నిస్తే.. ఈ సదస్సుకు అంతగా ప్రాధాన్యం లేదని చెప్పడం గమనార్హం.

అగ్రిగోల్డ్ కేసు విచారణ మార్చి 5కు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్: సుమారు 20 లక్షల మంది నుంచి అక్రమంగా డిపాజిట్లు సేకరించిన అగ్రిగోల్డ్ కేసును మార్చి 5కి హైకోర్టు వాయిదా వేసింది. మంగళవారం అగ్రిగోల్డ్ కేసుపై విచారణ జరిగింది. అగ్రిగోల్డ్ ఆస్తులను టేకోవర్ చేయడానికి సిద్ధమని జీఎస్సెల్ సంస్థ స్పష్టం చేసింది. తమకు ఆస్తుల వివరాలు ఇవ్వాలని హైకోర్టును కోరింది. ఇప్ప టికే రూ.10 కోట్లు డిపాజిట్ చేశామని, మార్చి 5నాటికి మరో వెయ్యి కోట్లు డిపాజిట్ చేస్తామని వివరించింది. అగ్రిగోల్డ్ ఆస్తులను టేకోవర్ చేసు కునేందుకు జీఎస్సెల్ ముందుకు రావడంతో.. ఆస్తులకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లు, రిజిస్ట్రేషన్ల వివరాలను రెండు వారాల్లో సమర్పిం చాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ధర్మాసనం మార్చి 5కు వాయిదా వేసింది. రెండు వారాల్లో ఫైళ్లు, బ్యాంకు స్టేట్‌మెంట్లను అందిం చాలని అగ్రిగోల్డ్‌కు హైకోర్టు స్పష్టం చేసింది.



ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం వనరుల కోసం సిబ్బంది సమ్మె

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం వనరుల సమీకరణ, నిధుల పరిరక్షణ కోసం మంగళవారం విజయవాడలో సమ్మె చేపట్టారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం, వనరుల సమీకరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన విశ్వవిద్యాలయం ఆవరణలో కొద్దిసేపు సిబ్బంది ఆందోళన నిర్వహించారు.దీనికి ఏపీఎన్జీవో జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం ఏర్పడి 32 ఏళ్లవుతున్నప్పటికీ, ఇంతవరకూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించలేదని పేర్కొన్నారు.జీవో నంబరు 8ను రద్దు చేసి, విశ్వవిద్యాలయం నిధులు దారిమళ్లకుండా చూడాలని ఆయన డిమాండు చేశారు.ఈ ఆందోళనలో ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు ఎండీ ఇక్బాల్, డి.సత్యనారాయణరెడ్డి, విశ్వ విద్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉద్యోగులకు ఏపీ పీసీసీ డాక్టర్స్ సెల్ కో చైర్మన్ డాక్టర్ అంబటి రాధాకృష్ణ మద్దతు తెలిపారు.

ప్యాకేజీతో మోసగించొద్దు- ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు : అంబటి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీతో మోసగించొద్దనీ, ప్రత్యేక హోదానే ఆంధ్రుల హక్కనీ వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏపీకి ప్రత్యేక హోదా కోసం మార్చి 20వరకూ లోక్‌సభలో అన్ని పార్టీల ఎంపీల మద్ధతును కూడగడతామని స్పష్టం చేశారు. తాము ప్రకటించిన షెడ్యూలు ఆధారంగా మార్చి 20వరకు నిరసనలు, ఆందోళనలు, ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు.గల్లీ నుంచి ఢిల్లీ వరకూ అందర్నీ కలుపుకుని వెళ్తామని వివరించారు.మార్చి 21న లోక్‌సభలో అవిశ్వాసం పెడతామన్నారు. 198 నిబంధన కింద అవిశ్వాస తీర్మానం ఎలా ఇవ్వాలనేదీ ప్రొసీజర్ వుంటుందని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ గమనించాలని సూచించారు.

చింతమనేనిపై అనర్హత వేటు వేయాలి .. వైసీపీ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర అమరావతి : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై అసెంబ్లీ కార్యదర్శికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం చింతమనేనిని అనర్హుడిగా ప్రకటించాలని వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, కొటారు రామచంద్రరావు తదితరులు అసెంబ్లీ కార్యదర్శి విజయరాజు ను కలిసి ఫిర్యాదు చేశారు.

కాగా టీడీపీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్కు భీమడోలు కోర్టు జైలుశిక్ష విధించిన విషయం విదితమే. ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు జైలుశిక్ష పడ్డవారిని చట్ట ప్రకారం అనర్హుడిగా ప్రకటించాలని అన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రవర్తన అందరికీ తెలిసిందే అని, స్పీకర్ ఈ విషయంలో తక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేల అనర్హతలపై ప్రజాస్వామ్యం ఉందా లేదా అన్న ఆందోళన ప్రజల్లో ఉందని, కనీసం ఎమ్మెల్యే చింతమనేనిపైన అయినా చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని, అసెంబ్లీ కార్యదర్శికి కోర్టు జడ్జిమెంట్ కాపీలను కూడా అందచేసినట్లు తెలిపారు. అప్పీల్‌తో సంబంధం లేకుండా చింతమనేనిపై అనర్హత వేటు వేయాలని అన్నారు.

హామీలు బేఖాతర్..



- కొత్త బోర్లు లేనట్లే..
- 'ఎన్టీఆర్ జలసిరి'లో సర్దుబాటుకే పరిమితం
- పలు జిల్లాలకు కనెక్షన్లలో కోత

ఎన్టీఆర్ జలసిరి పథకం లక్ష్యాలు

జిల్లా పేరు	ఇప్పటివరకు చేసినవి మంజూరు	తాజాగా సవరించిన లక్ష్యం
అనంతపురం	0	0
చిత్తూరు	1049	1000
తూర్పుగోదావరి	3240	2000
గుంటూరు	3000	1100
కడప	685	700
కృష్ణా	2500	600
కర్నూలు	2500	800
ప్రకాశం	7500	6500
నెల్లూరు	3100	1600
శ్రీకాకుళం	3000	9000
విశాఖపట్నం	1555	2000
విజయనగరం	4371	9000
పశ్చిమగోదావరి	2500	7000
మొత్తం	**35,000**	**35,000**

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : 'ప్రతీ ఎకరాకూ నీరందిస్తాం. నదులను అనుసంధానిస్తాం. జిల్లాకు కొత్తగా 25 వేల బోర్లు మంజూరు చేస్తాం. రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం...' ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీ. ఇదే హామీని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కూడా ఆయన ఉద్ఘాటించారు. దాదాపు ఇలాంటి హామీలనే మిగిలిన జిల్లాల పర్యటనల్లో కూడా గుప్పించారు. కార్యరూపంలోకి వచ్చేటప్పటికి వాటన్నిటినీ పక్కన పెట్టేశారు. ఎన్టీఆర్ జలసిరి కింద కొత్త బోర్ల మంజూరును అటకెక్కించేసి, ఇప్పటికే మంజూరైన వాటిని జిల్లాల్లో సర్దుబాటు చేసేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితమే ప్రభుత్వం నుంచి తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో కొత్త కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న కొన్ని జిల్లాల్లోని రైతులకు మొండిచెయ్యి ఎదురయింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు ఎన్టీఆర్ జలసిరి పథకం కింద 35 వేల బోరు బావులు మంజూరయ్యాయి. వీటిని ఆయా జిల్లాల అవసరాలను, డిమాండును బట్టి కేటాయించారు. ఉత్తరాంధ్రలోని విజయ నగరం జిల్లాకు 4,371, విశాఖపట్నానికి 1,555, శ్రీకాకుళానికి 3,000 బోర్లు మంజూరయ్యాయి. కానీ తాజా గా సవరించిన లక్ష్యాలు మేరకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కేటాయింపును 9,000కు పెంచగా, విశాఖపట్నానికి మాత్రం 2 వేలకు తగ్గించారు. మిగిలిన జిల్లాల్లో కూడా లక్ష్యాన్ని భారీగా కుదించారు. తాజా కేటాయింపుల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కొద్దిగా పెరిగినప్పటికీ, విజయనగరం జిల్లాకు సీఎం ఇచ్చిన హామీ మేరకు అదనంగా 25 వేల కనెక్షన్లు మంజూరు కాలేదు. వాస్తవానికి ఎన్టీఆర్ జలసిరి పథకానికి క్షేత్రస్థాయిలో భారీగా డిమాండు ఉంది. ఇది నిజంగా రైతుల పాలిట వరప్రదాయినే. లబ్ధిదారుడు కేవలం రూ.25 వేలు భరిస్తే, బోరు బావితో కలిపి సుమారు రూ.4 లక్షల విలువైన సోలార్ పంప్ కనెక్షన్ ఉచితంగా మంజూరవుతుంది. ఎస్సీ, ఎస్టీ రైతులైతే కేవలం రూ.6 వేలు భరిస్తే చాలు. దీంతో రైతులంతా ఎన్టీఆర్ జలసిరి పథకానికి ఎగబడుతున్నారు. జిల్లాకు కేటాయించిన కొత్త కనెక్షన్ల కోసం వేచి చూస్తుండగా, తాజాగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వారి ఉత్సాహంపై నీళ్లు జల్లాయి. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కూడా కార్యరూపం దాల్చకపోవడం వారిని హతాశులను చేసింది.



నీటి విడుదలపై కేఆర్ఎంబీకి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 3వ జోన్‌కు వెంటనే సాగర్ జలాలను విడుదల చేసి ఆరుతడి పంటలను రక్షించాలని ఆంధ్రప్రదేశ్ సాగునీటి సంఘాల సారధులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ వైకే శర్మకు ఇ-మెయిల్ ద్వారా మంగళవారం వినతి పత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల చెన్నకేశవరావు మాట్లాడారు. కేఆర్ఎంబీ ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఎడమ కాలువ 2,3 జోన్లలో 3.60 లక్షల ఎకరాల ఆయకట్టులో ఆరుతడి పంటలకు నవంబరు నుంచి ఫిబ్రవరి వరకూ నాలుగు విడతలుగా 14.427 టీఎంసీలను కేటాయించినప్పటికీ నీటి నష్టాలతో కలిపి 8.96 టీఎంసీలను మాత్రమే తెలంగాణ విడుదల చేసిందన్నారు. ఈనెల 8వ తేదీన కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శిని స్వయంగా కలసి 3వ జోన్‌కు నీటిని విడుదల చేయాలని కోరితే 11వ తేదీన అతికష్టంగా నీటిని వదిలి, 16న నిలిపివేసిందన్నారు. తాము అందచేసిన వినతి పత్రంపై స్పందించిన కేఆర్ఎంబీ చైర్మన్ వెంటనే సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు తెలిపారు.

ఉద్యోగులకు అవగాహన సదస్సులు అవశ్యం

ఆదాయానికి మించి ఆస్తులపై

- రెండు మూడు రాష్ట్రాల్లోనే ఏసీబీ అరెస్టులు
- అరెస్టు కాలపరిమితిని తగ్గించండి
- డీజీపీ ఠాకూర్‌కు ఎన్‌జీఓ సంఘం నేతల వినతి



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఆదాయానికి మించి అక్రమాస్తుల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ అశోక్‌బాబు కోరారు. అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాలన్నారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ పరిపాలన భవన్‌లోని ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్‌ను ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రంలో ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెడుతున్న అధికారులు, అవినీతికి పాల్పడుతున్న వారిపై వరుసగా దాడులు చేస్తున్నారు. ఈ దాడులతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులలో భయాందోళన ప్రారంభమైంది. ఈ నేపధ్యంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఏసీబీ డీజీపీని కలవటం చర్చనీయాంశమైంది. ఉద్యోగులకు ఆదాయానికి మించిన ఆస్తులపై అవగాహన సదస్సులను నిర్వహించండి. ఈమధ్య కాలంలో జరుగుతున్న ఏసీబీ దాడులు, వాటి పరిణామాలు ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉన్నాయని అశోక్‌బాబు వివరించారు. అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవ టంలో ఉద్యోగ సంఘ నాయకులుగా తాము హర్షిస్తామన్నారు. అయితే అవినీతి కేసులో పట్టుబడిన ఉద్యోగికి సంబంధించి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పట్టుబడిన దానికి, మీడియాలో వస్తున్న కథనాలకు పొంతన ఉండటంలేదన్నారు. విచారణ అధికారి ఏదైతే రిపోర్టు ఇస్తారో, దానినే మీడియాకు విడుదల చేయాలని, ఈ విషయంలో తమకెలాంటి అభ్యంతరంలేదన్నారు. కాగా, దేశంలో రెండు మూడు రాష్ట్రాల్లోనే ఏసీబీ దాడులలో ఉద్యోగులను అరెస్టులు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అరెస్టులపై ఆలోచన చేయాలని, అరెస్టుల కాలపరిమితిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అవినీతి కేసులలో ఉద్యోగుల అరెస్టులు, వాటి వల్ల వారి కుటుంబ సభ్యులకు మానసికంగా ఎదురయ్యే సమస్యలు, ఆదాయానికి మించి ఆస్తులపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విన్నవించారు. ఏసీబీ డీజీపీని కలిసిన వారిలో ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు ఏ విద్యాసాగర్, వీరంద్రబాబు, రమణ, బండి శ్రీనివాసరావు ఉన్నారు.

21న మంత్రి మండలి సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 21న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం ఉదయం వెలగపూడి సచివాలయంలోని సమావేశ మందిరంలో మంత్రివర్గం భేటీ జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ తెలిపారు.

'పులిచింతల' రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 27.81 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: డాక్టర్ కేఎల్‌రావు సాగర్ పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రిటైనింగ్‌వాల్, బ్యాక్ ఫిల్లింగ్ నిమిత్తం రూ. 27.81 కోట్లను జల వనరులశాఖ మంజూరు చేసింది. ఈ మేరకు ఆశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళ వారం జీవో జారీ చేశారు. ఈ పనుల కోసం కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ రూ. 31.26 కోట్లు అవసరమవుతాయని లేఖ రాయగా దానిని పూర్తిగా అధ్యయనం చేసి 27.81 కోట్లను విడుదల చేసేందుకు పాలనపరమైన ఆమోదాన్ని తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసారు. కార్మికులకు విద్యుత్‌శాఖే నేరుగా జీతాలివ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు పరిహారం చెల్లించాలని రెండు దశాబ్దాలుగా కోరుతున్నారని తెలిపారు. వాటిని ఇంతవరకూ పరిష్కరించకపోవడం దారుణమన్నారు. విద్యుత్ సరఫరాలో కిందిస్థాయిలో కీలకపాత్రను పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.



ఇరిగేషన్ అధికారులపై పీఏసీలో చైర్మన్, సభ్యుల ఆగ్రహం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలోని పలు ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అంశాలపై మంగళవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ఇరిగేషన్ అధికారులపై చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1627కోట్లతో నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల 276.80కోట్ల పంట లాభాలు రైతులకు చేకూరతాయన్నారు. తీరా 120కోట్లకే చూపిస్తున్నారు. ఎంత ఆయకట్టు నీరు అందిందీ, ఎంత మంది రైతులు లాభపడ్డారు, ఎంత మంది ప్రజలకు తాగునీటి సరఫరా అందించారు, తాగునీరు అందించేందుకు లబ్దిదారులను గుర్తించారా, ఎన్ని పరిశ్రమలకు నీరిచ్చారు, వాటివల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయమెంత అంటూ పీఏసీలో చైర్మన్ బుగ్గన ఇతర సభ్యులు ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు సరిగా సమాధానం ఇవ్వకపోవటంతో బుగ్గన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నిర్మించిన ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా జరుగుతున్న ప్రయోజనాల గురించి వివరాలు అడిగినా అధికారులు నీళ్ళు నమలడంపై వారు మండిపడ్డారు. అలాగే ఎక్సైజ్ డ్యూటీతో పాటు లేబర్ సెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని, కాంట్రాక్టర్లు ఇచ్చిన అగ్రిమెంట్‌లో వివరాల గురించి సభ్యులు ప్రశ్నించినా అధికారులు స్పష్టత ఇవ్వలేదు. 2006లో పూర్తి కావాల్సిన 8 ఇరిగేషన్ ప్రాజెక్టల నిర్మాణం ఇప్పటివరకు పూర్తి చేయకపోవటంపై కూడా చైర్మన్ అధికారులను నిలదీశారు. 8 ప్రాజెక్ట్‌లకు ఎంత భూమి అవసరమనేది ఇప్పటివరకు ఎందుకు నిర్ణయించలేదని, భూ సేకరణ లబ్దిదారులకు పునరావాసం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఎన్ని కుటుంబాలకు పునరావాసం కల్పించారో కూడా అధికారులు చెప్పకపోవటంపై చైర్మన్ ఆవేదన వెలిబుచ్చారు.పై 8 ప్రాజెక్ట్‌లు పూర్తి చేయనందువల్ల 20,613 ఎకరాలకు నీరు అందించలేకపోయారని, 37.52కోట్లు నిరుపయోగం కావటానికి అధికారులే కారణమని నిందించారు. పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను 297.20కోట్లను మంజూరు చేశారు. కాంట్రాక్టర్ 2006లో 1.86లక్షల ఎకరాలకు నీరు ఇస్తామని చెప్పారు. కానీ ఇరిగేషన్ శాఖ 1.45లక్షల ఎకరాలకే అని అధికారులు అంటున్నారు. కాగ్ నివేదిక ప్రకారం 1312.95 కిలోమీటర్ల ఫీల్డ్ ఛానల్స్ అవసరమని గుర్తించిందని, వాటి ద్వారా నీరు అందించటానికి తీసుకున్న చర్యలపై సమావేశంలో చర్చ జరిగింది. దీంతో అధికారులు త్వరలో దశలవారీగా పనులు పూర్తిచేస్తామని సమాధానమిచ్చారు. సమావేశంలో సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఆదిమూలం సురేష్, బీదా రవిచంద్ర, కెఎ.నాయుడు, పిల్లి సుబాస్‌చంద్రబోస్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ప్రాజెక్టల ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఢిల్లీకి రండి సీఎస్‌కు కేంద్రం కాల్

23న ఢిల్లీకి వెళ్ళనున్న ఉన్నతాధికారులు

విశాలాంధ్ర అమరావతి : ఏపీలో రాష్ట్ర ప్రయోజనాల గురించి జరుగుతున్న పరిణామాలపై కేంద్రం స్పందించింది. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందంటూ విభజన హామీలు అమలు కాలేదంటూ బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న అధికార తెలుగుదేశం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ఎంపీలు ఎదురు తిరగటంతో పాటు ఈ విషయంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు ఆందోళనకు దిగటంతో కేంద్రం స్పందించి ఏపీకి సంబంధించిన వ్యవహారాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల ముఖ్య కార్యదర్శులను ఈ నెల 23న ఢిల్లీకి రావాలని కేంద్ర హోంశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. ఆ రోజు ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర సమస్యలపై కీలక సమావేశం ఉన్నందున, ఆ రోజు నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని బుధవారం జరుపుతున్నారు. ఢిల్లీలో జరిగే సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌తో పాటు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, విభజన వ్యవహారాల కార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర, మౌలికవసతులు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఇతర అధికారులు పాల్గొననున్నారు. ఏపీకి చేయాల్సిన ఆర్థిక సాయం, ఇప్పటి వరకు చేసిన మేలు వివరాలతో పాటు ఇతర అంశాలపై కేంద్ర హోంశాఖ సమావేశం నిర్వహించాలని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి హోంశాఖకు ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీ, ప్రత్యేక హోదాతో సమానమైన లబ్ధి కోసం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ, అందులో భాగంగా విదేశీ రుణ సాయంతో నడిచే ఈఏపీలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద చేయాల్సిన సాయం తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. విశాఖ రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టుకు బదులు వేరే ప్రాంతంలో పోర్టును ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంతో పాటు షెడ్యూలు 9, 10, 13లలోని కీలక వ్యహారాలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్రం నుండి పిలుపురావటంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గత నాలుగేళ్ళుగా కేంద్రం నుండి ఎంత అందాలి, ఎంత అందిందన్న అంశంపై సమగ్ర సమాచారంతో ఢిల్లీ వెళ్ళనున్నారు.

హోదాపై మీ వైఖరేమిటి?

టీడీపీ, వైసీపీలను ప్రశ్నించిన పల్లంరాజు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల హక్కుల సాధనపై టీడీపీ, వైసీపీ వైఖరిని వెల్లడించాలని కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు డిమాండు చేశారు.విజయవాడలోని పీసీసీ కార్యాల యంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటు సాక్షిగా ఏపీకి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ, విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఏపీ ప్రయోజనాల కోసం ఈ నెల 19వ తేదీ నుంచి 28వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలను నిర్వహిస్తున్నామని, మార్చి 2న ఏపీలో రాస్తారోకో నిర్వహిస్తామని వెల్లడించారు. ఢిల్లీలో మార్చి 6,7,8 తేదీల్లో చలో పార్లమెంటు పేరిట ప్రత్యేక ప్రదర్శనలు చేపడతామని పేర్కొన్నారు. నాలుగేళ్లయినా ఇచ్చిన హామీలను కేంద్రం ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు.ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలపైనా ప్రభుత్వం అశ్రద్ధ చూపుతోందన్నారు. చాలా ప్రాజెక్టులు రాష్ట్రానికి ఇవ్వలేదని వాపోయారు. ఇప్పటివరకూ కేంద్రం కేటాయించిన నిధులు, వాటిని ఖర్చు చేసిన వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వం లెక్క చూపకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. హోదా కోసం గుంటూరులో కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాకు విచ్చేసిన రాహుల్ గాంధీని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసిందని గుర్తుచేశారు. టీడీపీ, వైసీపీ పార్లమెంటులో ఏం చేయాలనుకున్నదీ ఇప్పటివరకూ స్పష్టం చేయకపోవడం దురదృష్టకరంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు నరహరిశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖుర్షీదా, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు నిమ్మల జ్యోతిక, గుర్నాథం పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆకుల



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ చెప్పారు. బీజేపీ అధికారంలోకి రాక మునుపు, వచ్చిన తర్వాత కూడా తెలుగు ప్రజల ఆకాంక్షల మేరకే పని చేస్తోందని ఆయన అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజనన చట్టంలో ఉన్న హామీలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. చట్టంలో లేని వాటిని కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకుని, అభివృద్ధిని అడ్డుకునే యోచన బీజేపీకిలేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి అన్యాయం జరగలేదని, వివక్షకు ఆస్కారమేలేదని తెలిపారు. విభజన సమయంలో రాష్ట్రం గురించి ఆలోచించని పార్టీలన్నీ నేడు ప్రజలకేదో అన్యాయం జరిగిందని ఆరోపించటాన్ని ఆయన తప్పుపట్టారు. విభజన అనివార్యమని తెలిసి కూడా కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి కావాల్సిన అంశాల గురించి మాట్లాడలేదన్నారు. బీజేపీ ఒక్కటే రాష్ట్రం తరపున మాట్లాడి న్యాయం చేసేందుకు ప్రయత్నించిందని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదా ఇచ్చే అవకాశంలేనందున, హోదా వల్ల లభించే ఆర్థిక సహాయానికి సమానమైన నిధులను రాష్ట్రానికి అందిస్తున్నట్లు ఆకుల సత్యనారాయణ తెలిపారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ శ్రీనివాసరావు, మీడియా సెల్ ఇన్‌చార్జి పి దిలీప్ పాల్గొన్నారు.

సంపాదకీయం

మైత్రి మారాకు

భారత్–ఇరాన్ మైత్రి మారాకు వేసేందుకు ఆ దేశాధ్యక్షుడు హసన్ రౌహానీ పర్యటన దోహదం చేస్తుంది. ఉభయ దేశాల మధ్య స్నేహ సంబంధాల్లో ఎన్ని ఒడుదొడుకులు తలెత్తినా కాలపరీక్షకు తట్టుకొని నిలుస్తుందని రౌహానీ మూడురోజుల భారత పర్యటన నిరూపించింది. ప్రధాని నరేంద్ర మోడీ 2016లో ఇరాన్ పర్యటనకు కొనసాగింపుగా రౌహానీ ఇక్కడికొచ్చారు. ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్వుతున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇక్కడికి వచ్చి వెళ్లిన నెలరోజులకే రౌహానీ రావడం విశేషం. ఈ సందర్భంగా ఉభయ దేశాల మధ్య తొమ్మిది ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య పెట్టుబడులు, సేవల విస్తరణకు వీలుగా ద్వంద్వ పన్నుల నివారణ, వైద్యం, ఇంధన రంగాల్లో సహకారం, నేరస్తుల అప్పగింత తదితర ఒప్పందాలు కుదిరాయి. గత డిసెంబరులో తొలి దశ నిర్మాణం పూర్తయిన చాబహార్ ఓడరేవు కార్యకలాపాల్లో పాలుపంచుకోవడంపైనా కీలకమైన ఒప్పందం చేసుకున్నాయి. రియాల్ కరెన్సీల్లో చెల్లింపులు నిరాఘాటంగా సాగించేందుకు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ఇరాన్ ప్రపంచ చమురు నిల్వల్లో మూడో స్థానం, సహజవాయువు నిల్వల్లో రెండోస్థానంలో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థకు ఇంధన అవసరాలు భారీగా ఉన్నాయి. చారిత్రకంగా, భౌగోళికంగా.. ఎటుచూసినా ఈ రెండు దేశాల మధ్య స్నేహబంధాలు విస్తృతం కావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా రౌహానీ పర్యటన ఓ ముందడుగుగానే చెప్పాలి. పాకిస్థాన్‌తో పనిలేకుండా ఆఫ్ఘనిస్థాన్‌తో నేరుగా వర్తకవాణిజ్యాలు నెరపేందుకు వీలు కల్పించే చాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలిని అభివృద్ధి చేస్తే, లక్షా 30వేల కోట్ల రూపాయలతో రైల్వే లైన్ సహా పెట్రో రసాయనాలు, ఉక్కు ఎరువుల కర్మాగారాలు నెలకొల్పే అవకాశం ఉంటుందని గతంలోనే గుర్తించారు. మూడు నెలల కిందట తొలిసారిగా గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయం నుంచి గోధుమలతో నౌక చాబహార్ చేరుకోవడం, అక్కడి నుంచి వాటిని ఆఫ్ఘనిస్థాన్ తరలించడం ఓ నూతన పరిణామమే. ఇది మన అభివృద్ధికి కొత్త బాటలు వేయడమే. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడే 2001లో ఆ దేశంలో పర్యటించి 'టెహరాన్ డిక్లరేషన్' పై సంతకం చేశారు. ఇది రెండు దేశాల మధ్య దిక్సూచిగా పేరొందింది. ఇప్పుడు రౌహానీ పర్యటనతో ఈ రెండు దేశాల మైత్రి మారాకు వేసినట్లయింది.

పశ్చిమాసియా రణ రాజకీయాలను పరిశీలించినప్పుడు భారత్ ఇప్పుడు పరస్పరం శత్రుదేశాలుగా వ్యవహరిస్తున్నవాటితో ఏకకాలంలో మిత్రత్వం నెరుపుతోంది. గతంలో ఇరాక్‌తో ఇరాన్‌కు విభేదాలు తలెత్తడం.. అవి యుద్ధానికి దారితీయడం తెలిసిందే. అది చరిత్ర.. వర్తమానంలో ఆ రెండూ మిత్రదేశాలుగా మారాయి. ఇప్పుడు ఇజ్రాయిల్‌తో, మరోవైపు అమెరికాతో ఇరాన్‌కు శత్రుత్వం కొనసాగుతోంది. సిరియా కేంద్రంగా ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం పొడచూపే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే పలుచోట్ల ఇరాన్, సౌదీ అరేబియా ఘర్షణ పడుతున్నాయి. మరోవైపు ఇరాన్ చమురు సంపదపై కన్నేసిన అమెరికానే దానిపై రకరకాల ఆంక్షలు విధించి, ఇబ్బందులకు గురిచేసింది. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి పూనుకుంటున్నదని ఆరోపించి, భద్రతా మండలితో ఈ ఆంక్షలు అమలు చేయించింది. ఈ ఆంక్షల ప్రభావం మన దేశంపైనా చూపింది. ఒబామా పాలన తొలినాళ్లలో ఇరాన్‌తో మన స్నేహ సంబంధాలపై అమెరికా నుంచి అంటకాలెదురయ్యాయి. మన ఇంధన అవసరాలు తీర్చుకోవడానికి ఈ ఆంక్షలు ప్రతిబంధకాలయ్యాయి. మన దేశం నుంచి ఇరాన్‌కు అందాల్సిన సాయాన్ని అడ్డుకున్నాయి. చమురు, గ్యాస్, పెట్రో కెమికల్స్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవరోధం ఏర్పడింది. చాబహార్ ఓడరేవు నిర్మాణానికి మన దేశం ఒప్పందం ఖరారు చేసుకోబోతున్న దశలో అది ఆగిపోయింది. ఒబామా పాలన ముగుస్తున్న దశలో మరో ఐదు దేశాలను కలుపుకొని ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫలితంగా ఆంక్షలు సడలడంతో తిరిగి భారత్–ఇరాన్ సంబంధాలు పుంజుకొంటున్నాయి. మరో మూన్నాళ్లలో ఫ్రాన్స్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్' సదస్సు –'బ్లాక్ లిస్ట్' నుంచి తన పేరు తొలగించేలా సహకరించాలని భారత్‌ను ఇరాన్ కోరుతోంది. ఈ పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు, చర్యలతో మళ్లీ అనిశ్చిత వాతావరణం నెలకొంటోంది. ఇరాన్‌తో కుదిరిన అణుఒప్పందం సవరించాలని ట్రంప్ పట్టుబడుతున్నాడు. దీనికి బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. కాదంటే ఒప్పందం నుంచి వైదొలుగుతానని ట్రంప్ బెదిరిస్తున్నాడు. ఈ ఒప్పందానికి ట్రంప్ మంగళం పాడితే తన వైపు నిలిచేదెవరూ అనేది తేల్చుకోవడానికి ఇరాన్ సిద్ధమవుతోంది. రౌహానీ భారత్ పర్యటన వెనుక ఆ ఉద్దేశం ఉండి ఉండవచ్చు. ఇటీవల తన ఎఫ్–16 విమానాన్ని సిరియా కూల్చేశాక ఆగ్రహించిన ఇజ్రాయిల్.. ఇది ఇరాన్ పని అంటూ ఆరోపించింది. సిరియాతో కాకుండా నేరుగా ఇరాన్‌తో తలపడేందుకు సిద్ధమవుతోంది. కాబట్టి రానున్న రోజుల్లో ఇజ్రాయిల్ దూకుడు, ట్రంప్ వైఖరి చూస్తుంటే, ఘర్షణ వాతావరణం పెరిగే అవకాశమే తప్ప, తగ్గే సూచనలు కనిపించడంలేదు. అణు ఒప్పందాన్ని సవరించాలంటూ ఇరాన్‌పై గుడ్లురుముతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శివాలుతో ఆర్నెల్ల వ్యవధిలోనే 'రియాల్' విలువ నాలుగో వంతు తగ్గిపోయింది. అవినీతి, ఆర్థిక మాంద్యం, నిరుద్యోగిత, అసమానతలు పెరిగి ఇరాన్ నివురుగప్పిన నిప్పులా మారింది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక రంగ సముద్ధరణకు పెట్టుబడులకోసం చూస్తున్న రౌహానీ, భారత్ తోడ్పాటు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా తన స్వీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. అమెరికా ఒత్తిళ్లు, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా అభ్యంతరాలను లెక్కచేయకుండా ఇరాన్‌తో దౌత్య సంబంధాలను పటిష్ఠం చేసుకోవడానికి భారత్ ముందడుగు వేయడం అన్ని విధాలా అవసరం. ఇరాన్‌తో మనకు చారిత్రక అనుబంధం ఉన్నది. అంతర్జాతీయ రాజకీయ సంబంధాలకు మించిన సామాజిక, సాంస్కృతిక బంధాలు పెనవేసుకున్న చరిత్ర ఉభయదేశాలది. మన వేషభాషల్లో, ఆహార విహారాదుల్లో, వాస్తు, సంగీత, చిత్ర కళల్లో పర్షియా ప్రభావం విడదీయలేనంతగా మిళితమైంది. భారతీయ భాషల్లో పార్సీ పదాలు వేరు చేసి చూడలేనంతగా కలిసి పోయాయి. ఇలా శతాబ్దాలుగా మనకు ఇరాన్‌తో సాంస్కృతిక అనుబంధం వేళ్లూనుకొంది. కాబట్టి ఇరాన్‌తో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అనుబంధాలను మరింతగా బలోపేతం చేసుకోవడం మన దేశ పురోభివృద్ధికి ఊతంగా మారుతుంది. అదే విధంగా ఇరాన్‌కు కొండంత అండగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. రౌహానీ పర్యటన ఈ క్రమంలో ఓ ముందడుగుగానే చూడాలి.

చురక

ఆంధ్ర రాష్ట్ర విభజన
హామీల కొరకు పోరు
చంద్రబాబు చేపడితే
చెలరేగదా మహాజోరు

కేంద్రంతో తెలుగుదేశం
గానుగెద్దు బంధం
అది వీడితే అఖిలపక్ష
ఐక్య గెలుపు గంధం

– వేల్పుల నారాయణ

జలాన్నీ వదలని కోకోకోలా-నెస్లే

అంతర్జాతీయం


బుద్దిగ జమిందార్

మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైన నీటిని ప్రైవేటుపరం చేయడానికి కార్పోరేట్ కంపెనీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రపంచ అతిపెద్ద జలాశయాల్లో రెండవది దక్షిణ అమెరికాలోని గ్వారానీ జలాశయాలు కోకోకోలా, నెస్లే కంపెనీల వశంకానున్నాయి. గ్వారానీ జలాశయాలు బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే దేశాల ఉపరితలం నేలకింద నున్నాయి. ఇవి సుమారు 12 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగంలో వ్యాపించి ఉన్నాయి. అమెజాన్ అడవులకు, మానవాళి మనుగడకు ఈ దేశాల్లోని సకలజీవాల ప్రాణాలకు అత్యంత అవశ్యకమైనవి ఈ గ్వారానీ జలాలు. బ్రెజిల్ అధ్యక్షురాలుగా ఉన్న డిల్మారూసోఫ్ పదవీచ్యుతురాలైనప్పటినుండి ఈ నీటిని ప్రైవేటుపరం చేయటానికి పావులు కదులుతున్నాయి. 100 సంవత్సరాలకుపైగా ఈ భూఉపరితల, భూగర్భజలాలను ఉపయోగించుకొనే హక్కుకై కోకోకోలా, నెస్లేలు ఆరాటపడ్తున్నాయి. నీరు ప్రైవేటుపరం కావటం, అమ్ముడుపోవటమనేది అత్యంత దారుణమైన మానవహక్కుల హరణమే అవుతుంది. ఈ ఒప్పందాన్ని అమలుకానిస్తే భవిష్యత్తులో ప్రపంచవ్యాపితంగా భూగోళమంతా నీటిజలాశయాలు అమ్ముడైపోయే ప్రమాదముందని ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని మానవ హక్కుల సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. ఆదిలోనే ఇటువంటి ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడి తుంచేయకపోతే భవిష్యత్తులో గాలి, నేల, ఆకాశం, నిప్పులను కూడా ప్రైవేటు వ్యక్తులనుండి ప్రజలు కొనుక్కొనే అఘాయిత్యానికి ప్రపంచ మానవ జాతి నెట్టబడే పెనుప్రమాదం పొంచి ఉంది.

అమెజాన్ వర్షారణ్య వినాశనం

మానవజాతికే ఊపిరితిత్తుల వంటివి అని పిలవబడే అమెజాన్ అడవులు ఇప్పటికే ప్రైవేటుపరమై నరకబడుతున్నాయి. ఒకప్పుడు భూభాగంలో 14 శాతం ఉన్న అమెజాన్ వర్షారణ్యం గడచిన అర్థశతాబ్దంలో 6 శాతానికి పడిపోయింది. మన భూమిపై మానవాళికి కావల్సిన ప్రాణ వాయువు 20 శాతం అమెజాన్ అడవుల ద్వారానే లభ్యమవుతుంది. కాలుష్య వాయువుల కార్బన్‌ల నుండి ప్రజలను రక్షింపబడే ఈ అడవుల్ని అంతమొందించటానికి కార్పోరేట్ కంపెనీలు పూనుకొన్నాయి. బ్రెజిల్, పెరూ, కొలంబియా, బొలీవియా, వెనిజులా, ఈక్వెడార్, సూరినామ్, గయానా దేశాల్లో వ్యాపించివున్న ఈ అడవులు రాగి, ఇనుపఖనిజం, బంగారం, టిన్, బాక్సైట్‌వంటి లోహలగనుల కోసం, వ్యవసాయ సాగుపేరిట అడవులను నరకటం ద్వారా ప్రపంచ పర్యావరణానికి పెనుసవాలు విగిల్చారు. జీవ వైవిధ్యానికి పేరుగల ఈ ప్రాంతంలో మూడువందల వరకూ సరీసృపాల జాతులు, 175 పొలుసుల వంటి శరీరంగల బల్లిజాతి తరహా సరీసృపాల జాతులు, 500 క్షీరద జాతులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ప్రపంచంలోని 3వ వంతు పక్షిజాతులు ఈ ప్రాంతంలోనివే. దీనికి తోడు 3 కోట్ల క్రిమికీటకాలకు ఈ ప్రాంతం పుట్టినిల్లు. ఈ అడవుల్లో ప్రతి రెండున్నర ఎకరాలకు 15 వందల రకాల మొక్కలు, 750 వృక్షాలు కలిపి 900 టన్నులు బరువుగల మొక్కలు ఉంటాయి. మొత్తం 4,38,000 జాతుల మొక్కలు ఈ ప్రాంతంలో నమోదయ్యాయి. ఈ విధంగా జీవపర్యా వరణానికి, మానవ సామాజిక అవసరాలకు ఈ ప్రాంతం అత్యంతంగా బహువిధాలుగా ఉపయోగపడుతుండగా వీటన్నిటికీ అవసరమయ్యే జలాశయాలు ప్రైవేటుపరమైతే ఇక మానవులతో పాటు పశు పక్షాదులు, జంతువులతో పాటు చెట్లు చేమలు కూడా కోకోకోలా-నెస్లే నుండి నీటిని కొనుక్కోవాలా? అని పర్యావరణ రక్షకులు ప్రశ్నలతో వాపోతున్నారు. "తాజాగా ప్రపంచంలోని 5వ వంతు మంచినీటిపై కార్పోరేట్ కంపెనీలు కోకోకోలా-నెస్లేల దృష్టి యిప్పుడు పడటం మానవజాతి వినాశనానికే" అని పర్యావరణ ఉద్యమకారులు అంటున్నారు.



గుర్వానీ జలాశయాన్ని కబ్జా చేయనున్న నెస్లే - కోకాకోలా కంపెనీలు

లాభాలకై రైతుల రక్తాన్ని తాగుతున్నారు

ప్రపంచంలో 200 దేశాలకుపైగా కోకోకోలా 85 దేశాలకుపైగా నెస్లే కంపెనీలు విస్తరించి ఆదేశాల నుండి ఏటా కోట్లాది రూపాయలను లాభాలపేరిట ఎత్తుకుపోతున్నారు. కేవలం రంగునీళ్లు, ఫాస్ట్‌ఫుడ్స్ అమ్ముకొంటూ పర్యావరణ వినాశకులవుతున్నారు. ప్రపంచ అగ్రగామి కార్పోరేట్ కంపెనీల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన నెస్లే 34వ స్థానంలో 9000 కోట్ల డాలర్ల వ్యాపారం చేస్తూ 2016లో 860 కోట్ల డాలర్లు లాభం పొందగా, కోకోకోలా కంపెనీ 84వ స్థానంలో 4150 కోట్ల డాలర్ల వ్యాపారం చేసింది. కేవలం దీని బ్రాండ్ గుడ్‌విల్ విలువ 5640 కోట్ల డాలర్లకు పరుగెత్తింది. వీటికి తోడు పెప్సీ కంపెనీ 84వ కార్పొరేట్ కంపెనీగా స్థానాన్ని ఆక్రమించి, 6280 కోట్ల డాలర్ల వ్యాపారం చేస్తోంది. పనికిరాని రసాయనాలతో కూడిన శీతలపానీయాల్ని ప్రజలకు ఈ కార్పొరేట్ కంపెనీలు మత్తు మందులా అలవాటు చేయించి దోపిడీలు చేస్తున్నారు.

ముఖ్యంగా భారతదేశంవంటి అనేకదేశాల్లో కేరళ, ఉత్తరప్రదేశ్‌లాంటి చోట్ల కోకోకోలా కంపెనీలకు వ్యతిరేకంగా రైతులు అనేక ఉద్యమాలు చేస్తున్నారు. ఒక పక్క ప్రజలకు తాగునీరు, సాగునీరులేక ప్రజానీకం నానా అవస్థలుపడుతూ ఉంటుంటే మరోవైపు మన ప్రభుత్వాలు కార్పోరేట్ల కొమ్ముగాస్తూ భూగర్భజలాలను కారుచౌకగా అమ్మేస్తున్నారు. ఒక లీటరు కోకోకోలాకు 3 నుండి 6 లీటర్ల భూగర్భజలాలు అవసరమౌతాయి. జలాశయాలు ఇంకిపోవ టంతో రైతు పొలాలకు నీళ్లులేక రైతుల ఆత్మహత్యలకు ఈ కార్పోరేట్ కంపెనీలు కారణమవుతున్నాయి. నదులు, ఏరులు, బావులు ఎండిపోతున్నాయి. పచ్చదనం నానాటికీ తగ్గుతుంది. ఈ విధంగా ప్రకృతి పర్యావరణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 'కోకేను తాగటమంటే రైతులరక్తాన్ని తాగటమే'నని ఉత్తరప్రదేశ్‌కు చెందిన నంద్‌లాల్ మాస్టార్ అనే ఒక పర్యావరణవేత్త అంటున్నారు. ఐనప్పటికే కార్పోరేట్ కంపెనీల కొమ్ము కాసే ఈ ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా ఏమీచేయలేకపోతున్నాయి.

కార్పోరేట్ శక్తులు అన్నిరంగాల్లో దోపిడీల్ని వేగవంతం చేసి మానవహక్కులను కాలరాస్తున్నాయి. ప్రజలు దాచుకొనే డబ్బునుంచి పీల్చేగాలిదాకా, తాగేనీటినుంచి తినే ఆహారం వరకూ దోచుకొంటూ మానవ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయి. ఈ దోపిడీలకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయకపోతే ఐక్య ఉద్యమాల ద్వారా అరికట్టకపోతే రానున్న కాలంలో నైలు నుండి అమెజాన్‌ల మీదుగా గంగా గోదావరిల వరకు హిమాలయాలను, సప్తసముద్రాలను కూడా ప్రైవేటుపరం చేసి మనిషికి ఈ భూగోళంపై జీవించే హక్కును కూడా కార్పోరేట్‌పరం చేసే అత్యంత కిరాతకపు ఆలోచనలు కోకోకోలా నెస్లే వంటి కార్పొరేట్ కంపెనీలకు రాకముందే దక్షిణ అమెరికా సహజవనరుల జలాశయాల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

శాస్త్రీయ దృక్పథం


ప్రొ॥ జయంత్ నార్లీకర్

ఈనాడు మనదేశంలోని ప్రజలను మూఢనమ్మకాలు మెడ చుట్టూ గుదిబండలాగా కృంగదీస్తున్నాయి. అందులో నుండి బయట పడి మనం శాస్త్రీయ దృక్పథాన్నీ అలవర్చు కోవలసిన తక్షణ అవసరం ఎంతైనా ఉన్నది. కొన్ని సంవత్స రాలక్రితం నేను ఢిల్లీలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యాను. మానవ జీవితంపై వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రభావాన్ని చర్చిం చటం ఆ సదస్సు ఉద్దేశం. ప్రపంచ వ్యాపిత ప్రముఖులైన శాస్త్రజ్ఞులు ఆ సదస్సులో శాస్త్ర విజ్ఞాన ఫలితాలను ఎట్లా ఉపయోగంలోకి తేవాలో చర్చిస్తున్నారుగాని, ఆ సదస్సులో కూర్చున్న నాకు మాత్రం మనసులో అలజడి పెరుగుతూ వస్తోంది. పెద్ద విందులో, వంటకాలలో తక్కువైన ఉప్పుకోసం వెదుక్కుటున్న వాని పరిస్థితి నాది. ఆ సదస్సులో ఎవరూ శాస్త్రీయ దృక్పథం గురించి ఒక్క మాటైనా చెప్పకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇక నావంతు వచ్చినప్పుడు నేను సామాన్య ప్రజానీకంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవలసిన అవసరం గురించి ప్రసంగించాను.

"శాస్త్రీయ దృక్పథం అంటే ఏమిటి," అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రచించిన, "డిస్కవరీ ఆఫ్ ఇండియా" గ్రంథం నుండి కొన్ని వాక్యాలను ఇక్కడ ఉదహరిస్తాను: "నేటి సమాజంలో సైన్స్ ప్రభావం కారణంగా, దేనినీ గుడ్డిగా నమ్మకుండా, పరిశీలన, విమర్శనాత్మక దృష్టితో పరీక్షించిన తరువాత మాత్రమే ఏ విషయాన్నైనా అంగీకరించే సంస్కృతి అలవడింది..."

ఆయన మాటల్లోనే, "అయినా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, మనం సైన్స్ పట్ల విశ్వాసాన్ని ప్రకటిస్తూనే, సంప్రదాయం, ఆచారం పేరిట కొన్ని అసంబద్ధమైన, అర్థ రహితమైన ఆలోచనలను, అలవాట్లను వదులుకోలేక పోతున్నాము. "ఇందులో ఆశ్చర్యపడాల్సినదేమీలేదు. నెహ్రూ స్వాతంత్ర్య సిద్ధించకముందు రోజుల్లో చెప్పిన విషయాలు, ఇప్పటికీ, 70 ఏళ్ళ స్వాతంత్ర్యం తరువాత కూడా మనకు చక్కగా వర్తిస్తాయి. మూఢాచారాల గుదిబండ మనలను ఈ శాస్త్రీయ యుగంలో కూడా, ముందుకు పోనీకుండా, వెనుకకు, గతంలోకి లాగుతూనే వున్నది. ఇక్కడ చెక్ దేశ శాస్త్రజ్ఞుడు జిరి గ్రిగార్ చెప్పిన విషయం ఉదహరిస్తాను. సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాల కాలంలో మూఢనమ్మ కాలను బహిరంగంగా వ్యక్తపరచటానికి ఎవరూ సాహసించలేదు. కాని కమ్యూనిస్టు ప్రభుత్వాలు పడిపోయిన తరువాత, మళ్ళీ మూఢనమ్మకాలు అక్కడ రాజ్యమేలటం ప్రారంభించాయట.

మూఢనమ్మకాలు మనల్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి

ఈ అంతరిక్షయుగంలో కూడా పాత నమ్మకాలకు కొత్త రంగు పూయటం జరుగుతోన్నది. 20వ శతాబ్దం చివరి రోజులలో, నేను మధ్య అమెరికాలోని ప్యూర్టోరికో లోని అసెరిబో రేడియో టెలిస్కోపు ఉన్న ప్రదేశానికి పరిశోధన నిమిత్తం వెళ్ళవలసి వచ్చింది. ప్యూర్టోరికో తో సహ ఆ ప్రాంతంలో బెర్మూడా త్రికోణంగా ఒక ప్రదేశం గురించి అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సముద్రంలోని దీవుల మధ్యన ఉన్న ఆ త్రికోణ ప్రదేశంలో ఏవో వింత శక్తులు పనిచేస్తున్నాయని ఒక నమ్మకమున్నది. చార్లెస్ బెరిలిట్జ్ అనే రచయిత ఈ బెర్మూడా త్రికోణం గురించి రాసిన పుస్తకంలో చాలా ఆశ్చర్యకరమైన విషయాలను ప్రస్తావిం చటం జరిగింది. ఆ త్రికోణ ప్రదేశంలోకి ప్రవేశించిన పడ వలు, ఓడలు, విమానాలు అంతర్ధానమవుతున్నాయని, ఏవో అంతు తెలియని శక్తి ఆ ప్రదేశంలో పనిచేస్తోందని ఆ పుస్తకంలో వివరించ బడింది. కొంత వరకు నిజా లను సాగదీసి, పాఠకులకు ఆసక్తి రేకెత్తించటం రచయిత ఉద్దేశం కావచ్చును. అయితే, ఇప్పటివరకూ ఆ బెర్మూడా త్రికోణం వద్ద జరిగిన ఘటనలకు సరయిన, సంతృప్తికరమైన వివరణ ఎవరూ ఇవ్వలేదన్న మాటనిజమే. అయితే, ఈపుస్తకం వెలువడిన కొన్ని సంవత్సరాలకు డేవిడ్ క్రిషే అనే శాస్త్రజ్ఞుడు ఈ బెర్మూడా త్రికోణం గురించిన కథనాలపై లోతైనా పరిశోధన చేసి, ఈ కథనాలలో కట్టుకథలు, అతిశయోక్తులు ఎక్కువగా ఉన్నాయని, కొండకచో అబద్ధాలను కూడా ప్రచారంలో పెట్టారని నిర్ధారించాడు. ఈ బెర్మూడా త్రికోణ ప్రదేశం గ్రహాంతర వాసుల స్థావరం కాని, లేదా మరీ విచిత్రంగా అక్కడ ఒక క్రిష్ణ బిలం ఉండటానికి గాని ఏవిధమైన ఆస్కారంలేదు. కాని స్కూలు, కాలేజీ విద్యార్థులను ఉద్దేశించి నేను ప్రసంగిస్తున్నప్పుడు, నన్ను చాలామంది ఇటువంటి ప్రశ్నలు అడుగుతుంటారు. నేను ఆ బెర్మూడా త్రికోణం గురించి శాస్త్రీయమైన విశ్లేషణ ఇచ్చినప్పుడు, చాలామందికి ఉసూరుమనిపిస్తుంది. అవునుమరి. నమ్మకాలు అంతబలమైనవి. నేను అసెరిబో ప్రయోగశాలలో ఉండగా, అక్కడి శాస్త్రజ్ఞులను ఈ విషయమే అడిగాను. వారు నవ్వి, ఇప్పుడు బెర్మూడా త్రికోణం పట్ల సైన్స్‌కు ఏవిధమైన ఆసక్తిలేదుకాని, ఈ ప్రదేశం టూరిస్టు కేంద్రంగా మారి కొందరికి మంచి వ్యాపార అవకాశాలు లభించాయని నవ్వుతూ చెప్పారు.



గ్రహణ సమయంలో ప్రమాదకరమైన కిరణాలు ప్రసరిస్తాయని నమ్మి చాలామంది ఆ సమయంలో ఇళ్ళలోనే ఉండిపోతారు. ఒకసారి నేను ఆఫ్రికాలోని జింబాబ్వేలో సంపూర్ణ సూర్యగ్రహణాన్ని పరిశోధించటానికి వెళ్ళాను. కాని మన దేశంలో వలే అక్కడ ప్రజలు ఇళ్ళలో తలుపులు మూసుకుని కూర్చోలేదు. ఎవరి పనులలో వారు నిమగ్నమై ఉన్నారు. వారెవరికీ ఏవిధమైన హానీ జరుగలేదు. వారికి ఈ దుష్ట కిరణాలు కథనం గురించి తెలయక పోవచ్చును. బాగా విద్యావంతులైన ఒక కుటుంబానికి చెందిన ఒక భారతీయ గృహిణి నాతో ఈవిధంగా చెప్పింది. గ్రహణ సమయం తరువాత ఫ్రిజ్‌లోని ఆహారం కూడా విషతుల్యమవుతుంది కనుక, దానిని పడవేయాలని, లేకుంటే ప్రమాదమని ఆమె నిజంగానే నమ్ముతూ, నాకు చెబుతుంటే, నేను ఆలోచనలో పడ్డాను. అయితే, కథ ఇక్కడితో ముగిసిపోలేదు. ఫ్రిజ్‌లోని ఖరీదైన వంటలను, ఆహారాన్ని వృధా చేయనక్కరలేకుండా, వారి సిద్ధాంతిగారు ఒక పరిష్కారాన్ని సూచించారట. ఫ్రిజ్‌కి అవుపేడ గాని పూస్తే, ఆ దుష్ట కిరణాల ప్రభావం నిర్వీర్యమవుతుందని ఆమె నాకు గర్వంగా చెప్పింది. అట్లాగే, ఒక కంపెనీ ఉన్నతాధికారి ఫలానా తేదీన విమానంలో వేరే చోటికి కంపెనీ పని నిమిత్తం వెళ్ళవలసి ఉన్నది గాని, ఆరోజు, ఆ సమయం పంచాంగం ప్రకారంగా మంచిది కాదు కనుక, తాను ప్రయాణాన్ని వాయిదా వేసుకోవటం సాధ్యంకాదు కనుక, ఆయన ఒక పరిష్కారాన్ని కనుగొన్నాడు. ఆముందేరోజే, పక్కింటిలో తన సూట్ కేసును ఉంచి, నిర్ణీత తనకు తాను సరిపెట్టుకున్నాడు. ఈవిధంగా సంప్రదాయాన్ని, పురాతన ఆచారాలను పాటించాడాయన!

పురాణాల ప్రస్తావన

ఈవిధమైన అర్థంపర్థంలేని మూఢనమ్మకాలను పట్టుకు వేళ్ళాడటం మనకు పరిపాటి అయిపోయింది. అయితే, వీటి వలన ఆ వ్యక్తి పనులు కొంతవరకు పాడుకావచ్చునేమో కాని, ఇతరులపై అంత ప్రభావం ఉండకపోవచ్చును. అయితే, పురాణాలలోని కట్టుకథలను నిజమేనని నమ్మి, వాటిలో వివరించినట్లుగా చెప్పబడుతోన్న విషయాలను శాస్త్రీయ బద్ధమైన నిజాలుగా, శాస్త్రవిజ్ఞానానికి ప్రతీకలుగా ప్రచారంచేస్తూ, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం సమాజానికి ప్రమాదకరమైనది. ఈనాటికీ సైన్స్ ఊహించలేని అద్భుత శాస్త్రీయ, సాంకేతిక ఆవిష్కరణలు మన పూర్వీకులు సాధించారని, పుష్పక విమానాలు, విశ్వామిత్రుని త్రిశంకు స్వర్గ సృష్టి, ఇంద్ర శక్తి, బ్రహ్మాస్త్రం వంటి అణ్వాయుధమే అయితే, ఆ నాటికి అణు పరిజ్ఞానం, అణ్వాయుధాలు నిర్మించే సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్లుగా ఏ పురాణాలలోనూ ప్రస్తావిం చటం జరగలేదేమి? విద్యుత్ శక్తి, విద్యుత్ అయస్కాంత పరిజ్ఞానం గురించి లేశమాత్రమైనా ప్రస్తావన ఎక్కడా కానరానప్పుడు, వీరికి అణుపరిజ్ఞానం ఎట్లావాడుకలోకి వచ్చిందో ఈ ప్రచారకర్తలు చెప్పగలరా? ఈరోజు, శుద్ధిచేయబడిన నీరు ట్యాపులలో ప్రతి ఇంటికీ సరఫరా చేయటం, విద్యుత్ శక్తి వాడకం అత్యంత సాధారణమైన విషయాలు. రాజకీయ పార్టీలన్నీ ప్రజలందరికీ ఈ సదుపాయాలు కల్పిస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తుం టారు. మరయితే, మహాభారతంలో పాండవులకు అద్భుత మైన మయసభ కట్టబడినా, అందులో గాని, హస్తినాపురంలో గానీ ఈ విధమైన సదుపాయాలు ఉన్నట్లుగా ఎక్కడా ప్రస్తావన లేదేమి?

ఈ మధ్యన శాస్త్ర పరిజ్ఞానం కలిగిన వ్యక్తినని చెప్పుకుంటూన్న ఒక ప్రముఖ వ్యక్తి డ్యార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తప్పని, దానిని విద్యార్థులకు బోధించనవసరం లేదని తేల్చి చెప్పేశాడు. సైన్స్‌లో ఒక ప్రతిపాదన గాని చేయబడితే, మన పరిశీలనకు సంబంధించి అన్ని విషయాలకు అది సరైన, సంతృప్తికరమైన వివరణ ఇవ్వగలిగి నప్పుడే ఆ ప్రతిపాదన ఒక సిద్ధాంతంగా అంగీకరించ బడుతుంది. జీవ పరిణామ క్రమంలో ఇంకా తేలని కొన్ని చిక్కు సమస్యలు ఇప్పటికి వున్నా, నేటివరకూ మనకు అత్యంత సంతృప్తికరమైన వివరణ ఇవ్వగలిగిన సిద్ధాంతం అదే కావటం మూలాన, దాన్ని శాస్త్రజ్ఞులు అంగీకరించారు. భవిష్యత్తులో డార్విన్ సిద్ధాంతం కంటే జీవ పరిణామాన్ని మరింత సంతృప్తిగా వివరించగలిగిన మరొక సిద్ధాంతం ప్రతిపాదించబడవచ్చును. అప్పటివరకూ, మన విద్యార్థులకు డార్విన్ సిద్ధాంతాన్ని బోధించవలసి ఉన్నది. అంటే, విధాన నిర్ణయాలలో శాస్త్ర విజ్ఞానానిదే పైచేయిగా ఉండాలి.

వ్యాసరచయిత పూనేలోని ప్రముఖ అంతరిక్ష శాస్త్రజ్ఞులు
అనువాదం : మర్ల విజయ కుమార్

మాతృభాషను కాపాడుకుందాం ... మాతృభాషలోనే మాట్లాడుకుందాం

కామిడి సతీష్ రెడ్డి

"ప్రతియేటా ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించాలని యునెస్కో ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి మద్దతుతో 17-11-1999న యునెస్కో 30వ సాధారణ మహాసభ ఈ ప్రకటన చేసింది. 1999లో యునెస్కో సభ్యత్వ మండలికి ఎన్నికైన బంగ్లాదేశ్ ఈ దినోత్సవ నిర్వహణను గూర్చిన ప్రతిపాదన చేసింది. ఈ ప్రతిపాదనను యునెస్కో భాషావిభాగం, 35వ ముసాయిదా తీర్మానంగా, కమిషన్ 2కు పరిశీలన నిమిత్తం పంపించింది. బంగ్లాదేశ్ చేసిన ఈ ప్రతిపాదనను ఇండియా, శ్రీలంక, రష్యా, ఈజిప్ట్, సౌదీ అరేబియా, పాకిస్తాన్, మలేషియా, చిలీ, ఇటలీ, ఇరాన్ ఇండోనేషియా మొదలైన 28 దేశాలు బల పరిచాయి. కెనడాలోని "ప్రపంచ మాతృభాషా ప్రేమికులు" అనే సంస్థ 1999లో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినంగా ప్రకటించాలని యునెస్కోను కోరింది. సభ్యదేశాల నుంచి యునెస్కో నేషనల్ కమిషన్‌కు ప్రతిపాదన వస్తేనే పరిశీలించడానికి వీలవుతుందని యునెస్కో తెలిపింది. నాటి బంగ్లాదేశ్ విద్యాశాఖామంత్రి ఎ.ఎస్. సాదిక్ బంగ్లాదేశ్ తరపున యునెస్కోకు సెప్టెంబర్ 9న ఈ దినోత్సవాన్ని గూర్చి ప్రతిపాదనను పంపించాడు. 1952లో నాటి తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్)లోని భాషాభిమానులు తమ మాతృభాష అయిన బెంగాలీని రక్షించుకోడానికి పోరాటం చేశారు. ఈ పోరాటం ఉద్యమ రూపం దాల్చింది. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించింది. ప్రభుత్వ దమనకాండలో 21-2-1952న అనేక మంది ఉద్యమకారులు మరణించారు. మరణించిన వారిలో అబ్దుల్ బర్కల్, రఫీకుద్దీన్ అహ్మద్, రహమాన్ మొదలైనవారు ఉన్నారు. అనేక మంది గాయపడ్డారు. కొందరికి జైలు శిక్ష విధింపబడింది. అందువలన ఫిబ్రవరి 21న ఈ దినోత్సవాన్ని నిర్వహించాలన్న బంగ్లాదేశ్ ప్రతిపాదనను యునెస్కో అంగీకరించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని భాషలకే అత్యధిక ప్రాధాన్యం లభిస్తుండడం వలన ఒకటి రెండు దశాబ్దాలలో వేలాది భాషలు అంతరించే ప్రమాదం ఏర్పడింది. ప్రపంచ భాషలలో 64 భాషలు వంద సంవత్సరాల తర్వాత అంతరించబోతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఏడువేల భాషలున్నాయి. వందేళ్ల తర్వాత 25 వందల భాషలు మాత్రమే ఉపయోగంలో ఉంటాయని వాషింగ్టన్ డి.సి.లోని "ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ వరల్డ్ వాచ్" అనే సంస్థ తన తాజా నివేదికలో పేర్కొన్నది. ప్రపంచంలో అత్యధిక ప్రజానీకం మాట్లాడే (హిందీ 49.6 కోట్లు, బెంగాలీ 21.5 కోట్లు మొదలైనవి) పది భాషలు మాత్రం తమ ఉనికిని నిలుపుకునే అవకాశం ఉంది. మన దేశంలో 427 భాషలుండగా వీటిలో అనేక భాషలు అంతరించిపోతున్నాయి. ప్రపంచంలోని మొత్తం భాషలలో సగం భాషలు ఎనిమిది దేశాలలోనే వాడుకలో ఉన్నాయి. ప్రాంతీయ భాషలపై నిషేధాలు, యుద్ధాలు, వ్యాధులవల్ల జనులు మరణించడం, తమ పిల్లలకు మాతృభాషను నేర్పించకపోవడం మొదలైన కారణాలవల్ల అనేక భాషలు అంతరిస్తున్నాయి. ప్రజలు తమ మాతృభాషలోని మాధుర్యాన్ని గుర్తుచేసుకోవాలని, ఆయా భాషల సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని యునెస్కో పేర్కొన్నది. భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, విద్యాబోధనలో మాతృభాషకున్న ప్రాధాన్యాన్ని గుర్తించడం మాతృభాషా దినోత్సవ లక్ష్యాలు.

నేడు ప్రపంచ మాతృభాష దినోత్సవం

"దేశ భాషలందు తెలుగు లెస్స, " ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్", భలే మంచి భాష పసందైన భాష, తేనెలొలుకు భాషే తెలుగు భాష' అంటూ మన మాతృభాష తెలుగు గూర్చి ఎన్నో పాటలు, గేయాలు రాయబడ్డాయి. మన పాలకుల నిర్లక్ష్యం మూలాన మన తెలుగుకు "తెగులు" సోకుతోంది. పక్కరాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు వారి వారి మాతృభాషలకు పెద్దపీట వేస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాలలో మన మాతృభాషను పట్టించుకునేవారే కరువయ్యారు. అధికార భాషా సంఘం ఊసే లేదు. బడ్జెట్‌లో మాతృభాషాభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. ప్రభుత్వం నుండి జారీచేయబడుతున్న ఉత్తర, ప్రత్యుత్తరాలు అన్నీ ఆంగ్లభాషలోనే వెలువడుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో తెలుగు భాష మాట్లాడితే నేరంగా పరిగణిస్తున్నారు. మన పాలకులు అసెంబ్లీ సమావేశాలలో కూడా ఆంగ్లభాషలోనే ప్రసంగ గిస్తున్నారు. భాషాభిమానులు, ఉద్యమకారులు మాతృభాషను బ్రతికించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. తెలుగుకి ప్రాచీన హోదా దక్కిందని పేర్కొంటున్నా ఇదమిద్ధంగా లేదు. మాతృభాష అమలు తీరును మెరుగుపరచాలి. తెలుగులో మాట్లాడేలా ప్రోత్సహించాలి. పైన పేర్కొన్న సమస్యలకు ప్రభుత్వాలు పరిష్కరించేలా ప్రాధాన్యతనివ్వాలి. మాతృభాషను కాపాడుకుందాం – బ్రతికించుకుందాం. జై తెలుగు... జై జై తెలుగు.

విశాలాంధ్ర

బతుకు

The Life

బుధవారం
21 ఫిబ్రవరి 2018



గుర్తుకొస్తున్నాయి!

వీటిని చూడగానే బాల్యం గుర్తుకొస్తోంది కదా! జిగురు జిగురుగా బట్టలకు అంటుకుపోయే వీటిని ఒకరిమీద ఒకరు విసురుకుంటూ ఎంతగా ఆటలాడుకునేవాళ్లో స్ఫురణకు వస్తోంది కదా! ఎన్నో జ్ఞాపకాలను నెమరువేసుకునే అవకాశం ఇచ్చిన ఈ చిత్రం బెంగళూరులోని వ్యవసాయ యూనివర్సిటీలోది. ఈ మొక్కలు ఒక రకమైన గడ్డి జాతికి చెందినవి.

పరీక్షలు వచ్చేస్తున్నాయ్



ప్రణాళిక

ఏదైనా ఒక ప్రణాళిక ప్రకారం అమలు చేస్తే జీవితం నందనవనమే అవుతుంది అనటంలో ఎటువంటి సందేహం లేదు. చదువుకీ ఇది వర్తిస్తుంది. ఒక ప్రణాళిక ప్రకారం విద్యాసంవత్సరం మొదటి నుంచి చదువుకుంటే ఎంతో మంచిది. ప్రతి విద్యార్థికి ఏదో సాధించాలనే తపన ఉంటుంది. మనం ఆ దిశగా వారిని పయనింపచేయాలి. ప్రస్తుతం సాధారణంగా తల్లిదండ్రులు అందరూ విద్యావంతులుగానే ఉంటున్నారు. బాధ్యతగా వారిని మొదటినుంచి ఒక ప్రణాళిక ప్రకారం చదివించుకోవాలి. అంతేగానీ కేవలం పరీక్షలప్పుడు మాత్రమే వారిపై దృష్టిపెట్టి చదువంతా ఒకేసారి చదివేయాలని నిర్బంధించకూడదు. ముందు నుంచీ చదవకపోయినా పరీక్షల సమయంలో ఒక ప్రణాళిక ప్రకారం ఎలా చదవాలో తెలియజెప్పాలి. పిల్లలపై మోయలేని భారాన్ని మోపకూడదు. కేవలం పరీక్షల సమయాల్లో రాత్రిళ్ళు ఎక్కువసేపు కూర్చోపెట్టకూడదు. వారిని మొదటినుంచి తెల్లవారుజామునే లేచి చదివేలా ప్రోత్సహించాలి. ధ్యానం, యోగా వంటివి చేయటం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారికి తెలియజేయాలి.

హెల్(సెల్)ఫోన్ వద్దు

పిల్లలను, పెద్దలను పక్కదారి పట్టించటంలో సెల్‌ఫోన్ పాత్ర ఎంతో ఉంది. పరీక్షల సమయంలో పిల్లలకు ఫోన్ ఇవ్వకపోవటం మంచిది. కొంతమంది పిల్లలు కొన్ని అనుమానాలు ఉన్నాయి, వాటిని సెల్‌ఫోన్‌లో చూసుకుంటున్నాం అంటూ బుకాయిస్తుంటారు. ఇది ఎంత మాత్రం సరైనదికాదు. పాఠ్యాంశాలలో ఏవైనా అనుమానాలుంటే, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి. కొంతమంది తల్లిదండ్రులు కూడ పిల్లలను చదవమంటూ, వారి పక్కన కూర్చుని వీరు సెల్‌ఫోన్‌ల సొల్లుమెసేజ్‌లలో మునిగిపోతుంటారు. సెల్‌ఫోన్ వియోగానికి కొంత సమయం కేటాయించుకుని ఆ సమయంలో మాత్రమే వారు మాట్లాడాలి. కుటుంబంతో గడిపేటప్పుడు, పిల్లలను చదివించేటప్పుడు వాటి వినియోగం ఉండకపోవటమే మేలు. మానవుడే ముందు సాంకేతికత మనిషి తరువాతే. ఇది గుర్తుంచుకుని పెద్దలు ప్రవర్తించాలి. పిల్లలకు సెల్‌ఫోన్‌ల వాడకంలో కచ్చితమైన షరతులు విధించాలి.

ఇలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయాలి. పిల్లలకు మంచి ఆహారం, నిద్ర వాటితో పాటుగా ఆత్మస్థైర్యాన్ని ఇవ్వగలిగితే పరీక్షలలోనే ఏమిటి జీవితంలో కూడ ఘనవిజయాలను సాధిస్తారనటంలో ఎటువంటి సందేహంలేదు. మేధావులు చెప్పినట్లు పిల్లలు భావి భారత నిర్మాతలు. ఆ దిశగా పిల్లలను తయారుచేయాలి. ఆ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలి. అమ్మో! ఎగ్జామ్స్ అనుకోకుండా హ్యాపీహ్యాపీ ఎగ్జామ్స్ అనుకుంటూ ఎంజాయ్ చేసేలా పిల్లలను తయారుచేయాలి. చదువంటే ఇష్టపడేదిగా ఉండాలి కానీ కష్టపెట్టేదిగా ఉండకూడదు.

పూజ లేమ్మా! అయిదు అయింది. లేచి చదువుకో! ఇంకా ఎగ్జామ్స్ ఎన్ని రోజులు ఉన్నాయనుకున్నావు. తరుముకుంటూ వచ్చేస్తున్నాయి. చూడు పక్కింటి లత ఎప్పుడో లేచింది. రాత్రి కూడా చాలాసేపు చదువుకున్నట్టుంది. నువ్వు మాత్రం పది అవకముందే మంచం ఎక్కేస్తావు. ఏం పిల్లవో ఏమో! అర్థం కాదు అంటూ కూతురిని తొందరపెట్టింది రజని. ఇది ఒక్క రజని వాళ్ళ ఇంట్లోనే కాదు, పరీక్షలు రాసే పిల్లలున్న ప్రతి ఇంట్లోనూ కనిపించే దృశ్యమే. సాధారణంగా పిల్లలకు పరీక్షలని పెద్దలే భయపెట్టేస్తుంటారు. వాళ్ళ కన్నా ముందు వీరే పరీక్షలు రాసినట్టుగా కంగారుపడిపోతుంటారు పిల్లలను గాబరా పెట్టించేస్తుంటారు. చదువును గుదిబండలా చిత్రీకరించేది ఒక విధంగా పెద్దలే! ప్రతి తల్లీతండ్రి తమ పిల్లలకు పరీక్షలంటే భయం లేకుండా అవగాహన కలిగించి వారిని పరీక్షలకు సిద్ధం చేయాలి. సంవత్సరమంతా ఒకేవిధంగా కష్టపడేలా చేయాలి. అంతేగాని ఎగ్జామ్స్ ముందు హడావుడి చేస్తే చదువురాకపోగా ఉన్నది కూడ వారు మర్చిపోతుంటారు. అలాంటి పరిస్థితులు రానివ్వకూడదు. అందుకే తల్లితండ్రి తమ పిల్లల విషయంలో కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే విజయానికి చేరువ చేసినవారు అవుతారు.



పరీక్షలంటే వారికున్న భయాన్ని పోగొట్టాలి. కొంతమంది పిల్లలకు తొందరగా గ్రహించుకునే సమర్థత ఉంటుంది. మరికొంతమందికి ఆ శక్తిసామర్థ్యాలు అంతగా ఉండవు. అలాగని ఆ పిల్లలను తక్కువగా అంచనా వేయకూడదు. వారికి ఏ సబ్జెక్టులంటే భయమో ముందు వాటి మీద భయాన్ని పోగొట్టాలి. ముందు నుంచి ఆ సబ్జెక్టులకు సంబంధించిన నిపుణులచేత వారికి శిక్షణ ఇప్పించాలి. దాంతో వారికి ఆ సబ్జెక్టులపై భయం పోయి, శ్రద్ధ పెరుగుతుంది. కొంచెం ఎక్కువ సమయాన్ని వాటిపై దృష్టిపెట్టి చదివేలా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులే తీసుకోవాలి. అలాగే కొంతమంది పిల్లలు చదువులో మరీ బలహీనంగా ఉంటారు. అలాంటి వారిని పెద్దపెద్ద ప్రశ్నలు చదవమనకుండా వారి శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా చిన్నప్రశ్నలు, బిట్‌లు లాంటివి చదివించాలి. ముందుగానే ఉపాధ్యాయులకు చెబితే వారు ఆ ప్రణాళిక ప్రకారం చదివేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ విషయంలో తల్లితండ్రులు విద్యాసంస్థల యాజమాన్యాలను సంప్రదించాలి. అంతేకానీ తమ పిల్లలు మిగిలిన పిల్లల మాదిరిగా వందశాతం తెచ్చుకోవాలి అనుకోకూడదు. వాళ్ళు చదువుతున్నారు నువ్వెందుకు చదవలేవు అనే ధోరణి తల్లిదండ్రులలో ఉండకూడదు. తమ పిల్లల శక్తిసామర్థ్యాలను తల్లిదండ్రుల కన్నా కచ్చితంగా అంచనా వేసేవారు ఎవరుంటారు? అందుకే

అల్ ది బెస్ట్

– యోగిత






పోలిక వద్దు

ఒకరితో ఒకరిని పోల్చి చూపరాదు. ఒకరికి ఉన్న శక్తిసామర్థ్యాలు మరొకరికి ఉండవు. ఒక్కొక్కరు ఒకో విషయంలో నైపుణ్యం ప్రదర్శిస్తారు. ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి. అంతేగానీ వారు అన్ని మార్కులు తెచ్చుకున్నారు, నీకు అది చేతకాదా! ఇద్దరూ ఒకేక్లాసు కదా చదివేది అంటూ విమర్శించకూడదు. అలాంటి విమర్శలు పిల్లల సున్నిత హృదయాలను దెబ్బతీస్తాయి. కొంతమంది పిల్లలు ఈ మాటలు భరించలేక ఆత్మహత్యలకు కూడ వెనుకాడటంలేదు. తల్లిదండ్రులకు గుండెకోత మిగులుస్తున్నారు. ఈ పోలిక అనేది కొన్ని విద్యాసంస్థలలో అన్ని చదువుకున్న ఉపాధ్యాయులు కూడా పిల్లలను ఇతర పిల్లలతో పోల్చి చూపి బాధలకు గురిచేస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరైనది కాదు. ఉపాధ్యాయులు అంటే విద్యార్థి యొక్క మనసు తెలుసుకునేవారుగా ఉండాలి. వారికి తల్లిదండ్రుల తరువాత మేమున్నామంటూ భరోసాను ఇవ్వాలి. పిల్లల్లో ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూడాలి. ఆ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలి. ఎవరి సామర్థ్యం, ప్రతిభ మేరకు వారు చదువుకునేలా అవగాహన పెంచాలి. పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టాలి.

బూరి బుగ్గలు తగ్గాలా!





బుగ్గలు బూరెల్లా ఉన్న పిల్లల్ని ముద్దు చేస్తారు. అదే ఎదిగిన పిల్లలు లేదా యువతలో ఉంటే మొద్దావతారం, బండావతారం అంటారు. అవునా, ఇదే సమస్య చాలామందిని పీడిస్తూ ఉంటుంది. ముఖ్యంగా బాగా లావుగా ఉన్నవారిలో ఇది ఎక్కువగా ఉంటుంది. మొత్తం శరీరం తగ్గకపోతే పోయే కనీసం బుగ్గలు అయినా నైస్‌గా తయారైతే బాగుండు అనుకుంటారు. కానీ అందుకు ఏం చేయాలో తెలీదు. మీరూ ఆ జాబితాలో ఉన్నారా...అయితే వీటిని చదివేయండి...తర్వాత ఆచరించండి.

బూరలు ఊదడం

చిన్న పిల్లలు పార్టీల్లో బూరలు ఊదుతుంటారు. ఆ సమయంలో వారితో పాటూ మీరూ చేరిపోండి. ఆనందంగా బూరలు ఊదేయండి. దీనివల్ల మీకు రెండు ప్రయోజనాలు దక్కుతాయి. ఒకటి...మీ బుగ్గలు ఎంతోకొంత తగ్గుతాయి. అక్కడ ఉన్న పిల్లలకూ సంతోషం రెట్టింపవుతుంది. ఈ బూరలు ఊదడం కూడా ఏదో ఒకటి అని చేసేస్తే కాదు. వాటిలో పూర్తిగా గాలి నిండేవరకూ ఊదండి. మీ దవడల కండరాలకు బాగా పని కల్పించండి. ప్రతి రోజూ ఇలా చేయడం సాధ్యమైనంత ఎక్కువగా బుగ్గల్ని తగ్గించుకోవచ్చు.

గడ్డం పైకి ఎత్తడం

బుగ్గల్ని తగ్గించుకోవడానికి ఇది మరో మార్గం. మీకు తెలుసు కదా నుంచోవడం, కుర్చోవడం ఆట...ఇది కూడా అలాంటిదే. గడ్డాన్ని పైకి కిందికి తిప్పడం వల్ల కూడా బుగ్గల్ని తగ్గించుకోవచ్చు. ఇది ఒక వ్యాయామంలా కూడా పనిచేస్తుంది. ఈ వ్యాయామాన్ని రోజుకి పది సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

ఫేషియల్ ఆవిరి

ఫేషియల్ ఆవిరి వల్ల కూడా చాలా మంచి ఫలితాలు వస్తాయి. ఇది బుగ్గల్లో ఎక్కువగా వున్న కొవ్వుని కరిగిస్తుంది. నీళ్ళను బాగా మరిగించి అందులో పొడి బట్టను ముంచి కొవ్వు ఎక్కువగా వున్న ప్రాంతంలో వుంచండి. రోజు పడుకునే ముందు ఇలా చేయడం వల్ల బుగ్గలు తగ్గుతాయి.

చూయింగ్ గమ్స్

చాలామంది కాలక్షేపం కోసం చూయింగ్‌గమ్స్ నములుతూ ఉంటారు. ఇలాంటివాళ్ళకు వాళ్ళకి తెలీకుండానే ఒక ప్రయోజనం అందుతుంది. అదే నోటికి, దవడలకు మంచి ఎక్సర్‌సైజ్. ఈ పని ప్రత్యేకంగా ఏమీ చేయనక్కర్లేదు. మీ రోజువారీ పనులు చేసుకుంటూ లేదా ఆఫీసు వర్క్ చేసుకుంటూ కూడా నమిలేయవచ్చు. రోజుకి 20నిముషాల పాటు వారం నమిలితే బుగ్లలు తప్పనిసరిగా తగ్గుతాయి.

నాలుకను తిప్పడం

నాలుకను కుడి నుంచి ఎడమకి 15సార్లు, ఎడమ నుంచి కుడికి 15సార్లు తిప్పడం వల్ల బుగ్గలు తగ్గుతాయి. ఇది బుగ్గలకి వ్యాయామంలా పని చేస్తుంది.

ప్రశాంతత కోసం.....

20 నిముషాలు!



ఆనందంగా జీవించాలని ఎవరికి ఉండదు. ప్రశాంతతను కోరుకోని వారు ఎవరు ఉంటారు. కానీ ఈ ఆధునిక జీవితంలో ఒత్తిడి బాగా ఎక్కువైంది. మనుషుల మధ్య సత్సంబంధాలు తక్కువయ్యాయి. స్కూలుకు వెళ్ళే పిల్లలు మొదలుకొని ముసలివారి వరకు అందరూ ఒత్తిడికి లోనవుత్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లల ఆలనాపాలనా చూసే సమయం కూడా వుండడం లేదు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కారణం చేత మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో సైకాలజిస్టులకు బాగా డిమాండ్ పెరిగింది. మరి ఈ పరిస్థితిని మనంతట మనం అధిగమించలేమా! ఎందుకు చేయలేం....చేయవచ్చు. ఈ ఒత్తిడిని తగ్గించడానికి నెలలు, సంవత్సరాలు కష్టపడక్కర్లేదు. ఆసుపత్రుల చుట్టూ తిరగనక్కర్లేదు. రోజుకి కేవలం ఒక్క 20 నిముషాలు కేటాయించండి చాలు. ఈ 20 నిముషాలు ఇంకే ఆలోచనా లేకుండా మీకు ఇష్టమైన పని చేయండి. మీకోసం మీరు కేటాయించుకునే ఈ 20 నిముషాలతో రోజంతా ఒత్తిడికి దూరమవ్వండి. మీకు ఇష్టమైన పని అంటే అది ఆట కావచ్చు, పాట కావచ్చు, వ్యాయామం కావచ్చు, విశ్రాంతి కావచ్చు, భాగస్వామితో లేదా మీకు నచ్చిన వ్యక్తితో (స్నేహితులు) కబుర్లు కావచ్చు, ఏదైనా ఇష్టంగా చేయండి. రోజుకి 20 నిముషాల పాటు ఆటల ఆడే వ్యక్తులు రోజంతా ప్రశాంతంగా ఉంటారు. రోజుకి 20 నిముషాల పాటు విశ్రాంతి తీసుకుంటే రోజంతా చేసే పనిలో ప్రశాంతంగా ఉంటారు. మీ భాగస్వామితో మీ భావాల్ని 20 నిముషాలు పంచుకుంటే చాలు మీ బంధం మరింత గట్టిపడుతుంది. 20 నిముషాల పాటు పుస్తకం చదివితే మానసికంగా మంచి ప్రశాంతత దొరుకుతుంది. రోజుకి 20 నిముషాల వ్యాయామం శరీరాన్ని తేలిక చేస్తుంది. 20నిముషాలు ధ్యానం చేయడం వల్ల రోజంతా మెదడు చురుకుగా పని చేస్తుంది. పాటలు వినడం ద్వారా కూడా మనస్సుకి హాయిగా వుంటుంది. ఉదయం లేవగానే మీ గురించి మీరు పాజిటివ్ 20 నిముషాలు ఆలోచించడం వల్ల ఆ రోజంతా మీకు ఆనందంగా గడుస్తుంది. ఇలా ప్రతిది మంచిగా ఊహించుకోవడం, మనకు నచ్చిన పనులు చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుంది, ప్రశాంతత చేకూరుతుంది. కానీ, ఇందులో ఏదైనా కూడా క్రమం తప్పకుండా కొన్నాళ్ళు చేసి చూస్తేనే కానీ మనకు కావలసిన ప్రయోజనం దక్కదనే విషయాన్ని మాత్రం గుర్తుంచుకోండి.





జరిగిన కథ

ఈ కెప్టెనుగిరికి అదనంగా ఇచ్చే రెండువందల యాభై చేర్చి యీనెల పన్నెండు వందలు ముట్టేయి. అమ్మ కోరిక ప్రకారం కృష్ణయ్యగారి బడికి నెలజీతం 'ఆకాశ రామన్న విరాళం' అని డిమాండు డ్రాఫ్టు పంపించేశాను. ఉద్యోగంలో ప్రవేశించాక మొదటిసారి జీతం అందుకోవడమే జ్ఞాపకం వస్తుంది. ఆరేళ్ళు అయినా ఇప్పటికీ కళ్ళకి కట్టినట్టే వుంది. అమ్మ అప్పుడు నాతో చెన్నపట్నంలో వుంది. "అమ్మా! ఇదుగో మొదటినెల జీతం మూడు వందల యాభై, ఇది నీ ఖర్చుకి!"

"నా ఖర్చు కేముందిరా, నాయనా? ఈరోజునుంచీ నువ్వు స్వతంత్రుడవయ్యావు. రేపు నేను విశాఖపట్నం వెళితే యెప్పటి నీళ్ళమోత నాకుండనే వుంది. నా బట్టా, తిండీ, నా దినం వెళ్ళిపోను మిగిలిన డబ్బులేం చేసుకోనురా? నీకెన్నో ఖర్చులుంటాయి. ఎప్పటికేనా నువ్వొక యింటివాడివి కావాలి. అందుకు వెనకేసుకోరా నాయనా!" అంది.

(నిన్నటి సంచిక తరువాయి)

"అదికాదమ్మా! నీ చెమటోడ్చి నన్ను పెంచావు. నేనీ నాటికి పెద్దవాణ్ణయ్యాను. నా కోర్కె నువ్వు చెల్లించాలే అమ్మా!" అన్నా.

"నువ్వన్నట్టే కానీ నాయనా! నిన్ను పెంచి పెద్దవాడిని చేసినమాట నిజమే. కాని నీకు విద్యాభిక్ష పెట్టింది ఆ కిష్టయ్య గారు. ఇంట్లో రెండు పూటలూ, రెండురోజులు వారం ఇచ్చి తన బడిలో వున్నంతవరకూ కాని జీతం పుచ్చుకోకుండా నీకు ఓనమాల దగ్గరనుంచి చదువు చెప్పాడు. మళ్ళీ జన్మలో ఆయన కడుపున పుట్టకుండా ఆయన ఋణం నేను తీర్చుకోడానికి సంవత్సరానికి ఒక నెలజీతం నువ్వు యేటేట బీదపిల్లలికి బడి జీతాలక్రింద యివ్వవలసిందని 'ఆకాశరామన్న ధర్మం' ఆయన పేర పంపించుతూండు. ఆ తరువాత నీ మనసు!" అంది అమ్మ.

ఆ డబ్బు తీసుకుని మళ్ళీ నా కిచ్చేస్తూనూ...

ఈమాట చెబుదాం శుభతో అనుకున్నా. కాని - మాటల సందర్భంలో విశాఖపట్నం సబ్-కలెక్టరు అక్క తన నేస్తం అనీ - ఆమెను చూడడానికి వెళుతున్నానని చెప్పింది.- అతడు సబ్ కలెక్టరు. ఐ.సి.ఎస్.వాడు. రేపో మాపో గవర్నరు కాబోతాడు. ఈమెది కాంగ్రెసు కుటుంబం. తల్లి దండ్రులు లక్షాధికార్లు. నీళ్ళబిందెలు మోసే అచ్చమ్మ కొడుకుని నేను!...అందని పళ్ళకి అర్రులు చాస్తున్నానేమో అని సిగ్గుపడి, నేను చెప్పదల్చుకున్న మాటలని నా కడుపులోకే దిగమింగేసుకున్నాను....

3 ఆమె

ఆదివారం సాయంత్రం మదనం నన్ను వాళ్ళ క్లబ్బుకి తీసుకెళ్ళాడు. హిందూదేశపు ప్రజలని యుద్ధంలో చేరమని ప్రచారం చేయడానికి కలకత్తా నుంచి జనరల్ రాబర్ట్సు ఇక్కడి కొచ్చాడుట. అతని గౌరవార్థం 'రాయల్టీక్లబ్బు' వారు ఆయనకి విందు చేస్తున్నారట ఈవేళ. క్లబ్బుకి నన్ను అరగంట ముందుగానే తీసుకువెళ్ళాడు - మదనం క్లబ్బుకి అధ్యక్షుడుకదా మరి? మేం వెళ్ళేటప్పటికే - చాలా మంది వచ్చేశారు. పెద్ద వుద్యోగస్తులు - మిలటరీ - నేవల్ ఆఫీసరుదొర ఒకతను - బ్రిటిషు అపజయాలను గురించి ఏదో హాస్యంగా మాట్లాడుతున్నాడు. దొరగాడే వేళాకోళం చేస్తూంటే మనకేం భయం అనుకుని మనవాడొకతను అందుకున్నాడు. వెంటనే మిలిటరీ ఉద్యోగి నల్లదొరొకతను సింగపూరు రేడియో పెట్టాడు. దాంతో సహం గుంపు సుభాసుచంద్రబోస్ ఉపన్యాసం విందాం అని రేడియో చుట్టూ మూగేరు. గోడమీద వేలకట్టిన ఆసియాపటం దగ్గర కొంతమంది చేరారు. "నేనేగనక హిట్లరు నవ్వుతే యీపాటికల్లా స్టాలినుతోసహా - మాస్కోని తుడిచిపెట్టేసి వోల్గానది దూకి, కాస్పియనుని దాటేసి యకాయకీ పరిష్యాలో వాలి, టోజోని కలుసుకుని వుందును!" అని ఒక మిలిటరీ అకౌంట్సు ఆఫీసరు యుద్ధవ్యూహం మీద భాష్యం చెపుతున్నాడు.

జిల్లా అధికార్ల భార్యలు అరడజనుమంది వచ్చారు. మొగాళ్ళకికాస్త దూరంగా - ప్రతివ్రతాశీలం చెడకుండా - కుర్చీలుమీద కూర్చున్నారు. పాపం, కుర్చీలమీద కూర్చున్నారే కాని - ముళ్లమీద కూచున్నట్లు కూచున్నారు. నేనూ వాళ్ళదగ్గరే



కూర్చున్నాను. కాని మదనం నన్ను వాళ్ళకి పరిచయం చెయ్యలేదు. నేను వాళ్లకబుర్లు వింటూ కూర్చున్నాను. ఒకావిడె అంటూంది: "మీనాక్షమ్మగారూ! మీ మెళ్ళో వజ్రాలహారం సరిగ్గా మొన్నా "ప్రణయరాత్రి" సినిమాలో ఉలూచి వేసుకున్న హారం లాగే వుందండీ! ఎప్పుడు చేయించుకున్నారేమిటి?"

"మొన్ననేనండీ - తాయారమ్మగారూ! మావారు మొన్న "వార్‌ఫండ్ కమిటీ" సభకి పట్నం వెళ్ళారు. వారివంతు కమీషను ముప్పై వేలిచ్చారు. గవర్నమెంటు. ఈ కరువురోజుల్లో కాగితం నోట్లకంటే - నగ కొని పారేస్తే పడివుంటుందని - మావారు. ఉమ్మిడియార్ అంగడిలో కొని తెచ్చారు" అందావిడె.



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

దాంతో అప్పల సరసమ్మగారని - ఒకావిడంది: "మావారూ సరిగ్గా అలాగే అన్నారు సుమండీ! ఈ హడావుడీ రోజుల్లో గవర్నమెంటె వుంటుందో వూడుతోందో అనిపిస్తూంటే, బ్యాంకు వాళ్ళని మాత్రం ఎవడు నమ్మమన్నాడని బ్యాంకీలో నుంచి కొంత ఫిక్సెడ్ డిపాజిట్లు తీసేసి, అంతా తీసేస్తే అదొక ప్రమాదం, వారు 'నేకెడ్ నైట్సులో ల్యూసీబెస్టు' మీరు ఆ సినిమాకీ వెళ్ళారా? మా వారితో కలిసి చూడడానికే సిగ్గేసిందంటే నమ్మండి - మహాబాగా వుంది లెండి - మొలకి వేసుకున్న కెంపుల కమలపట్టాలాంటిదే చేయించారు నాకు. బెంగుళూరుముండావాడు నలభైవేలు పుచ్చుకున్నాడండీ! ఎలాగుందంటారు?"

"మీ వారికి నచ్చితే మాకూ నచ్చినట్టేలెండి! మీరు వేసుకుంటే సినిమాలోకంటే మరీ అందంగా వుంది నగ! అవునుగాని పేరమ్మగారూ, మీ వజ్రాలత్మ మెట్లు మహాబాగా మెరుస్తున్నాయండీ సెర్చి లైట్లులాగు! మంచి వజ్రాలేనా?" అంది అనసూయగారు.

"మంచి వజ్రాలే అయివుండాలి లెండి. నేను అడగకుండానే మావారు కొని ఇచ్చారు. పదివేలు పెట్టి కొన్నారండీ! కంట్రాక్టరుని అందరి కళ్ళూ మామీదే వున్నాయిగాని - మా పొట్లు చూసే నాధుడెవడండీ? ఈ మిలిటరీ దొరలకి పోసుకోలేక, మనవాళ్ళకి జేబులు నింపలేక చచ్చిపోతున్నాం అంటే నమ్మండి. యుద్ధం ఈపాళంగా ఆగిపోయినట్టాయనా - మేం యే నుయ్యో గొయ్యో చూచుకోవలసిందే అనుకోండి" అంది పేరమ్మగారు.

"వెంకాయ్యమ్మగారూ! చీరె చాలా అందంగా వుంది, ఎక్కడ నేయించారు?" అంది మీనాక్షిగారు.

"పాతచీరేనండీ! కొర్నాడుది. మా ఆయన సిగరెట్టు చురక్కి అంచుకాలిపోతే, మా అమ్మాయి కొత్త అంచు కుట్టింది. నా చీరెలు, జాకెట్లు, మా ఆయన సూట్లు, పిల్లల పరికిణీలు, గౌన్లు అన్నీ కావడి పెట్టెల్లో పెట్టి పాలకొండలో మా బావగారింటికి పంపించేశాం - రోజులు బాగులేవని చెప్పి" అంది ఆమె.

తాయారమ్మగారు నాలుగువేపులా పరికించి నలుగురికీ వినిపించేటట్టు రహస్యంగా అంది: "గురువారం పున్నమికి జపానువాడు కళింగపట్నంల రేవులో దిగుతాడని, చింత గూడెంలో అల్లూరి సీతారామరాజు జాతికి మొన్న సుభాసుబోసు రంగంనుంచి రేడియోలో రహస్యంగా ఖబురు చేశాడని, ఆ వూరి కరణం అక్కడ హెడ్డుకానిస్టేబులుతో చెపితే, ఆ కబురు సర్కిలు ఇనస్పెక్టరు ద్వారా సూపరెంటుగారికి తెలిసి, ఆయన మా వారితో యేవో లావాదేవీలు మాట్లాడుకుంటూ రహస్యంగా రెండో కంటివాడికి తెలియకుండా చెవిలో వూదారు. అందుపైని - సర్కిలు ఇనస్పెక్టరుగారి ద్వారా మావారు - పోలీసులారీలు నాలుగు తెప్పించి, వారి పాతరసామానూ - మా పాతర సామానూ-బియ్యం-పప్పులు-ఆవకాయి-మగాయి-పాతచింత కాయపచ్చడి-పందిరమాలు పట్టీ మంచాలు-కుర్చీలు - పెట్టెలు -రోలు, రోకలి-రుబ్బురోలు-సన్నికల్లు - తిరగలి - కొండచీపురుతో సహా - గపుచుప్పుగా - యకా యకీని-త్రయోదశి నాటి రాత్రికి జయపురంలో మా ఆడపడుచు గారింట్లోకి జేరీశాం. మీ వారితో చెప్పి, మీ అబ్కారీ కంట్రాక్టర్ల లారీలు పుచ్చుకొని మీరూ ఆ పనే చెయ్యండీ! ఈ గవర్నమెంటు యే నిమిషానికి యెగిరిపోతుందో యెవడికి తెలుసు? కీడెంచి మేలెంచమన్నాడు!"

ఇంతట్లో కార్లచప్పుడైంది. కలక్టరుగారూ, జనరల్ రాబర్ట్సూ వస్తున్నారని ఎవరో అన్నారు. ఆ ఖబురు వినడంతోనే, రేడియో దగ్గర మూక, సింగపూరు ఆపుచేసి బి.బి.సి. పెట్టారు. గోడమీద తగిలించిన ఆసియాపటం ఇట్నించి అటు తిప్పేసరికల్లా ఇంగ్లండు పటం ప్రత్యక్షమయింది. హిట్లరు పక్షపాతులందరూ చర్చిలు కక్షిదార్లయ్యారు. విందు కార్యక్రమం అంతా జయప్రదంగా జరిగిపోయింది. మొగవాళ్ళందరికీ దొర్లవంటకాలు, బట్లర్ల వడ్డన. పింగాణీ చిప్పలలో. ఆడాళ్ళకి అరవ భోజనం, అయ్యర్ల వడ్డన అరిటాకుల్లో. దాహానికి షాంపేను. ఆడంగులకి నిమ్మకాయ పానకం. రాజభక్తి ప్రమాణాలు - బ్రిటిషుసేనకి అభివందనాలు - అతిథికి స్వాగతం - షాంపేనుతో సహా జోరుగా జరిగేయి. విందు పూర్తి అయాక - అందరూ అమితోత్సాహంతో "గాడ్ - సేవ్ - ది కింగ్" గానం చేశారు.

జనరల్‌గారూ, కలక్టరుగారూ వెళ్ళిపోయారు. మిగతా వారంతా వెళ్ళిపోవడానికి సిద్ధం అవుతూండగా "మనం ఇళ్ళు చేరుకునేసరికి బెర్లిను రేడియో అయిపోతుంది. అంచేత హిట్లరు ఏమంటున్నాడో ఇక్కడే వినేసి వెళ్ళిపోదాం" అన్నారెవరో...

...మదనం మంచిహుషారులో వున్నాడు. కారణం అడిగేను. తనకి 'మేజరు' హోదా ఇస్తానని జనరల్ రాబర్ట్సు ఖరారు చేశాడనీ - ఉత్తర సర్కారుల 'రిక్రూటుమెంటు' సంఘానికి తనని అధ్యక్షుడిగా వుండమని కలక్టరే కోరేదని - చెప్పాడు ...ఇంటిముందు కారు దిగుతూండగా - మదనం నన్ను ముద్దు పెట్టుకోబోయాడు. అతని పెదిమెలు నన్ను తాకేముందు - ఆ షాంపేను వాసన నాకు తగలగానే చరుక్కుని ఒక్క లెంపకాయ తగిలించినాను.


4 అతడు

ఇన్నాళ్ళకి శుభదగ్గిరనుంచి వుత్తరం! నిజానికి ఉత్తరం కాదు-కార్డు! అందులోనూ-బొమ్మకార్డు! ఒకవేపు 'డాల్ఫిన్సు నోసు' దృశ్యం - రెండోవేపు నాలుగు పాదాల చాటువు!

- ఇంకా వుంది.

నాణ్యమైన బోధన, ఉన్నత ప్రమాణాల కోసం

ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్



ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) జాతీయస్థాయి సంస్థ. విభిన్న పరిశోధనలకు ప్రోత్సాహన్నిస్తూ పలురకాల కోర్సులను నిర్వహిస్తోంది. స్టాటిస్టిక్స్, నేచురల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధన, బోధన, అనువర్తనలకు అంకితమైన ఈ సంస్థ ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది. కొత్తగా ప్రారంభిస్తున్న క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ కోర్సు ఈ విద్యా సంవత్సరానికి ప్రధాన ఆకర్షణ.

స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, ఎకనామిక్స్ కోర్సులపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు దృష్టి సారించాల్సిన సంస్థల్లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) ముఖ్యమైంది. వీటిలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిల్లో కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ చదువుకునే వారికి నాణ్యమైన బోధన, ఉన్నత ప్రమాణాలు, వసతులతోపాటు ప్రతినెలా స్టైపెండ్ అందించడం ఐఎస్ఐ ప్రత్యేకత. డిగ్రీ కోర్సుల్లో చేరినవారికి నెలకు రూ.3 వేలు, అదే పీజీ కోర్సులైతే రూ.5 వేలు, ఎంటెక్ కోర్సులకు ఎంపికైనవారికి రూ.8 వేలు స్టైపెండ్ చెల్లిస్తారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.28,000 ఇతర కోర్సులకు అయితే రూ.25,000 చొప్పున చెల్లిస్తున్నారు. ప్రవేశపరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఐఎస్ఐలో కోర్సులు, అర్హతలు, సీట్ల వివరాలు తెలుసుకుందాం..

ఐఎస్ఐ స్టాటిస్టిక్స్‌లోనే కాకుండా మ్యాథ్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు ప్రసిద్ధి చెందింది. బీస్టాట్, బీమ్యాథ్స్, ఎంస్టాట్, ఎంమ్యాథ్స్, ఎంఎస్ (క్యూఈ), ఎంఎస్ (క్యూఎంఎస్), ఎంఎస్ (ఎల్ఐఎస్), ఎంటెక్ (సీఎస్), ఎంటెక్ (సీఆర్ఎస్), ఎంటెక్ (క్యూఆర్ఓఆర్), పీజీ డిప్లొమాలు, రిసెర్చ్ ఫెలోషిప్పులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ సంస్థ కేంద్ర కార్యాలయం కోల్‌కతాలో ఉంది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, తేజ్‌పూర్‌లో శాఖలున్నాయి. అలాగే కోయంబత్తూరు, హైదరాబాద్, ముంబయి, పుణెల్లో నెట్‌వర్క్ కార్యాలయాలు ఉన్నాయి. అమెరికన్ ఎక్స్‌ప్రెస్, సిబిల్, డెలాయిట్, డాక్టర్ రెడ్డీస్, ఎర్నెస్ట్ అండ్ యంగ్, సిటీ కార్పొరేషన్, గోల్డ్‌మన్ శాక్స్, మెకిన్సే, హెచ్ఎస్‌బీసీ, ఐబీఎం, ఐసీఐసీఐ, జేపీమోర్గాన్, కేపీఎంజీ, నీల్సన్, మైక్రోసాఫ్ట్, రిలయన్స్, శాంసంగ్, వాల్మార్ట్ తదితర కంపెనీలెన్నో ఐఎస్ఐ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

▶ **యూజీ**

బీస్టాట్ : మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. నెలకు రూ.3000 స్టైపెండ్ చెల్లిస్తారు. 50 సీట్లు ఉన్నాయి.

బీమ్యాథ్స్ : మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. బెంగళూరు క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3000 స్టైపెండ్ చెల్లిస్తారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. సీట్ల సంఖ్య 50.

▶ **పీజీ**

మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ : స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ / బీటెక్ కోర్సు చదివి ఉండాలి. ఈ కోర్సు ఢిల్లీ, చెన్నై క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.5000 స్టైపెండ్ చెల్లిస్తారు. 30 సీట్లు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ మ్యాథమేటిక్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ / బీటెక్ కోర్సు పూర్తిచేసినవారు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.5000 స్టైపెండ్ చెల్లిస్తారు. 20 సీట్లు ఉన్నాయి.



క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ : ఏదైనా డిగ్రీ కోర్సుతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదవాలి. కోల్‌కతా, ఢిల్లీ క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. ఢిల్లీలో 27, కోల్‌కతాలో 18 సీట్లు ఉన్నాయి.

క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్సెస్ : మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏదైనా విభాగంలో బీఈ/ బీటెక్ పూర్తి చేయాలి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో కోర్సు నిర్వహిస్తున్నారు. 16 సీట్లు ఉన్నాయి.

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సుకి దరఖాస్తు చేసుకోవచ్చు. బెంగళూరు క్యాంపస్‌లో అందిస్తున్నారు. పది సీట్లు ఉన్నాయి.

▶ **ఎంటెక్**

కంప్యూటర్ సైన్స్ : మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్/ ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వీటిలో ఎందులోనైనా పీజీ లేదా బీఈ/ బీటెక్ చదివినవారు ఈ కోర్సుకు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. 35 సీట్లు ఉన్నాయి.

క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ : మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్/ ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.. వీటిలో ఎందులోనైనా పీజీ లేదా బీఈ/ బీటెక్ చేసి ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. 20 సీట్లు ఉన్నాయి. ఇది కొత్త కోర్సు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నారు.

క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్ : స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉండాలి. దీంతోపాటు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలి. లేదా మ్యాథ్స్‌లో మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీలో స్టాటిస్టిక్స్, ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదవాలి. లేదా బీఈ/ బీటెక్ ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందుబాటులో ఉంది. 25 సీట్లు ఉన్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్ : మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్ చదివిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. తేజ్‌పూర్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. 30 సీట్లు ఉన్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ : మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసినవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. 15 సీట్లు ఉన్నాయి. గిరిడీ క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం : ఫిబ్రవరి 7

చివరి తేదీ : మార్చి 9. అడ్మిట్ కార్డులు : ఏప్రిల్ 11 నుంచి అందుబాటులో ఉంటాయి.

పరీక్ష తేదీ : మే 13

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు : గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.

దరఖాస్తు ఫీజు : జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఓబీసీలకు రూ.500.

జేఆర్ఎఫ్

స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్; క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్; ఫిజిక్స్, జియాలజీ, బయలాజికల్ సైన్స్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సబ్జెక్టుల్లో జేఆర్ఎఫ్ అందిస్తోంది ఐఎస్ఐ. ఎంపికైన వారికి ఇంజినీరింగ్ కోర్సులకైతే ప్రతినెలా రూ.28,000, మిగిలిన అన్ని కోర్సులకు రూ.25,000 చొప్పున చెల్లిస్తారు.

ఇంటర్/డిగ్రీ/ పీజీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హతల ప్రకారం తాము కోరుకున్న కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.


తిరుగులేని కెరీర్‌కు.. మ్యాథ్స్

గణితం అంటే కేవలం ఒక సబ్జెక్టే కాదు, ఇతర విభాగాల్లోనూ దీన్ని పాత్ర కీలకం. నిర్మాణ రంగంలో ఇంజనీర్లకు, ఐటీ రంగంలో కంప్యూటర్ ప్రోగ్రామర్లకు, ఫైనాన్షియల్ రంగంలో, అకౌంట్స్, ఖగోళ శాస్త్రవేత్తలకు... ఇలా అన్ని విభాగాల్లో మ్యాథ్స్ మిళితమై ఉంటుంది. మ్యాథ్స్‌తో కెరీర్ స్కోప్, కోర్సులు, ఉండాల్సిన స్కిల్స్ గురించి వివరాలు తెలుసుకుందాం...

తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మ్యాథ్స్‌పై పట్టు సాధించడం ద్వారా జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఎంసెట్, క్యాట్ తదితర ప్రవేశ పరీక్షల్లో రాణిస్తున్నారు. తెలుగు విద్యార్థులే కాకుండా దేశంలోని చాలామంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టు ఉండేలా చూసుకుంటారు. చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఐఐఎస్సీ వంటి ప్రముఖ విద్యా సంస్థలు మ్యాథమెటిక్స్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిల్లో డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, పీజీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ స్థాయి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

బోధన వృత్తి :

మ్యాథ్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన వారు సబ్జెక్టుపై పట్టు ద్వారా.. బోధన, పరిశోధన, సాఫ్ట్‌వేర్, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లు.. ఇలా వివిధ మార్గాలో ఉపాధి అవకాశాలు పొందవచ్చు. దేశంలో ఐఐటీ జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ లాంటి ప్రవేశ పరీక్షలకు విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ పరీక్షలో మ్యాథ్స్‌దే అగ్రభాగం. ఇందులో సాధించే మార్కులే ర్యాంకు సాధించడంలో కీలకం. ఈ పరీక్షకు బోధించాలంటే మ్యాథ్స్‌పై గట్టిపట్టు ఉండాలి. గణిత సమస్యలకు వేగంగా సమాధానాలు గుర్తించడం, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేగలిగితే జేఈఈ, ఎంసెట్ కోచింగ్ సంస్థల్లో అవకాశాలు పొందొచ్చు. ఐఐటీ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షకు కోచింగ్ హడావుడి అంతాఇంతా కాదు. ఇంటర్‌లో రూ.లక్షలు చెల్లించి కార్పొరేట్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ మ్యాథ్స్ టీచర్లే ప్రధానం కాబట్టి వీరికి మంచి డిమాండ్ ఉంది. ఇంజనీరింగ్‌లోనూ మ్యాథ్స్ సబ్జెక్టు తప్పనిసరిగా ఉంటుంది. పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి ఇంజనీరింగ్ కళాశాలలు అవకాశాలు కల్పిస్తున్నాయి.



ఇతర ప్రవేశ పరీక్షలకూ...

ఐఐటీ, ఎంసెట్, ఇంజనీరింగ్ విభాగాల్లోనే కాదు.. జీఆర్ఈ, శాట్, క్యాట్, జీమ్యాట్, ఇతర పీజీ ప్రవేశ పరీక్షలు; ఐసెట్, ఎస్ఎస్‌సీ వంటి పోటీ పరీక్షలకు మ్యాథ్స్ నిపుణుల అవసరం ఉంటుంది. ఆయా కోర్సులు ఆఫర్ చేసే ఇన్‌స్టిట్యూట్లల్లో బోధించడం, సొంతంగా కోచింగ్ సెంటర్ ప్రారంభించడం లేదా ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పడం వంటి ఉపాధి వేదికలకు కొదవలేదు. ముఖ్యంగా ఇప్పుడు యూపీఎస్సీ ప్రిలిమ్స్, ఎస్ఎస్‌సీ, బ్యాంకు పీవో, క్లర్క్, స్పెషలిస్టు ఆఫీసర్, రైల్వే ఉద్యోగాలు మొదలైన వాటికి మ్యాథ్స్ సంబంధిత క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ తప్పనిసరిగా ఉంటుంది. చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సబ్జెక్టుపై పట్టుంటే.. ఈ రంగంలో పేరు సంపాదించు కోవడంతోపాటు మంచి వేతనాలు లభిస్తాయి.

ప్రభుత్వ ఉద్యోగాలు :

ప్రభుత్వ విద్యాసంస్థల్లో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వంటి పోస్టుల భర్తీకి పీజీ/ పీహెచ్‌డీ అర్హతగా నిర్ణయిస్తారు. యూజీసీ నెట్ పరీక్షల్లో అర్హత సాధిస్తే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఒకవేళ ఇందులో టాప్‌లో నిలిస్తే జేఆర్ఎఫ్ కూడా లభిస్తుంది. దీంతో నెలకు దాదాపు రూ.34 వేలు అందుకోవచ్చు. దీంతోపాటు పీహెచ్‌డీ పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుంది. మ్యాథ్స్‌లో డిగ్రీ పూర్తి చేసి బీఈడీ చేసిన వారు ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పోస్టులకు పోటీపడవచ్చు. ఈ పోస్టులకు ఎంపికైతే మంచి వేతనాలతో పాటు సుస్థిరమైన కెరీర్ ఏర్పరచు కోవచ్చు. మ్యాథ్స్ అభ్యర్థులు ఈవిధంగా బోధనరంగంలో అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

డేటా సైన్స్ :

సాంకేతిక రంగంలో సరికొత్త విప్లవం డేటాసైన్స్. భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి టెక్నాలజీలదే అనే అంచనా. వీటన్నింటికి గణితం నిపుణుల అవసరం ఉంటుంది. కాబట్టి మ్యాథ్స్, సంబంధించిన సబ్జెక్టులో పీజీ చేస్తే డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు. డేటా సైంటిస్టులకు మంచి వేతనాలు, ఉన్నతమైన కెరీర్ లభిస్తుంది. ప్రోగ్రామ్‌కు లాజిక్ రాయాలంటే మ్యాథ్స్‌పై అవగాహన ఉంటేనే సులువవుతుంది. మ్యాథ్స్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్ చదివిన వారిని సాఫ్ట్‌వేర్ సంస్థలు నియమించుకుంటున్నాయి. వీరు సాఫ్ట్‌వేర్ రంగంలో బిజినెస్ అనలిస్టుగా, ఆపరేషన్స రీసెర్చ్ ఎనలిస్ట్, కంప్యూటర్ సిస్టం ఎనలిస్ట్ తదితర హోదాలతో రాణించవచ్చు.

పీజీలో స్పెషలైజేషన్లు :

కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఐటీ వంటి డిమాండ్ ఉన్న కోర్సుల్లో చేరడానికి మ్యాథ్స్ నేపథ్యం తప్పనిసరి. అంటే.. మ్యాథ్స్‌ను కేవలం ఒక సబ్జెక్టులా కాకుండా.. దాన్ని ఆధారంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడానికి ఉన్న అవకాశాలను వెతుక్కోవాలి. మ్యాథ్స్‌ను డిగ్రీలో ఒక సబ్జెక్టుగా చదివినా, లేక ఆనర్స్‌గా కోర్సు పూర్తి చేసినా చాలా అవకాశాలు లభిస్తాయి. పీజీ స్థాయిలో కొన్ని సంస్థల్లో గణితంలోనూ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని యూనివర్సిటీల క్యాంపస్ కళాశాలల్లో మ్యాథ్స్ యూజీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆయా యూనివర్సిటీల అనుబంధ కళాశాలల్లోనూ మ్యాథ్స్ కోర్సు నిర్వహిస్తున్నారు.

కొన్ని ముఖ్యమైన ఇన్‌స్టిట్యూట్స్ :

చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
వెబ్‌సైట్ : http://www.cmi.ac.in/admissions
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్, చెన్నై
వెబ్‌సైట్ : https://www.imsc.res.in
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు
వెబ్‌సైట్ : http://www.math.iisc.ac.in
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
వెబ్‌సైట్ : http://www.uohyd.ac.in
టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్
వెబ్‌సైట్ : http://www.tifr.res.in
ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (కలకత్తా,చెన్నై, న్యూఢిల్లీ, హైదరాబాద్, బెంగళూర్, తేజ్‌పూర్, గిరిఢ్)
వెబ్‌సైట్ : https://www.isical.ac.in
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణే, తిరువనంతపురం
వెబ్‌సైట్ : www.iiserb.ac.in
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, భువనేశ్వర్‌ 8
వెబ్‌సైట్ : http://sms.niser.ac.in
హరీశ్ - చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అలహాబాద్,
వెబ్‌సైట్ : http://www.hri.res.in
ఐఐటీ ఢిల్లీ, గాంధీనగర్, హైదరాబాద్, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్, రూర్కీ రోపార్.
వీటిల్లో ప్రవేశాలు 'జామ్' ద్వారా జరుగుతాయి.

విశాలాంధ్ర బిజినెస్

-71.07	-18.00	-200	బంగారం (విశాఖపట్నం) 29,220		వెండి (విశాఖపట్నం) 41,200	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్ 33,703.59	నిఫ్టీ 10,360.40	బంగారం (విజయవాడ) 29,150 22 క్యారెట్లు, 10 గ్రాములు	ప్రొద్దుటూరు 29,220 22 క్యారెట్లు, 10 గ్రాములు	వెండి (విజయవాడ) 39,700 కిలో (రూపాయల్లో)	ప్రొద్దుటూరు 41,695 కిలో (రూపాయల్లో)	64.31

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	310.25	1.84
ఓ.ఎన్‌జీసీ	187.00	1.11
భారతీ ఎయిర్‌టెల్	417.65	0.85
ఎస్‌బీఐ	273.95	0.75
టీసీఎస్	2,983.45	0.70

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎం&ఎం	709.05	-2.48
యాక్సిస్ బ్యాంక్	53.70	-1.44
కోటక్ మహీంద్ర	1,045.00	-1.09
ఎస్ బ్యాంక్	316.00	-1.06
రిలయన్స్	930.00	-0.70

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.21	64.79
యూరో	79,72	79.99
పౌండ్	89.96	90.71
ఆస్ట్రేలియా డాలర్	50.83	51.07
సింగపూర్ డాలర్	48.90	49.13

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,220	31,251
చెన్నై	29,220	31,251
బెంగళూరు	28,850	30,855
ముంబై	30,210	31,251
విజయవాడ	29,150	31,600
విశాఖపట్నం	29,220	31,876
ప్రొద్దుటూరు	29,220	30,680

ముడి చమురు	64.84

బ్యాంకులను పర్యవేక్షించే నాథుడేడి?

- 7 నెలలుగా డిప్యూటీ గవర్నర్ పదవి ఖాళీ
- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కుంభకోణంపై ఆర్‌బీఐని ప్రశ్నించిన కేంద్రం



న్యూఢిల్లీ : దాదాపు ఏడు నెలలుగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులను పర్యవేక్షించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)లో పూర్తి స్థాయి డిప్యూటీ గవర్నర్ లేరు. గత జులైలో ఎస్ఎస్ ముద్ర పదవీ విరమణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆ పదవిని భర్తీ చేయలేదు. బ్యాంకింగ్ సెక్టార్‌తో కలుపుకొని ఆర్‌బీఐలో నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. డిప్యూటీ గవర్నర్లు విరాల్ ఆచార్య, బీపీ కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్‌ల ర్యాంకుల్లో ఉన్నతస్థాయికి చేరుకున్నప్పటికీ బ్యాంకుల పనితీరును పర్యవేక్షించే కీలకమైన డిపార్ట్‌మెంట్‌కు నియంత్రణ అధికార పదవి ఖాళీగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలను తనిఖీలు చేయడంలో బ్యాంకింగ్ పర్యవేక్షణ విభాగం పాత్ర కూడా ఉంటుంది. దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతున్న రూ.11,300 కోట్ల భారీ మోసంపై వస్తున్న ఆరోపణలపై ఈ ఏడాది జనవరిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) గుర్తించేంత వరకూ కూడా ఆర్‌బీఐ కనిపెట్టడంలో ఆ సంస్థ విఫలమైనట్లు కనిపిస్తోంది.

జులై 30న ముద్ర రిటైర్మెంట్ పూర్తికాక ముందే నాలుగో డిప్యూటీ గవర్నర్‌ను నియమించేందుకు ప్రభుత్వం ప్రక్రియను కూడా ప్రారంభించింది. కానీ, ఎందుకో ఇంటర్వ్యూ పూర్తయి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితాను రద్దుచేసింది. ఇంటర్వ్యూలు అయిన నాలుగు నెలల తరువాత అంటే డిసెంబర్‌లో నియామక ప్రక్రియను మళ్లీ ప్రారంభించింది. ఇప్పటికి కూడా కొత్త అభ్యర్థులతో కూడిన జాబితాను మాత్రమే రూపొందించింది.

ఈ అత్యున్నత పదవి కోసం బ్యాంకింగ్ సెక్టార్‌లో పనిచేస్తున్న ప్రముఖ అధికారులు పోటీ పడుతున్నారు. భారత్‌లో అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ ఎండీ బి.శ్రీరామ్ ముందు వరసలో ఉన్నారు. గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన సీఎండీలను డిప్యూటీలుగా నియమిస్తూ వస్తుండగా.. గతేడాది నుంచి ప్రైవేట్, విదేశీ బ్యాంకుల్లో కార్యనిర్వాహక పదవుల్లో పనిచేసినవారిని కూడా ఈ పదవికి అనుమతినిస్తున్నారు. హర్షద్ మెహతా స్కాం అనంతరం ఆర్‌బీఐ పరిశీలన పాత్ర ఉండాలనే ఉద్దేశంతో బ్యాంకింగ్ పర్యవేక్షణ విభాగాన్ని 1993లో తొలిసారిగా ఏర్పాటు చేశారు.

ఇంత కాలం ఏం చేశారు

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన కుంభకోణం ఎందుకు బయటపడలేదని కేంద్రం రిజర్వ్ బ్యాంక్‌ను ప్రశ్నించింది. ప్రభుత్వ బ్యాంకుల్లో ఏం జరిగినా ఆర్‌బీఐకి తెలీకుండా ఉండదని అలాంటిది ఇంత పెద్ద మోసం జరుగుతుంటే ఆర్‌బీఐ ఏం చేస్తోందని ప్రశ్నించింది. ఈ మేరకు కేంద్రం ఆర్‌బీఐకి లేఖ రాసింది. పీఎన్‌బీకి చెందిన ముంబయి శాఖలో రూ.11 వేల కోట్లకు పైగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ కుంభకోణం నేపథ్యంలో పీఎన్‌బీని మోసగించి రూ.11,400 కోట్లు అప్పుగా తీసుకున్న ప్రముఖ వజ్రాల వ్యాపారవేత్త నీరవ్ మోదీపై కేసు నమోదైంది. మరోపక్క ఈ కుంభకోణం కేసు విషయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణలో వేగం పెంచింది. ఈ కుంభకోణం నేపథ్యంలో ఆదివారం ఈడీ దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఉన్న జువెలరీ దుకాణాల్లో సోదాలు నిర్వహించింది.

పీఎన్‌బీ కుంభకోణం దర్యాప్తు ఓ కొలిక్కి రాకముందే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రముఖ పెన్నుల కంపెనీ రోటామాక్ అధినేత విక్రమ్ కొఠారీ పలు ప్రభుత్వ బ్యాంకుల నుంచి రూ.800 కోట్లకు పైగా రుణాలు తీసుకుని ఎగవేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయపై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది.

పీఎన్‌బీ, రొటోమ్యాక్ కుంభకోణాలతో

నష్టాల్లో నమోదైన మార్కెట్లు

వరుసగా మూడోరోజూ..

భారీగా నష్టపోయిన ప్రైవేటు బ్యాంకులు



ముంబై: పీఎన్‌బీ, రోటోమ్యాక్ కుంభకోణాల నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్‌లో నష్టాలను చవిచూసిన దేశీయ మార్కెట్లు నేడు కాస్త కోలుకున్నప్పటికీ మార్కెట్ ముగిపంపుకువచ్చేసమయానికి నష్టాల్లో నమోదయ్యాయి. మంగళవారం ట్రేడింగ్‌ను లాభాలతో ప్రారంభించాయి. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా లాభంతో మొదలైంది. అయితే ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ఈ గురువారంతో ముగియనుండటంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో ఆరంభంలో మార్కెట్ కాసేపు ఒడుదొడుకులను ఎదుర్కొని చివరకు నష్టాల్లో నమోదైంది. సెన్సెక్స్ 71 పాయింట్లు నష్టపోయి 33,704 పాయింట్ల వద్ద నిఫ్టీ 50 ఇండెక్స్ 18పాయింట్ల నష్టంతో 10,360 వద్ద ముగిసింది. పిఎస్‌యు బ్యాంకు ఇండెక్స్ 2శాతం నష్టపోయింది. ఐటి,ఫార్మా,రియాల్టీ షేర్లు లాభాల్లో ముగిసాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్, వేదాంత, ఎన్‌ఎమ్‌డిసి లిమిటెడ్ షేర్లు 1.1శాతంతో ముగిసాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకింగ్ రంగంలో సిండికేట్ బ్యాంకు 4.7శాతానికి పెరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు టాప్ గెయినర్స్‌గా నమోదైంది. డాలర్‌తో రూపాయి మారకపు విలువ 68పైసలు నష్టపోయి మూడునెలల కనిష్టానికి దిగజారి 64.88 వద్ద నమోదైంది. విదేశీ మదుపరులు సుమారు రూ.895.79 కోట్లు షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. దేశీయ మదుపరులు రూ.586.52 కోట్లు షేర్లు కొనుగోలు చేశారు. అంతర్జాతీయ మార్కెట్ రంగంలో, ఆసియన్ స్టాక్స్ మంగళవారం నష్టాల్లో ముగిసాయి. ఎమ్ఎస్‌సిఐ బ్రాడెస్ట్ ఇండెక్స్ జపాన్ వెలుపల ఆసియాపసిఫిక్ షేర్లు యూరోపియన్ ఈక్విటీలు పడిపోవడంతో 0.4శాతం తగ్గాయి. జపాన్ నిక్కీ సోమవారి 2శాతం పెరిగినప్పటికీ, 1శాతంతో 21, 025.10 పాయింట్ల వద్ద ముగిసింది. పాన్‌యూరోపియన్ ఎస్‌టిఓఎక్స్‌ఎక్స్ ఇండెక్స్ సోమవారం 0.6శాతం దిగజారింది. వరుసగా మూడురోజులు లాభాల్లో ముగిసింది.

3నెలల కనిష్టానికి

దిగజారిన రూపాయి



ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ మంగళవారం 58పైసలు తగ్గి 64.79 వద్ద నిలిచింది. ఇంటర్‌బ్యాంకు ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో 64.85 వద్ద నిలిచింది. నవంబరు మధ్యనుండి చూసుకుంటే ఇదే అత్యల్పంగా పేర్కొనవచ్చు. అమెరికా డాలర్‌కు దిగుమతులు, బ్యాంకుల నుండి డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ తగ్గినట్లు ట్రేడర్లు పేర్కొన్నారు. శుక్రవారం రూపాయి 30పైసల నష్టంతో 64.21 వద్ద నిలిచింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు? వాణిజ్యలోటు మరింత పెరగడంతో రూపాయి డిమాండ్ తగ్గిందని చెప్పవచ్చు.

రూపాయి తగ్గేందుకు...

1. వరుసగా మూడవరోజు డొమెస్టిక్ ఈక్విటీ మార్కెట్ నష్టాల్లో నమోదు కావడంతో రూపాయి విలువ తగ్గింది. డొమెస్టిక్ స్టాక్స్ విలువ తగ్గడం రూపాయి నష్టాల్లో నమోదైంది. పీఎన్‌బీ, కుంభకోణంతో బ్యాంకింగ్‌స్టాక్స్ నష్టాల్లో నమోదవుతున్నాయి. ఈ రోజు జరగనున్న యుఎస్ ఫెడరల్ సమావేశం నేపథ్యంలో ఇండియన్ రూపాయి డాలర్‌తో మరింత సన్నగిల్లింది.
2. దేశీయ వాణిజ్యలోటు జనవరిలో నాలుగున్నరేళ్లకు పెరగడంతో పెట్టుబడి దారుల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసింది.
3. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్ మూడేళ్ల కనిష్టం నుడి పుంజుకుని **88.523** వద్ద నిలదొక్కుకుంది. డాలర్ ఇండెక్స్ అనేది బాస్కెట్‌లోని విదేశీ కరెన్సీలతో అమెరికా డాలర్ విలువ కొలత. డాలర్ ఇండెక్స ఇతర కరెన్సీలతో **0.3**శాతం పెరిగి **89.346** వద్ద నమోదైంది.



14నిమిషాల్లో.. 140 కిలోమీటర్లు

- పుణె-ముంబై మధ్య అత్యాధునిక రైలు మార్గం
- 2024 నాటికి అందుబాటులోకి..

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబై, ఉత్పాదక ఐటీ హబ్ పుణె మధ్య గల 140 కి.మీ. ప్రయాణానికి ప్రస్తుతం రెండు నుంచి మూడు గంటల సమయం పడుతున్నది. కానీ ఆరు నుంచి ఏడేండ్లలో అది 14. 25 నిమిషాలకు తగ్గిపోనున్నది. ప్రత్యేకంగా హైపర్ లూప్ టెక్నాలజీతో సొరంగాల (ట్యూబ్) రూపంలో రూపొందించిన రైలు మార్గం ద్వారా ఇది సాకారం కానున్నది. ఆదివారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మ్యాగ్నటిక్ మహారాష్ట్ర గ్లోబల్ సదస్సు దీనికి వేదికగా నిలిచింది. ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, అమెరికాకు చెందిన హైపర్‌లూప్ వన్ చైర్మన్ రిచర్డ్ బ్రాన్సన్ ఈ మేరకు అవగాహనాఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేశారు. ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్మించే ఈ ప్రాజెక్టు ప్రయోగాత్మకంగా పూర్తి చేయడానికి మూడేండ్లు పడుతుంది. పూర్తిస్థాయిలో ప్రజలకు 2024 నాటికి అందుబాటులోకి వస్తుంది. పుణె సెంట్రల్ నుంచి నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మీదుగా ముంబైకి 140 కి.మీ. పొడవునా సొరంగాల (ట్యూబ్) లోపల రైలు మార్గాన్ని నిర్మిస్తారు. దీనిపై ఆరు నెలల అధ్యయనం తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వానికి వర్జిన్ గ్రూప్ సవివరమైన నివేదిక సమర్పించనున్నది.

- దీంట్లో ప్రయాణించే రైలు గంటకు 1000 కి.మీ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్నా.. సగటున 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది.
- రైలుమార్గంలో ఆటంకాల్లేకుండా నివాస సముదాయాలను, భవనాలను తొలిగిస్తే 14 నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకోవచ్చు. లేకపోతే 25 నిమిషాలు పడుతుంది.
- అంతర్జాతీయంగా అత్యంత రద్దీగా ఉండే ఆర్థిక కారిడార్లలో ముంబై పుణె కారిడార్ ఒకటి. ఈ రెండు నగరాల మధ్య ఏటా సుమారు 12 కోట్ల వాహనాలు ప్రయాణిస్తాయి.
- ముంబై నౌకాశ్రయానికి దిగుమతయ్యే సరుకుల్లో 25 శాతం పుణెకు తరలిస్తారు.
- స్పీడ్‌రైల్ నెట్‌వర్క్‌తో పోలిస్తే ఇది చౌక ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 100 కోట్ల డాలర్ల (రూ. 6451 కోట్లు) కు పైగా ఖర్చవుతుందని అంచనా. వేల మందికి ఉపాధి లభిస్తుంది.
- రెండు మార్గాల్లో గంటకు 10వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంది. పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే ఏడాదిలో 15 కోట్ల మందిని చరవస్తుంది. ప్రయాణ చార్జీలు సామాన్యులకు అందుబాటులో చౌకగా ఉంటాయి. ప్రస్తుత ప్రయాణ సమయంతో పోలిస్తే ప్రజలు ఐదో వంతు సమయంలోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ఈ రవాణా వ్యవస్థతో ప్రమాదాలను నివారించవచ్చు.
- రైలుమార్గం నిర్మాణానికి ఉపయోగించే ట్యూబ్‌ల ఉత్పత్తికి పుణె కేంద్రమవుతుంది. విద్యుత్‌సాయంతో నడిచే ఈ ఈ ట్యూబ్‌లను విదేశాలకు ఎగుమతి చేయొచ్చు.
- మధ్యప్రాచ్యం, ఉత్తర యూరప్, అమెరికా కంటే ముందే హైపర్‌లూప్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన దేశంగా భారత్ నిలుస్తుంది.
- ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు మహారాష్ట్రతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు ఆసక్తి చూపాయి. 2017 సెప్టెంబర్‌లో కాలిఫోర్నియా కేంద్రంగా పని చేస్తున్న హైపర్‌లూప్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీస్ (హెచ్‌టీటీ) సహకారంతో విజయవాడ అమరావతి మధ్య తొలి హైపర్‌లూప్ రైలుమార్గం నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

తలుపులన్నీ మూసేశారు

- అతిగా స్పందించి మాపై దుష్ప్రచారం చేశారు
- బకాయిలు చెల్లించనీయకుండా దెబ్బతీశారు
- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోడీ లేఖ

ముంబై: దేశ చరిత్రలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణానికి పాల్పడి పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ను నిట్టనిలువునా ముంచిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఇప్పుడు ఆ ఏకంగా బ్యాంకునే సవాలు చేస్తున్నాడు. ఈ వ్యవహారంలో పీఎన్‌బీ అతిగా వ్యవహరించిందని, తనపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం నిర్వహించి రుణాలను తిరిగి చెల్లించనీయకుండా తలుపులన్నీ మూసేసిందని అతను పేర్కొన్నాడు. ఈ విషయమై నీరవ్ కొద్ది రోజుల క్రితం పీఎన్‌బీ యాజమాన్యానికి లేఖ రాశాడు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు తన కంపెనీలు చెల్లించాల్సిన బకాయిలు రూ.5 వేల కోట్ల లోపే ఉంటాయని అతను ఆ లేఖలో స్పష్టం చేశాడని పీటీఐ వార్తా సంస్థ వెల్లడించింది. మేము చెల్లించాల్సిన బకాయిలపై పీఎన్‌బీ అతిగా స్పందించి మీడియాలో తప్పుడు ప్రచారం చేయడంతో అధికారులు మా కంపెనీల్లో సోదాలు నిర్వహించి వాటిని సీజ్ చేశారు. దీంతో మా బ్రాండ్ నేమ్ దెబ్బతిని ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ సంస్థలు మూతబడటంతో పాటు బ్యాంకులకు రుణాలు తిరిగి చెల్లించకుండా మమ్మల్ని దెబ్బతీశాయి. ఇప్పుడు ఈ రుణాలన్నీ తిరిగి చెల్లించలేనివిగా మిగిలిపోయాయి అని నీరవ్ మోదీ ఆ లేఖలో పేర్కొన్నాడు.

శిశు సంరక్షణకోసం


యూనిసెఫ్ ప్రచారం

కాట్మండు : ప్రతి తల్లి పుట్టబోయే శిశువు కోసం ఆరోగ్య పరిరక్షణ విధాలను, శిశువు ఆరోగ్యంగా, సుఖంగా ప్రసవించాలని కోరుకుంటుంది. దీనికనుగుణంగా 'ప్రతి శిశువూ బతికేఉండాలని' అన్న నినాదంతో యూనిసెఫ్ మంగళవారం తల్లి, శిశువులకోసం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ప్రచారంలో భాగంగా యూనిసెఫ్ నేపాల్ ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ, తక్కువ ఆదాయంకల దేశాల్లో, నవజాత శిశువుల మరణాల రేటు వేయిమందిలో 27 వరకు ఉన్నట్లు వెల్లడిచంది. సురక్షిత ప్రాంతాలతో పోల్చి చూసుకుంటే ప్రసవించేందుకు సరైన వసతులు,పోషకాహారం లేని ప్రాంతల్లో 50రెట్లు మరణాలరేటు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నేపాల్ డెమొగ్రాఫిక్ హెల్త్ సర్వే 2016 ప్రకారం, మొదటి 28రోజుల్లో 48 శిశువుల్లో ఒకరు మరణానికి గురవుతున్నట్లు నమోదైంది. హిమాలయ ప్రాంతాల్లో ప్రతి ఏడాది 13,000 మంది శిశువులు మరణిస్తున్నట్లు వెల్లడైంది. నెలలు నిండకుండానే ముందస్తుగా పుట్టిన పిల్లల్లో పుట్టుకలో లోపాలు, ఇన్‌ఫెక్షన్స్ వంటి న్యుమోనియా, సెప్సిస్ కారణంగా 80శాతానికన్నా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది. మిడ్‌వైవ్స్‌కు సరైన శిక్షణసదుపాయాలు, శుభ్రమైన నీరు, డిస్‌ఇన్‌ఫెక్టంట్స్, మొదటి గంటలో బ్రెస్ట్‌ఫీడింగ్, పోషకాహారంతో ఈసమస్యలను కొంతవరకు అధిగమించవచ్చు.

విజ్ఞానం

మెదడులోపాలకు

యాంటీ డిప్రసెంట్ మందు



మద్యం వినియోగంతో మెదడులోని లోపాలను యాంటి డిప్రసెంట్ డ్రగ్ నివారిస్తుందని ఆస్ట్రేలియన్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. టాండోస్పిరోన్ అనే డ్రగ్‌సహాయంతో మెదడును రిబూట్ చేస్తుందని తెలుస్తోంది. ఆల్కాహాల్ అధిక వినియోగంతో దెబ్బతిన్న బ్రెయిన్‌లోని కణాలు నిర్వీర్యంకాకుండా టాండోస్పిరాన్ సంరక్షిస్తుందని ఆస్ట్రేలియా లో క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ వెల్లడించింది. ఎలుకలపై చేపట్టినప్రయోగంలో రోజూ రెండువారాలపాటు టాంటోస్పిరాన్‌తో చేపట్టిన ప్రయోగంలో ఆల్కాహాల్ వినియోగంతో పెరుగుతున్న ఆందోళన కలిగించే పద్ధతి తగ్గుముఖం పట్టినట్లు గమనించారు. ఈ మందులువాడిన 15 వారాల్లో ఆల్కాహాల్ వినియోగంతో పెరిగిన న్యూరోజనెసిస్, దెబ్బతిన్న మెదడు ప్రాంతాలు పుంజుకున్నట్లు తెలుస్తోంది.

మెదడులో కాల్షియం

ఎక్కువైతే...పార్కిన్‌సన్స్ వ్యాధి



ఎముకల ఆరోగ్యానికి కాల్షియం ప్రధానమైనదని మనకు తెలుసు. పళ్ల గట్టిదనానికి, గుండె, కండరాల దృఢత్వానికి, నరాల బలానికి కాల్షియం దోహదంచేస్తుంది. ఆహారంలో తగినంత కాల్షియం తప్పనిసరి. తాజా అధ్యయనం ప్రకారం మెదడుకణాల్లో కాల్షియం నిల్వలు అధికంగా ఉన్నట్లయితే పార్కిన్‌సన్స్ వ్యాధికి కారణమైన టాక్సిన్లకు దారితీస్తుందని తెలుస్తోంది. న్యూరోడిజనరేటివ్ డిజార్డర్ అయిన పార్కిన్‌సన్స్ కేంద్రీకృత నాడీవ్యవస్థను నియంత్రిస్తుంది. మెదడు లోని పార్కిన్‌సన్స్ వ్యాధికి కారణమైన ప్రోటీన్ ఆల్ఫా-సిన్‌న్యూక్లియాన్ శాతం మెదడులో ఎక్కువైతే బ్రెయిన్‌సెల్స్‌ను నిర్వీర్యం చేస్తుంది. మొదటిసారి ఈ విధానాన్ని గమనించినట్లు కేంబ్రిడ్జి యూనివర్సిటీ వెల్లడించింది. ఆల్ఫా-సిన్‌న్యూక్లియాన్ కాల్షియం సెన్సార్ వంటిదే.. కాల్షియం సమక్షంలో అది దాని నిర్మాణాన్ని మారుస్తుంది. అది పర్యా వరణంతో ఎలా విలీనం అవుతుందో..సాధారణ విధికి చాలా ముఖ్య మైనదని తెలుస్తోంది.

స్వల్పంగా తగ్గిన బంగారం



న్యూఢిల్లీ: బంగారం ధరలు మంగళవారం స్వల్పంగా తగ్గాయి. రూ.100లు తగ్గి 10గ్రాములు రూ.31,700 వద్ద నమోదైంది. అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ తగ్గడం, ఆభరణాల వర్తకులకు ఆర్డర్లు తగ్గడం బంగారం ధరలు తగ్గేందుకు కారణమైంది. వెండి ధర రూ.535లు తగ్గి కేజీ వెండి ధర రూ.39,440 కి చేరింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు 0.62శాతం తగ్గి ఔన్స్ 1337.70 దాలర్లు పలికింది. వెండి ధరలు 1.05శాతం తగ్గి ఔన్స్ 16.47 డాలర్లకు చేరాయి. దేశ రాజధానిలో 99.9 మరియు 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధరలు రూ.100 తగ్గి రూ.31,700, రూ.31,550 పలికింది. సోమవారం రూ.50లు లాభపడింది.

మార్కెట్లో ఎయిరో కూల్ ఫ్యాన్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఓరియంట్ ఎలక్ట్రిక్ 300 సిఎంఎం కలిగిన తక్కువ ఎయిర్ వర్టెక్స్ సూపర్ ప్రీమియం సీలింగ్ ఫ్యాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఏయిరో కూల్ ఆకర్షణీయమైన రూపం, ఎయిరో ఫాయిల్‌తో కూడిన బ్లేడ్ డిజైన్, వింగిల్ టెక్నాలజీ కలిగి ఉందని ఓరియంట్ ఎలక్ట్రిక్, ఫ్యాన్స్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అతుల్ జైన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో, ఢిల్లీ, యూపీ, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఎయిరో సిరీస్ ఫ్యాన్లకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఎయిరో స్టాం ఫ్యాన్ల గురించి అమెజాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం విజవంతమైందని, వచ్చే 2 సంవత్సరాల్లో సూపర్ ప్రీమియం ఫ్యాన్స్ అమ్మకాల్లో మార్కెట్లో అగ్రస్తానంలో ఉంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓరియంట్ ఎయిరోకూల్ బ్లేడ్లు 1320 ఎంఎం స్వీప్ కలిగి, 100 శాతం తుప్పు పట్టవని, అంతే గాక వీటి నిర్మాణానికి ఉపయోగించిన హై గ్రేడ్ గ్లాస్ ఫీల్డ్ కాంపౌండ్ ఎబిఎస్ బ్లేడ్లకు దృఢత్వాన్నిస్తుందన్నారు.విమానంలోని రెక్కల్లో ఉండే ఎయిర్ ఫాయిల్ డిజైన్ ఆధారంగా రూపొందించబడ్డ ఈ ఏయిరో కూల్ ఫ్యాన్లు కేవలం రు.5290కే లభిస్తాయని జైన్ తెలిపారు.

తేజ్ నుంచి ఇక బిల్లులు కూడా కట్టొచ్చు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ద్వారా సులభంగా నగదు పంపుకునేందుకు గూగుల్ రూపొందించిన తేజ్ యాప్ నుంచి ఇక బిల్లులు కూడా కట్టొచ్చు. ఈ సౌలభ్యాన్ని వినియోగదారులకు తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం డీటీహెచ్ చెల్లింపులు, మొబైల్ బిల్లులు, నీటి బిల్లులు, గ్యాస్ తదితర చెల్లింపులు అన్నీ జరపొచ్చు. వీటికి ఎలాంటి లావాదేవీ రుసుం వసూలు చేయరు. దాదాపు దేశంలోని 80కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సంబంధించిన చెల్లింపులను ఈ యాప్ ద్వారా చేయొచ్చు. తాము ప్రత్యేకంగా రూపొందించిన బిల్లుల చెల్లింపుల వ్యవస్థను తేజ్ యాప్‌లో జోడించామని దీని ద్వారా వినియోగదారులు విస్తృత స్థాయిలో బిల్లు చెల్లింపులు జరపొచ్చని పేమెంట్స్ అండ్ కామర్స్ విభాగం ఉపాధ్యక్షురాలు దయానా లేఫీల్డ్ చెప్పారు. వినియోగదారునికి సదరు బిల్లు అందగానే నోటిఫికేషన్ సైతం వచ్చేలా ఏర్పాటు చేశారు. బిల్లు చెల్లించేందుకు యూజర్స్ 'న్యూ పేమెంట్' ఆప్షన్స్‌లోకి వెళ్లి 'పే యువర్ బిల్స్'పై క్లిక్ చేయాల్సి ఉంటుంది.

చికెన్ లేక కేఎఫ్‌సీలు మూసివేత!

లండన్: యూకేలో ఉన్న దాదాపు 900 కేఎఫ్‌సీ ఔట్‌లెట్స్‌లో సగానికి పైగా మూతపడ్డాయి. ఎందుకంటే అక్కడి కేఎఫ్‌సీలకు చికెన్ కొరత వచ్చిపడింది. కేఎఫ్‌సీలకు చికెన్ సరఫరా చేయడంలో ఇబ్బందులు ఏర్పడడంతో యూకేలోని వందలాది రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్టు సంస్థ వెల్లడించింది. కేఎఫ్‌సీ గత వారం చికెన్ సరఫరా చేసేందుకు డీహెచ్‌ఎల్ అనే డెలివరీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డెలివరీ సంస్థలో నిర్వహణపరమైన సమస్యల కారణంగా చికెన్ సరఫరా చాలా ప్రాంతాల్లో నిలిచిపోయింది. ఈ సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయో స్పష్టంగా తెలియడం లేదని కేఎఫ్‌సీ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఉద్యోగుల్ని సెలవులు తీసుకోవాలని సూచిస్తున్నామని, అయితే బలవంతం చేయట్లేదని చెప్పారు. తమ బృందాలు సమస్యలు పరిష్కరించేందుకు అనుక్షణం కృషి చేస్తున్నాయని, త్వరలో ఇబ్బందులు తొలగిపోతాయని తిరిగి త్వరలోనే రెస్టారెంట్లు ప్రారంభమవుతాయని తెలిపారు.

చెరకు విత్తనం ఖర్చు తగ్గించడానికి

శ్రీ విధానం శ్రేయస్కరం

విత్తనం ఖర్చును తగ్గించుకొంటే చెరకు సాగు లాభదాయకమౌతుంది. ఎకరం పొలంలో నాటడానికి అవసరమైన విత్తనం ఖరీదు రూ.15 వేలు దాటుతుంది. శ్రీ విధానం అవలంబించడం వల్ల ఈ ఖర్చులో 75 శాతం తగ్గించుకోవచ్చని పలు పరిశోధనలు రుజువు చేశాయి. 30 రోజులపాటు చెరకుకు అందించే నీటిని కూడా ఆదా చేయవచ్చు. నెలరోజులపాటు చెరకు నాటాలనుకొన్న పొలంలో మరోపైరు సాగుచేసుకోవచ్చు. ఇలాంటి ప్రయోజనాలుండటం వల్లనే దీన్ని శ్రీ విధానం అంటున్నారు యస్.ఆర్.ఐ. (సుగర్‌కేన్ రెన్యూడ్ ఇంటెన్సిఫికేషన్) పరిశోధకులు.



నాటటానికి తయారైన మొక్క

ఈ విధానం కోసం ముందుగా 120 ప్లాస్టిక్ ట్రేలు, సుమారు రెండు సెంటీమీటర్ల విస్తీర్ణానికి సరిపడే షేడ్ నెట్, 100 కిలోలు కాయర్ ఫిట్ అవసరమౌతాయి. వీటిలో ట్రేలు, షేడ్‌నెట్‌లను కొన్నేళ్లపాటు పలుమార్లు రైతులు ఉపయోగించుకోవచ్చు. చెరకు నుంచి కన్నులు వేరుచేయడానికి ఒక 'హెరిజ్ కట్టర్' అవసరమౌతుంది.


కాయర్ ఫుట్ నింపిన ట్రేలలో కన్నులు పెప్ప

ఎకరంలో నాటడానికి సుమారు 10 నుంచి 12 సెంట్లుగాని, నాలుగు టన్నులు గానీ విత్తనం అవసరం. ఇది కూడా లేతదై ఉండాలి. శ్రీ విధానానికి ముదురు విత్తనమైనా సరిపోతుంది. పైన పేర్కొన్న పరికరాలను సిద్ధం చేసుకొన్నాక 500 చెరకు గడలు తీసుకోవాలి. ఫ్యాక్టరీకి సరఫరా చేసేదైనా సరే! మొదట్లో అయిదారు కణుపులు, చివర్లో మూడు నాల్గు కణుపులు వద్ద కన్నులను వదిలేయాలి. మిగిలిన భాగంలోని కన్నులను హేండ్ కట్టర్‌తో కత్తిరించాలి. కత్తిరించిన కన్నులను చేతి సంచుల్లో పోసి, ముందు ద్రావణం కలిపిని ప్లాస్టిక్ గిన్నెల్లో కొద్దిసేపు వుంచి, విత్తనశుద్ధి చేయాలి. ప్లాస్టిక్ ట్రేలలో సగం వరకు కాయర్ ప్లేట్‌తో నింపి, అటు తర్వాత శుద్ధిచేసిన విత్తనం ముచ్చెలను ట్రేలలో వుంచి, మిగిలిన భాగం కూడా కాయర్ పిట్‌తో నింపాలి. ఒక ఎకరం పొలానికి 50 గళ్లున్న ట్రేలు 120 సరిపోతాయి. వాటిని వరుసగా పేర్చి, 5 రోజులు వుంచితే మొలకులు వస్తాయి. వాటిని షేడ్‌నెట్ క్రింద వరుసగా పేర్చి, సాయంత్రం వేళల్లో రోజ్ క్యాన్‌ల సహాయంతో నీరు చిలకరిస్తుంటే, 30 రోజులకు చెరకు మొక్కలు 10 నుంచి 12 అంగుళాలు పెరుగుతాయి. వాటిని నేరుగా పొలంలో నాటుకోవచ్చు.

500 చెరకు గడల బరువు అరటన్ను కూడా వుండదు. కన్నులు కత్తిరించిన అనంతరం ఆ గడల బరువు సుమారుగా 100 నుంచి 150 కిలోలు తగ్గుతుంది. కన్నులు కత్తిరించగా మిగిలిన చెరకును మళ్లీ ఫ్యాక్టరీకి తరలించవచ్చు. ఒక ఎకరానికి అవసరమయ్యే చెరకు కన్నుల బరువు సుమారుగా 150 కిలోలు మాత్రమే. నాలుగు టన్నులు అవసరమైన విత్తనం, ఈ శ్రీ విధానం వల్ల 150 కిలోలకు తగ్గించబడింది. హేండ్ కట్టర్‌తో కన్నులు కత్తిరించి, ట్రేలలో కాయర్ పిట్ నింపి, ముచ్చెలను సర్ది పేర్చడానికి ఆరుగురు మహిళలు సరిపోతారు. సాయంత్రం పూట ఒక మనిషి రోజ్ క్యాన్‌లతో నీరు చల్లితే సరిపోతుంది. నెల రోజులకు పొలంలో నాటుకోవడానికి నారు సిద్ధమవుతుంది. ప్రస్తుత విధానానికి అవసరమైన విధంగా, నాల్గు అడుగుల బోదెల్లో నాటుకోవడానికి 120 ట్రేలలో పెంచిన నారు సరిపోతుంది. ఇందుకు వాడిన విత్తనం, కాయర్‌ఫుట్, కూలి ఖర్చులు మొత్తం రూ.4 వేల కన్నా తక్కువే. (కొన్నేళ్లపాటు వినియోగించుకొనే ట్రేలు, హెడ్‌నెట్‌ల ఖర్చు అదనం)


ట్రేలలో మొలకలు

నెలరోజులపాటు మొక్కలు హెచ్‌నెట్ కింద పెరగడానికి రోజుకు 80 నుంచి 100 లీటర్లు సరిపోతాయి. విత్తనం ముచ్చెలను పొలంలో నాటినప్పుడు కనీసం రెండుసార్లయినా నీరు పారించాలి. అలా పారించడానికి కూడా నీరు అందుబాటులో వుండటంలేదు. హెడ్‌నెట్ క్రింద మొక్కలు పెరిగే 30 రోజులు, చెరకు నాటాలనుకొన్న పొలంలో మరో పైరు పెంచుకొని, కొంత ఆదాయం తీయవచ్చు. మాగాణి భూముల్లో చెరకు సాగు చేయడానికి సిద్ధపడే రైతులకు ఈ శ్రీ విధానం ఎంతో లాభదాయకంగా వుంటుంది. మాగాణి భూముల్లో వరి కోతల అనంతరం ఎక్కువ విస్తీర్ణంలో చెరకు నాటడం ఆనవాయితీ. అలాంటప్పుడు రెండవ పంట అపరాలను వదులుకోవలసి వస్తుంది. సహజంగా జనవరిలో చెరకు నాట్లు ముమ్మరమౌతాయి. నవంబరులో వరికోతల అనంతరం భూమి ఆరి, దుక్కు చేసే సమయానికి జనవరి వచ్చేస్తుంది. అపరాలు పండించడానికి సమయం సరిపోదు. శ్రీ విధానంలో చెరకు సాగుచేయాలనుకొన్న రైతు వరి కోతల అనంతరం అపరాలు సాగుచేసుకోవచ్చు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అపరాల పంట చేతికొచ్చే సమయంలో, చెరకు మొక్కలు పెంచుకోవచ్చు. అపరాల పంట తీసుకొన్న తరువాత చెరకు నాటుకోవచ్చు. ఎకరానికి అయిదారు క్వింటాళ్లు అపరాల ఆదాయం పొందవచ్చు. నీరు పారించి, మూడు కళ్ల ముచ్చెలు నాటినపుడు, కొన్నిచోట్ల మొలక రాక పొలంలో కాళీలు ఏర్పడతాయి. అలాంటివి గుర్తించి, పదు పాదులు వేయడానికి కనీసం 30 రోజులు వ్యవధి అవసరం. ఈ మొక్కలు నాటినపుడు, ఎక్కడైనా మొక్క చనిపోతే నాలుగైదు రోజుల్లోనే, ఆ ప్రదేశంలో మొక్క పెట్టి, నీరు పోస్తే సరిపోతుంది. సాధారణ నాట్లకన్నా మొక్కలు నాటిన పొలంలో దిగుబడులు ఎక్కువగా వున్నట్టు రుజువైంది కూడా.

– దాసరి ఆళ్వారస్వామి, కుందేరు, కృష్ణాజిల్లా


విత్తన శుద్ధి

మొక్కజొన్న, జొన్న సాగులో

మెలకువలు



మొక్కజొన్న, జొన్న సాగుచేసే రైతులు మొవ్వ పురుగు విషయంలో అశ్రద్ధ వహిస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రైతులు మెలకువలను పాటిస్తూ ఎప్పటికప్పుడు చీడపీడల నివావారణకు చర్యలు తీసుకుంటే పంట దిగుబడులు ఆశించినమేరకు లభిస్తాయి. గత ఏడాది మినుము పంటకు వైరస్ తెలుగు ఆశించడంతో ఈ రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, జొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మొక్కజొన్న పంట అడుగునుంచి మూడు అడుగుల ఎత్తు పెరిగింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్న, జొన్నను మొవ్వ పురుగు ఆశించింది. పంటపై పురుగు ఉధ్రుతి ఎక్కువై నష్టం కలిగిస్తోంది. సకాలంలో పురుగు ఉధ్రుతి గుర్తించి, నివారణకు చర్యలు తీసుకుంటే సాగు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

రబీలో మినుము, పెసర పంటలతోపాటు మొక్కజొన్న, జొన్న పంటను జిల్లా రైతులు సాగుచేస్తున్నారు. డిసెంబరు ఆఖరు, జనవరి ఆఖరు వారాల్లో రైతులు విత్తులు నాటుకున్నారు. ప్రస్తుతం అడుగు ఎత్తు, మూడు అడుగుల ఎత్తుగల మొక్కలు పొలాల్లో ఉన్నాయి. విత్తన రకాలను సాగుకు ఎంచుకున్నారు. ప్రధానంగా 110 రోజుల నుంచి 120 రోజుల పంట కాలం గల రకాలను ఎంచుకుని సాగు చేపట్టారు.

మొవ్వ పురుగు తాకిడి

వాతావరణ పరిస్థితులు మొవ్వ పురుగు ఉధ్రుతికి కారణం అయ్యాయి. ఉదయం, రాత్రిళ్లు చలి వాతావరణం ఉంటోంది. పగలు ఉష్ణోగ్రతలు హెచ్చుగా, ఉమ్మతీతగా ఉంటున్నాయి. ఈ పరిస్థితులు మొవ్వ పురుగు ఉధ్రుతికి ఊతం అందిస్తున్నాయి. ప్రస్తుతం పొలాల్లో మొవ్వ పురుగు ఆశించిన లక్షణాలు కనిపిస్తున్నాయి.

పురుగు ఉధ్రుతిని గుర్తింపు ఇలా..

పైరును మొవ్వ పురుగు ఆశించినట్లు రైతులు సులభంగా గుర్తించవచ్చు. పురుగులు మొవ్వులో చేరి తినేస్తుంటాయి. దీంతో మొక్క ఆకులు క్రమేపీ పసుపు రంగుకు మారడం, ఎండిపోవడం జరుగుతుంది. మొవ్వ అడుగున పురుగు ఉండటాన్ని గుర్తించవచ్చు. పంటను మొవ్వ పురుగు ఆశించినట్లు నిర్ధారణకు రావాలి.

నిర్మూలన చర్యలు

మొక్కజొన్న, జొన్న పైర్లను అధికంగా నష్టపరిచే వాటిలో మొవ్వ పురుగు కూడా ఒకటి. మొక్కలు 15 రోజుల వయస్సులో ఉండగానే లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవాలి. 30 రోజులు దాటాక పురుగు ఉన్నట్లు నిర్ధారిస్తే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 6 కిలోలు మొక్కల మొవ్వులో పడే విధంగా వేసుకోవాలి. మొక్కకు కనీసం 3, 4 గుళికలు పడేలా చూడాలి. లేదా ఫోరేట్ 10 జీ గుళికలు ఎకరాకు 4 కిలోలు వాడాలి. ఇవి మొవ్వులో వేసుకోవాలి. అడుగులోపు మొక్క అయినట్లయితే కొరాజెన్ మందు 80 మిల్లీలీటర్లు పైరుపై పిచికారీ చేసుకోవడం ద్వారా పురుగును నివారించుకోవచ్చు. పిచికారీ చేయడం ద్వారా మొవ్వులో ఉన్న పురుగు చనిపోదు.

నీటి తడులు ముఖ్యం

మేలైన దిగుబడులు సాధించడంలో పంటకు నీటితడులు కూడా ముఖ్యం. పంట 15, 30, 45 రోజుల్లో ఉండగా నీటి తడులు ఇవ్వాలి. దీనివల్ల మొక్కల ఎదుగుదల, గింజ గట్టిపడే స్థితి మెరుగ్గా ఉంటుంది. నీటి తడులు విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఆశించిన దిగుబడులు సాధించడం సాధ్యం కాదు.





'దండుపాళ్యం 3' ఆడియో విడుదలకు సిద్ధం

వెంకట్ మూవీస్ పతాకంపై శ్రీనివాసరాజు దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత వెంకట్ నిర్మించిన దండుపాళ్యం పార్ట్ 1, 2 విడుదలై సక్సెస్ అయ్యాయి. తాజాగా 'దండుపాళ్యం 3' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా ఆడియో ఫంక్షన్ ఈ నెల 25న విడుదల కాబోతోంది. 'తెలుగు, కన్నడ భాషల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన 'దండుపాళ్యం' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోన్న 'దండుపాళ్యం 3' పై మంచి క్రేజ్ ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్ర షూటింగ్ దాదాపు 70% షూటింగ్‌ని పూర్తి చేసారు. ఈ చిత్రాన్ని తెలుగు , కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు చిత్ర యూనిట్. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ లభించింది.





మార్చిలో రానున్న 'తారామణి'

తమిళంలో విమర్శకుల ప్రశంసలందుకున్న చిత్రం 'తారామణి' తెలుగులో కూడా అదే పేరుతో రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదల కార్యక్రమాలన్నింటినీ పూర్తిచేసుకున్న ఈ చిత్రం మార్చి నెల మధ్యలో విడుదలయ్యే అవకాశాలున్నాయట. డి.వి.సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్స్ ఆకట్టుకుంటూ సినిమాలోని కంటెంట్ మహిళల స్వేచ్ఛ, మనో భావాలు వంటి అంశాలను ఎక్కువగా ప్రొజెక్ట్ చేసేలా ఉంటుందని సూచిస్తున్నాయి. ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో, అంజలి ఒక ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమాను రామ్ డైరెక్ట్ చేయగా యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందించారు.

బాలీవుడ్‌లో రెజీనా



తెలుగు, తమిళంలో హీరోయిన్‌గా తనదైన నటనతో ఆకట్టుకుంటోంది రెజీనా కసండ్ర. రీసెంట్‌గా విడుదలైన అ! చిత్రంలో కూడా విలక్షణమైన పాత్రలో నటించింది. ఇప్పుడు రెజీనా బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతోంది. గతంలో అమితాబ్, అనిల్ కపూర్‌ల అంఖే 2 సినిమాలో రెజీనా నటించాల్సింది కానీ ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. అయితే ఇప్పుడు మళ్లీ రెజీనా బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతోంది. షెల్లీ చోప్రా ధర్ దర్శకత్వంలో రూపొందనున్న ఏక్ లడ్‌కీకో దేఖాతో ఐసా లగా సినిమాలో రెజీనా కీలక పాత్రలో నటించనుంది. ఈ చిత్రంలో సోనమ్ కపూర్, రాజ్‌కుమార్, అనిల్ కపూర్, జూహీ చావ్లాలు నటిస్తున్నారు. వెస్టన్ లుక్‌లో ఉండే దక్షిణాది అమ్మాయి పాత్రలో రెజీనా నటించబోతుంది.


ఈ వారం సందడి చేయనున్న సినిమాలు

లాస్ట్ వీక్ రిలీజైన సినిమాల జోరు ఇంకా తగ్గనే లేదు. అప్పుడే కొత్త సినిమాలతో ఈ వీకెండ్ కూడా రెడీ అయిపోయింది. ఈ శుక్రవారం విడుదలయే సినిమాలలో హారర్‌తో పాటు యూత్‌ఫుల్ కంటెంట్‌తో బాక్సాఫీస్ బరిలోకి దిగడానికి రెడీగా ఉన్న సినిమాలివే...



స్కెచ్

విక్రమ్, తమన్నా జంటగా నటించిన సినిమా 'స్కెచ్'. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో ఇదే మొదటి సినిమా కాగా, తను రెగ్యులర్‌గా చేసే ప్రయోగాలకు భిన్నంగా కంప్లీట్ మాస్‌లుక్‌లో విక్రమ్ చేసిన సినిమా ఇది. తమిళ్‌లో ఇప్పటికే విడుదలైన ఈ సినిమా, ఇప్పుడు తెలుగులో విడుదలకు సిద్ధమైంది. విజయ్ చందర్ ఈ సినిమాకి దర్శకుడు. తమన్ సంగీతం అందించాడు.




జువ్వ

రంజిత్, పాలక్ లల్వానీ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం జువ్వ. గతంలో దిక్కులు చూడకు రామయ్య అనే సినిమాను డైరెక్ట్ చేసిన త్రికోటి ఈ సినిమాకు దర్శకుడు. కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమాకు ఎమ్.రత్నం, కథ-మాటలు సమకూర్చారు.

రా..రా

హారర్-కామెడీ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన సినిమా రా..రా. ఈ తరహా చిత్రంలో నటించడం హీరో శ్రీకాంత్‌కు ఇదే ఫస్ట్ టైం. సినిమాలో శ్రీకాంత్ సరసన నజియా హీరోయిన్‌గా నటించింది. మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమా ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు వి.జీ. చెరిష్ నిర్మించి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి రాప్ రాక్ షకీల్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు.






హైదరాబాద్ లవ్ స్టోరీ

రీసెంట్ గా హౌరా బ్రిడ్జ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన రాహుల్ రవీంద్రన్.. ఈసారి 'హైదరాబాద్ లవ్ స్టోరీ' అనే మరో మూవీని సిద్ధంచేశాడు. రేష్మి మీనన్, జియా హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమా యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. సునీల్ కశ్యప్ మ్యూజిక్ అందించిన ఈ సినిమాకి రాజ్ సత్య దర్శకత్వం వహించాడు.

ఈ సినిమాలతో పాటు చల్తే..చల్తే అనే మరో చిన్న సినిమా కూడా థియేటర్లలోకి వస్తోంది. వీటిలో ఎన్ని చిత్రాలు వీకెండ్ ఎట్రాక్షన్స్‌గా నిలుస్తాయో చూడాలి.



కుటుంబ కథా చిత్రంగా రవితేజ సినిమా

మాస్ మహారాజ రవితేజ ఇప్పుడు దర్శకుడు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. కళ్యాణ్ కృష్ణ గత సినిమాలు 'సోగ్గాడే చిన్ని నాయన, రారండోయ్ వేడుక చూద్దాం' తరహాలోనే ఈ చిత్రం కూడా పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రంగా ఉండనుంది. ఈ మధ్యే హైదరాబాద్లో షూట్ మొదలుపెట్టుకున్న ఈ సినిమా ఆ తరవాత వైజాగ్లో వారంపాటు ఒక షెడ్యూల్ జరుపుకుంది. ప్రస్తుతం హైదరాబాద్లోని ఒక స్టూడియోలో మూడవ షెడ్యూల్ జరుగుతోంది. ఈ షెడ్యూల్లో పూర్తిగా ఫ్యామిలీ సీన్స్ చిత్రీకరిస్తున్నారట. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్ర శాటిలైట్, డిజిటల్, డబ్బింగ్ హక్కులు కొద్దిరోజుల క్రితమే రూ.25 కోట్లకి అమ్ముడై హాట్ టాపిక్‌గా నిలిచాయి. ప్రియదర్శి, ప్రవీణ్ వంటి ప్రముఖ నటులు నటిస్తున్న ఈ సినిమాలో మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది.



హిరణ్యకశిపుడిగా రానా

రానా ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. పాత్ర నచ్చితే ఏ దర్శకుడితో అయినా సినిమా చెయ్యడానికి వెనుకాడని ఈ హీరో త్వరలో డైరెక్టర్ గుణశేఖర్‌తో సినిమా చెయ్యబోతున్నాడు. గుణశేఖర్ చెయ్యబోయే ఈ పౌరాణిక చిత్రంలో హిరణ్యకశిపుడిగా రానా నటించబోతున్నాడు. ఈ సినిమాకి 'హిరణ్యకశిపు' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రూ. 150 కోట్ల వరకు ఖర్చు కానుందట. ఇది 'భక్త ప్రహ్లాద' కథే అయినా హిరణ్యకశిపుడి కోణంలో కొనసాగుతుందని తెలుస్తోంది. 'రుద్రమదేవి' సినిమా తరువాత అదే తరహాలో భారీగా తెరకెక్కబోతున్న ఈ సినిమా ఆగస్టు నుండి ప్రారంభంకానుంది. గుణ టీం వర్క్స్ బ్యానర్లో గుణశేఖర్ ఈ సినిమాను స్వయంగా నిర్మించబోతున్నాడు. ప్రీ ప్రొడక్షన్ స్టేజ్‌లో ఉన్న ఈ సినిమాలో తెలుగు, తమిళ, హిందీ పరిశ్రమకు చెందిన నటీనటులు నటించబోతున్నారు.

హిజ్రాగా 'భాగమతి' హీరో..



'జనతాగ్యారేజ్, భాగమతి' చిత్రాలతో తెలుగులోనూ తనకంటూ ఓ గుర్తింపుని సంపాదించుకున్న మలయాళ హీరో ఉన్ని ముకుందన్. అయితే ఈ రెండు సినిమాలలో మంచి పాత్రలు పడినప్పటికీ.. ఆ సినిమాలకున్న స్టార్ ఇమేజ్ ముందు ఈ హీరోకి పెద్దగా పేరు దక్కలేదు. అయితే మలయాళంలో మాత్రం ఉన్ని ముకుందన్‌కి మంచి పేరే ఉంది. తాజాగా మలయాళంలో ఉన్ని ముకుందన్ చేస్తున్న 'చాణక్య తంత్రం' అనే చిత్రం హాట్ టాపిక్‌గా మారింది. ఎందుకంటే ఈ సినిమాలో ఉన్ని ముకుందన్ హిజ్రా తరహా పాత్రలో కనిపించబోతున్నాడు. కరిష్మా అనే పేరుతో ఈ సినిమాలో కనిపించనున్న ఉన్ని పోస్టర్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. హిజ్రా అనగానే ఏదో మేకప్ వేసుకుని కనిపించడమే అనుకుంటే పొరబాటే. ఈ పాత్ర కోసం ఉన్ని ప్రత్యేకంగా ప్రొస్తేటిక్స్ కూడా వాడాడట. మరి ఈ ప్రత్యేకమైన పాత్రలో ఉన్ని ఎలా ఆకట్టుకుంటాడో తెలియాలంటే ఇంకొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

12 వారాల్లో రూ.6.20 కోట్లు చెల్లించండి

రజనీకాంత్ భార్యకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : ప్రముఖ నటుడు రజనీకాంత్ భార్య, లత రూ. 6.20 కోట్లను 12 నెలల్లో ఒస్‌గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు చెల్లించాలని సుప్రీంకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. లత డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఈ సంస్థ నుంచి 2014లో రూపొం దించిన 'కొచ్చియాడియాన్' సినిమా కోసం రూ.10 కోట్లు అప్పుతీసుకున్నారు. తమిళనాడు డిస్ట్రిబ్యూషన్ హక్కులను తమకు కేటాయిస్తామని అప్పుతీసుకున్న లత, ఆ చిత్ర నిర్మాత డాక్టర్. మురళీమనోహర్ మోసం చేశారని సంస్థ కేసు దాఖలు చేసింది. కొచ్చియాడియాన్ దర్శకురాలిగా రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ అశ్విన్ ఉన్నారు. సినిమాకు సంబంధించి కాంట్రాక్టును తెలివిగా తప్పించి, వైట్‌కాలర్ నేరానికి పాల్పడ్డారని సంస్థ సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయగా, కోర్టు పై విధంగా తీర్పు వెలువరించింది.

నేను ముస్లింని.. నాభర్తతోనే ఉంటా

సుప్రీంకోర్టులో హదియా



సేలం : హిందూ కుటుంబంలో జన్మించి, స్నేహితురాలి ద్వారా ఇస్లాంలోకి మారి ముస్లిం యువ కుడిని వివాహమాడిన హదియా 'నేను ముస్లింని, నాభర్త షఫీన్ జాహన్‌తోనే ఉంటానని' మంగళవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. హిందూ మతం నుంచి దూరం కావడం ఇష్టంలేని ఆమె కుటుంబం ఆమెను బంధించినా భర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో ఆమె అక్కడి నుంచి బయటపడి తన చదువును కొనసాగిస్తోంది. హిందూవాద సంస్థలన్నీ ఇది 'లవ్ జీహాద్' గా ప్రకటించిన విషయం తెలిసిందే. మేజరైన మహిళకు జీవితాన్ని నిర్ణయించుకునే హక్కుందని జనవరిలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

కుంభకోణంపై సిట్ దర్యాప్తు



సుప్రీంలో రెండు పిటిషన్లు

23న విచారించనున్న అత్యున్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) భారీ కుంభకోణంలో నిందితుడైన నీరవ్ మోడీని భారత్ రప్పించేందుకు చర్యలు ప్రారంభించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం విదేశాల్లో ఉన్న నీరవ్, ఇతరులను రెండు నెలల్లోగా భారత్ రప్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కుంభకోణంపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నెల 23న (శుక్రవారం) విచారించేందుకు సర్వోత్తమ న్యాయస్థానం అంగీకరించింది. ఈ రెండు పిటిషన్లలో ఒకటి మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్‌విలాకర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌పై 23న విచారణ జరపనున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులను ఈ కేసులో పార్టీలుగా పేర్కొంది. నీరవ్ మోడీని వీలైనంత త్వరగా భారత్ రప్పించడానికి గల అన్ని చర్యలను తీసుకోవడంపై కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని, డబ్బు రికవర్ చేయడానికి చర్యలు వేగవంతం చేయాలని పిటిషన్‌లో కోరారు. అలాగే అవినీతికి పాల్పడిన పీఎన్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, రుణాల మంజూరుకు కొత్త మార్గదర్శకాలు నిర్దేశించాలని, నిబంధనలు బాగా కఠినతరం చేయాలని కోరారు. రూ.500కోట్లు, అంతకు పైగా రుణం తీసుకునే వారి వివరాలను, రుణాలు చెల్లించని వారి జాబితాను ప్రభుత్వం అందజేయాలని అభ్యర్థించారు

న్యాయవాది జేపీ ధండా ద్వారా పిటిషనర్ వినీత్ దండా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ని దాఖలు చేశారు. బ్యాంకులో జరిగిన అవినీతిపై దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని ఆ పిల్‌లో కోరారు. ఈ కుంభకోణంలో బిలీనియర్, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పీఎన్‌బీ ఉన్నతస్థాయి యాజమాన్యం పాత్రపై కూడా దర్యాప్తు జరపాలని ఆ పిల్ కోరింది. మరో పిల్‌ను న్యాయవాది ఎమ్మెల్ శర్మ దాఖలు చేశారు. అత్యున్నత న్యాయస్థానం రిటైర్డ్ న్యాయమూర్తులతో కూడిన సిట్‌ని ఏర్పాటు చేయాలని ఆ పిల్‌లో కోరారు. బ్యాంకులో జరిగిన భారీ అవినీతి కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు ప్రభుత్వ ఖజానాకు తీవ్రనష్టం వాటిల్లిందని ఆ పిల్‌లో పేర్కొన్నారు. "రాజకీయ నాయకులు/అధికారుల నియంత్రణ లోని" ఏజెన్సీతో కాకుండా సిట్‌తో ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపించాలని కోరారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఆర్థిక నిబంధనలు, నియంత్రణా వ్యవస్థలను ఏమాత్రం ఖాతరు చేయకుండా రుణాలు ఇచ్చారని ఆ పిల్‌లో పేర్కొన్నారు.

రూ. 10 కోట్లు ఆ పైన మొత్తానికి మంజూరు చేసే రుణాల భద్రత, తిరిగి వసూళ్లు అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను రూపొందించాలని ఆ పిల్‌లో ధండా కోరారు. దేశంలో పారుబకాయిల కేసులు వివరంగా కనుగొనేందుకు నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. పేద రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. మరోవైపు మాల్యా, నీరవ్ లాంటి వారు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు చెక్కేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. సామాన్య ప్రజల హక్కులను కాపాడేందుకు సుప్రీంకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. రుణాలు చెల్లించకపోతే బ్యాంకు అధికారులు పేద రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలు, రైతులు డబ్బు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న అనేక ఘటనలను పిటిషన్‌లో ప్రస్తావించారు. మరో వైపు నీరవ్ మోడీ, ఆయన మామ ఛోక్సీలు భారీ మోసాలకు పాల్పడి ఎంచక్కా కుటుంబంతో సహా సులువుగా విదేశాలకు పారిపోగలిగారని పేర్కొన్నారు. పీఎన్‌బీ భారీ కుంభకోణంలో రిజర్వు బ్యాంకు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఇలాంటి భారీ కుంభకోణాల ప్రభావం తిరిగి ప్రజలపైనే పడుతుందని.. వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అధిక పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు.

కమల్ పార్టీ ప్రకటన నేడు

హాజరుకానున్న కేజ్రీవాల్



చెన్నై : ప్రముఖ నటుడు కమల్‌హాసన్ తన రాజకీయ పార్టీపేరును మధురైలో బుధవారం సాయంత్రం ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హాజరవుతారని కమల్ వర్గాలు తెలిపాయి. కమల్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు సమయంలో (2017 సెప్టెంబరులో) కేజ్రీవాల్ ఆయనతో మంతనాలు జరిపి వెళ్లారు. ప్రస్తుతం భారత దేశం మతతత్వం, అవినీతిని తీవ్రంగా ఎదుర్కొంటోందని, భావ సారూప్యం గలవారంతా ఒక్కటిగా కలసి పనిచేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమంగా లేదని విలేకరులకు తెలియచేస్తూ, అధికార ఏఐఏడీఎంకే పార్టీలో ఎవరినీ కలిసే ఉద్దేశ్యం తనకు లేదని కమల్ స్పష్టం చేశారు.నటుడు- దర్శకుడు-తమిళ సంస్థ నావమ్ తమిజర్ కచ్చి వ్యవస్థాపకుడు సీమన్ మాట్లాడుతూ కమల్ రాజకీయాల్లో పైకిరావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నూతన రాజకీయ పార్టీతో రాష్ట్రంలో కొత్తశకం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారని, మా ఇద్దరి సుదూర ప్రయాణం బుధవారం నుంచి మొదలవుతుందన్నారు. మదురైలోని ఒత్తకొడాయ్ మైదానంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు పార్టీ జెండాను ఎగురవేయబోతున్నానని ఆయన ట్వీట్ చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దక్షిణాది రాష్ట్రా లన్నీ ఏకం కావాలని జనవరిలో కమల్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ప్రధాన రాజకీయ నేతలు, డీఎండీకే అధినేత విజయ్‌కాంత్ ఆశీర్వాదాలు తీసుకున్న ఆయన ప్రముఖ శాస్త్రవేత్త, మాజీరాష్ట్రపతి,ఏపీజే కలాం (రామేశ్వరంలోని) ఇంటి నుంచి రాష్ట్ర పర్యటన చేపట్టనున్నారు.

గాంధీజీ హత్య వెనుక కుట్ర ..?

ఇందుకు సంబంధించి అమెరికా నుంచి తెచ్చిన ఆధారాలు

సీల్డు కవరును సుప్రీం ముందుంచిన పిటిషనర్



ఢిల్లీ: "జాతిపిత మహాత్మాగాంధీ హత్య వెనుక పెద్ద కుట్రే జరిగింది. ఇందుకు సంబంధించి అమెరికా నుంచి నేను తెచ్చిన ఆధారాలను పరిశీలించండి" అని- గాంధీ హత్యపై పునఃవిచారణ కోరుతూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టును పిటిషనర్ అభ్యర్థించారు. ముంబయికి చెందిన 'అభినవ్ భారత్' సంస్థ ధర్మకర్తృత్వ మండలి సభ్యుడు డా.పంకజ్ ఫడనీస్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావుల ధర్మాసనం సోమవారం దీనిపై విచారణ చేపట్టింది. "అమెరికా నుంచి తిరిగివస్తూ అక్కడి లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ నుంచి కొన్ని పత్రాలను తీసుకొచ్చాను. వీటిని బట్టి జాతిపిత హత్య వెనుక భారీ కుట్ర జరిగినట్లు అవగతమవుతోంది. అయితే కీలకమైన ఈ పత్రాలను భారత ప్రభుత్వం గతంలో నిషేధించింది. ఈ కేసులో న్యాయవైజ్ఞానిక ఆధారాలను పొందొచ్చని అమెరికాకు చెందిన అటార్నీ ఒకరు సూచిస్తూ రాసిన లేఖను కూడా చూడండి" అని ఫడనీస్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ లేఖను పరిశీలించిన ధర్మాసనం- ఇందులోని అంశాలు ఆసక్తికరంగా ఉన్నాయనీ, సాంకేతికత అభివృద్ధి చెందినందున ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ సాధ్యమవుతుందని పేర్కొంది. కేసును పునర్విచారించే విషయాన్ని తర్వాత నిర్ణయిస్తామంది. పిటిషనర్ సీల్డు కవరులో ఆధారాలను సమర్పిస్తూ- వీటిని భారత ప్రభుత్వం గతంలో నిషేధించిందనీ, దానిని ఎత్తివేయాలని కోరుతూ ముంబయి కోర్టును ఆశ్రయించి నట్లు పేర్కొన్నారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ... వీటిని దరఖాస్తుకు జోడిస్తూ సమర్పించాలని ఆయనకు సూచిం చింది. మీరు కోర్టుకు ఏదైనా సమర్పించ దలిస్తే- వీటిని ఇంతకు ముందు ఎందుకు సమర్పించలేదో; మీ కేసుకు సంబంధించి వీటిలో ఏమేం ప్రాధాన్యాంశా లున్నాయో తమకు విస్పష్టం చేయాలంది. 'ఈ దస్త్రాల సీలును తెరిస్తే... నిషేధిత పత్రాలను తెరచి నేరం చేసిన వాడనవుతానేమో' అని పిటిషనర్ సందేహం వ్యక్తంచేశారు. దరఖాస్తుతో పాటు ఆ డాక్యుమెంట్లను తమకు సమర్పిం చాలని ధర్మాసనం ఆయనను ఆదేశిస్తూ విచారణను మార్చి 6కు వాయిదా వేసింది.

మ్యాన్‌హోల్స్‌ను శుభ్రపరిచే రోబోలు!

తిరువనంతపురం: దేశంలో తొలిసారిగా మానవరహిత పారిశుద్ధ్య నిర్వహణకు కేరళ నడుం బిగించింది. మ్యాన్‌హోల్స్‌ను శుభ్ర పరిచేం దుకు రోబోటిక్ టెక్నాలజీని వినియోగించుకోను న్నది. అందుకోసం ప్రత్యేకంగా రూపొందిం చిన రోబోలను త్వరలోనే రోడ్లపైకి పంపనున్నారు. జెన్‌రోబోటిక్స్ అనే స్టార్టప్ కంపెనీ రూపొందించిన బండికూట్ (పందికొక్కు) అనే రోబోలను గతవారం ప్రయోగాత్మకంగా పరిశీలించి చూశారు. రోబోలతో పారిశుద్ధ్య నిర్వహణపై కేరళ ప్రభుత్వం ఉత్సాహం చూపుతున్నదని, త్వరలోనే ఈ రోబోలను ప్రారంభించనున్నామని కేరళ వాటర్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ షైనమోల్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. తొమ్మిదిమంది ఇంజి నీరింగ్ విద్యార్థులతో కూడిన స్టార్టప్ కంపెనీ ఈ రోబోను రూపొందించింది. వైఫై, బ్లూటూత్ సౌకర్యం, కంట్రోల్ ప్యానల్‌తోపాటు నాలుగు కాళ్లు కలిగి ఉండే ఈ రోబో సాలెపురుగులా ఉంటుంది. దీనికి ఓ బకెట్ కూడా తగిలించి ఉంటుంది. మ్యాన్‌హోల్ లోకి వెళ్లే ఈ రోబో వైఫై, బ్లూటూత్ ద్వారా అందే ఆదేశాలకు అనుగుణంగా బకెట్‌తో మురికిని నింపి బయటకు తీసుకు వస్తుంది. మ్యాన్‌హోళ్లలో దిగి ప్రాణాలుకోల్పోయిన పారిశుద్ధ్య కార్మికుల గురించి తెలుసుకున్నాకే మేం ఈ స్థితిని మార్చాలనుకున్నాం. కార్మికులతోనూ ప్రత్యక్షంగా మాట్లాడాం. కేవలం రూ.300 నుంచి రూ.500 కోసం వాళ్లు గంటలతరబడి మురికిలో మునిగి పోవడం ఎంతో బాధ కలిగించింది. మానవరహితంగా దీన్ని నిర్వహిం చేందుకు వీలుగా.. ఏడెనిమిది నెలల ప్రయత్నం తర్వాత రోబోను రూపొందించాం అని జెన్‌రో బోటిక్స్ సీఈవో విమల్ గోవింద్ వెల్లడించారు. ఇటీవలి ట్రయల్ రన్‌లో రోబో 30కిలోల మురికిని వెలికితీసిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ రోబో ఇంగ్లిష్‌లోనే ఆదేశాలను స్వీక రిస్తుందని, పారిశుద్ధ్య కార్మికులు ఉపయోగిం చేందుకు వీలుగా స్థానిక భాషలో ఆదేశాలు అందుకునేలా ప్రయత్ని స్తున్నామని విమల్ గోవింద్ తెలిపారు. ఐదువేలకు పైగా మ్యాన్‌హోళ్లున్న తిరువనంతపురంలో మార్చి 2నుంచి ఈ రోబోలు సందడి చేయన్నాయి.

మహిళా రైల్వే స్టేషన్



జయపుర: మహిళా ప్రయాణికుల భద్రతపై దృష్టిసారిస్తూ రాజస్థాన్‌లోని గాంధీనగర్ రైల్వే స్టేషన్‌లో భారతీయ రైల్వే శాఖ అందరినీ మహిళా ఉద్యోగులనే ఎంపికచేసింది. టీసీ, ఆర్‌పీఎఫ్, రిజర్వేషన్ అండ్ బుకింగ్ సూపర్‌వైజర్స్..ఇలా ఈ స్టేషన్‌లో 28 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారని రైల్వే ప్రతినిధి తరుణ్ జైన్ తెలిపారు. భారతదేశంలో మొత్తం మహిళా ఉద్యోగులే ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ ఇదే కావడం విశేషం. ఈ రైల్వే స్టేషన్ మీదుగా జయపుర-ఢిల్లీ వంటి ప్రధాన రైలు మార్గాలు అనుసంధానమై ఉన్నాయి. రోజూ ఈ స్టేషన్ మీదుగా 50 రైళ్లు వెళుతుంటాయి. వీటిలో 25 రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగుతాయి. రోజు దాదాపు 7000 మంది ప్రయాణిస్తుంటారు. ఈ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళలు ఉన్నత శిక్షణ పొందారు. అంతేకాదు మహిళల సౌకర్యార్థం స్టేషన్‌లో సీసీటీవీలు, శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషిన్లు ఏర్పాటుచేశారు. ఈ తరహా రైల్వేస్టేషన్లను ఇతర ప్రదేశాల్లోనూ ఏర్పాటుచేసేందుకు భారతీయ రైల్వే శాఖ యోచిస్తోంది.



మృగాళ్ల పైశాచికత్వం

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో మృగాళ్ల పైశాచికత్వం వెలుగులోకి వచ్చింది. మహిళను రేప్ చేసి ఆమె మానంలో ఇనుపరాడ్ ఉంచిన ఘటన 2012 డిసెంబరు 16 నాటి నిర్భయ కేసును గుర్తుకు తెచ్చింది. మతిస్థిమితం లేని 21 ఏళ్ల గిరిజన యువతిపై అత్యాచారం జరిపి రాక్షసత్వంగా ప్రవర్తించడంతో తీవ్ర విషమ పరిస్థితుల్లో ఆమెను ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కుష్‌మండీలోని సంతకు వెళ్లి తిరిగి వస్తుండగా, కొందరు ఆమెను బలవంతంగా నిర్జన ప్రదేశానికి తీసుకొని వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె ఏడుపులు విన్న స్థానికులు ఆమెను ఆసుపత్రికి తీసుకు వెళ్లగా డాక్టర్లు ఆమెకు అత్యవసర శస్త్రచికిత్స చేశారన్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మాల్డా వైద్యకళాశాలకు తరలించారు. దీంతో ఆప్రాంత వాసులంతా ఆందోళన నిర్వహించి దోషులను పట్టుకోవాలని డిమాండు చేశారు. ఆమె ఆపస్మారక స్థితిలో ఉంద ని, శరీరంలోని గాయాల కోసం మళ్లీ ఆపరేషన్ నిర్వహించనున్నారు. గైనకాలజిస్టులు, సర్జన్ల బృందాన్ని ఇందుకు సిద్ధంగా ఉంచామని మాల్డా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

పీఎన్‌బీ అక్రమాల్లో జోక్యం చేసుకోవాలి

ఉన్నతస్థాయి యాజమాన్యం, అధికారులను దూరంపెట్టాలి

ప్రభుత్వానికి ఏఐబీఈఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న అవకతవకల కేసులో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, దర్యాప్తు పూర్తి అయ్యేవరకు ఉన్నతస్థాయి యాజమాన్యం, అధికారులను దూరం పెట్టాలని, జవాబు దారీతనాన్ని నిర్ధారించాలని ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) డిమాండు చేసింది. ఈ మేరకుతీవ్ర పదజాలంతో రాసిన లేఖను ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం సోమవారం పత్రికలకు విడుదల చేశారు. వ్యాపారవేత్త నీరవ్ మోడీ పీఎన్‌బీకి రూ 11,400 కోట్ల మేర ఎగనామం పెట్టడం వెనుక కేవలం దిగువ స్థాయి అధికారుల పాత్ర మాత్రమే ఉన్నదనే అభిప్రాయం కలుగజేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. "ఉన్నత స్థాయిలో ఉన్న అధికారుల పాత్ర లేకుండా దిగువ స్థాయి అధికారుల పాత్ర ఎలా ఉంటుంది. దిగువ స్థాయిలో ఉండి తప్పుచేసిన వారిని మేము సమర్థించడంలేదు. తొందరపాటుతో హడావిడిగా అ విధంగా సస్పెన్షన్‌లు ఎందుకు చేయాల్సి వచ్చింది. ఆ విధంగా చేయడం తప్పంతా దిగువ స్థాయి అధికారులు, సిబ్బందిదేనన్న అభిప్రాయం కలిగించే విధంగా ఉన్నది" అని ఆ లేఖలో ఏఐబీఈఏ పేర్కొంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సముచితంగా ఉంటుంది. యావత్తు యాజమాన్యాన్ని, ఉన్నతాధికారులను దర్యాప్తు పూర్తి అయ్యే వరకు బ్యాంకు కార్యకలాపాలకు దూరంగా వుంచాలి. జవాబుదారీతనం నిర్ధారించాలి అని ఆ లేఖ పేర్కొన్నది. జరిగిన అక్రమం తీవ్రతను తగ్గించి చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఏదో ఒక బ్యాంకు, ఒక బ్రాంచ్ ఇద్దరు ఉద్యోగులు అక్రమానికి పాల్పడినట్టుగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంత పెద్దఎత్తున అక్రమాలు ఆషామాషిగా జరిగేవి కావని, ఏ ఉన్నతాధికారికి తెలియకుండా కేవలం బ్రాంచ్ అధికారులు మాత్రమే రూ. 11,400 కోట్లకు ఆరు లేదా ఏడు సంవత్సరాలకు ఎల్‌ఓయూలను ఇవ్వలేరని వెంకటా చలం తెలిపారు. "బ్రాంచ్ అధికారులు తీవ్రమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొ న్నారనడంలో ఎటువంటి అనుమానం లేదు. దీనివెనుక బడా అధికారులు ఎవరూ లేరంటే నమ్మేంత అమాయకులు ఎవరూలేరు. ఈ ఎల్‌ఓయూలకు అనుకూలంగా ఎవరూ ఇచ్చారనేది కనీసం నీరవ్ మోడీకి అయినా తెలియకుండా వుండదు" అని వెంకటాచలం ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ అక్రమాలు సాంకేతికపరమైన అంశాలు, పర్యవేక్షణ, పరిశీలన, ఆడిట్, అంతర్గత నియంత్రణతో పాటు మొత్తం వ్యవహారంలో ఆర్‌బీఐ పాత్రపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని ఏఐబీఈఏ తెలిపింది. బ్యాంకులలో ఎప్పటికప్పుడు ఆడిట్ చేసే ఆర్‌బీఐ అక్రమాల వాసనను ఎందుకు పసిగట్టలేకపోయిందని ప్రశ్నిం చింది. అనేక సంవత్సరాలుగా జరుగుతున్నా, పెద్ద మొత్తంలో నగదు ఇమిడివున్నప్పటికీ ఆర్బీఐ ఎందుకు కనుగొనలేక పోయిందని ప్రశ్నించింది. బ్యాంకింగ్ రంగాన్ని బలహీనపరచ కుండా నియంత్రించడంలో ఆర్బీఐ విఫలమైందని స్పష్టమౌ తోందని పేర్కొన్నది. ప్రభుత్వం ఎందుకు మౌనంగా వుంటోంది? అపరాధ ఉద్యోగి సహాయంతో రూ. 11000 కోట్ల మేర అక్రమాలకు పాల్పడితే కనుక్కోకుండా ఏమి చేస్తోంది? "బ్యాంకింగ్ రంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆర్‌బీఐ అంగీకరించాలికదా. క్రమబద్ధీకరించటంలో ఆర్బీఐ అసమర్థత, నిర్లక్ష్యం దేశాన్ని ప్రమాదంలో పడేస్తోంది" అని ఏఐబీఈఏ పేర్కొంది. కొంతమంది అధికారులను ఏళ్ల తరబడి అదే బ్రాంచ్‌లో, అదే విభాగంలో కొనసాగించడాన్ని కూడా ఏఐబీఈఏ ప్రశ్నించింది.

పీఎన్‌బీ మోసంపై చర్చించండి : కాంగ్రెస్, సీపీఎం

కోల్‌కతా : ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన మోసంపై చర్చించాలని ప్రతిపక్ష కాంగ్రెస్, సీపీఎం మంగళవారం డిమాండు చేశాయి. దీనికి ప్రభుత్వం అంగీకరించేలోపు కాంగ్రెస్, సీపీఎం ప్రభుత్వ చర్యను నిరసిస్తూ వాకౌట్ చేశాయి. 'ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసంపై చర్చించమని కోరాం. దీనిపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదనుకుంటున్నాం. దీనిపై త్వరలోనే తీర్మానాన్ని ప్రవేశపెడతాం' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అబ్దుల్ మన్నన్ తెలిపారు.

కేరళలో బస్సు ఆపరేటర్ల సమ్మె విరమణ

తిరువనంతపురం : ప్రైవేటు బస్సు ఆపరేటర్ల సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో బస్సు ఆపరేటర్లు సమ్మెను విరమించారు. చార్జీల పెంపు తదితరాలపై ఈమేరకు ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఫిబ్రవరి 16 నుంచి ప్రైవేటు బస్సు ఆపరేటర్లు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ నేతలు ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌తో జరిపిన చర్చలు ఫలించడంతో ఈమేరకు విరమణ నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్చల్లో రవాణా శాఖమంత్రి ఏకే శశీంద్రన్ కూడా పాల్గొన్నారు.

జమ్మూ కాశ్మీరులో భూకంపం

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీరులో మంగళవారం ఉదయం భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై 3.3 తీవ్రత చూపినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ విషయాన్ని జమ్మూ కాశ్మీరులోని భూకంపకేంద్రం తెలిపినట్లు పేర్కొన్నారు. 'అర్ధరాత్రి 12.41 ప్రాంతాల్లో భూమి కంపించింది. సుమారు ఐదు కిలోమీటర్ల మేర దీనిని తీవ్రత కనబడింది' అని భూకంపకేంద్రం అధికారులు వివరించారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం కానీ, ఆస్తి నష్టం కానీ సంభవించలేదని తెలిపారు.

పుదుచ్చేరి బంద్.. ప్రజాజీవనం అస్తవ్యస్తం

పుదుచ్చేరి : చెత్తపై పన్ను, వాణిజ్య, వ్యాపార సంస్థలపై విధించిన పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ పుదుచ్చేరి వ్యాపారుల ఫెడరేషన్ చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ మేరకు పుదుచ్చేరిలో వ్యాపార సంస్థలు మూతబడ్డాయి. ఎప్పుడూ కళకళలాడే సెంటర్లు ఎడారిని తలపించాయి. బంద్‌కు సినిమా హాళ్లు కూడా సహకరించడంతో వాటిని కూడా మూసివేశారు. వ్యాపారులను, వ్యాపారవేత్తలను సంప్రదించకుండా పన్ను విధించడం దారుణమని ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ బలోవు తెలిపారు.

తక్షణమే నివేదిక అందజేయండి : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద ఇద్దరు ఎమ్మెల్యేలపై చేయిచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాష్ తక్షణమే దీనిపై నివేదిక అందజేయాలని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించారు. 'ఈ ఘటనలో చీఫ్ సెక్రటరీ ప్రమేయంపై నేను చింతిస్తున్నాను. ఐఏఎస్‌లు పనిలో హుందాగా ఉంటూ, భయం లేకుండా పనిచేయాలి' అని పేర్కొన్నారు. 'కీలకమైన సేవలను ప్రజలకు అందుబాటులో తెచ్చే నిమిత్తం జరిగిన చర్చల్లో ముఖ్యమంత్రి ఎదుటే నాపై దాడి జరిగింది' సీఎస్ అన్షు తెలిపారు.

రెండోరోజుకు చేరిన జూనియర్ డాక్టర్ల సమ్మె

కటక్ : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ డాక్టర్లు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది. తమను వేధిస్తున్న సీనియర్ ప్రొఫెసర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. 'ఇలాంటి చర్యలను మేం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదు. తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలి' అని జూడాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర స్వెయిన్ డిమాండు చేశారు. తక్షణమే ప్రొఫెసర్‌ను కఠినంగా శిక్షించాలని, విధుల నుంచి తొలగించాలని డిమాండు చేశారు.

ఎన్‌ఆర్సీ ప్రచురణ గడువు పొడిగింపునకు సుప్రీం నో

న్యూఢిల్లీ : అసోంలోని పౌరుల జాతీయ రిజిస్టర్ (ఎన్‌ఆర్సీ) ప్రచురణ గడువును పొడిగించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించలేదు. తక్షణమే ఈ పనిని మే 31లోగా ముగించాలని కేంద్రాన్ని ఆదేశించింది. రాష్ట్రంలోని సుమారు కోటిమంది ప్రజల తనిఖీ సర్వేకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరింది. 30 రోజుల తరువాత పనిలోని పురోగతిని సమీక్షిస్తామని జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. దీనిపై అటార్నీ జనరల్ వేణుగోపాల్ మాట్లాడుతూ మే31లోగా ఈపని చేయలేరని ధర్మాసనానికి తెలిపారు.

ప్రియా ప్రకాష్ వారియర్ పిటిషన్‌పై నేడు విచారణ

న్యూఢిల్లీ : ప్రముఖ మలయాళీ హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు బుధవారం విచారణ చేపట్టనున్నది. ఓ మలయాళ చిత్రంలోని పాటలో కన్నుగీటడం ఇంటర్‌నెట్‌లో సెన్సేషన్‌గా మారింది. దీనిపై కేసు నమోదు అవడంతో తనపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ప్రియ సుప్రీం మెట్లు ఎక్కింది. దీనికి సుప్రీం అంగీకరించింది. బుధవారం నటి లాయర్ హారిస్ బీరన్ దీనికి సంబంధించిన పిటిషన్‌పై వాదనలు వినిపిస్తారు.

దేశంలోనే ప్రశాంతమైన రాష్ట్రం తమిళనాడు : సీఎం

కొయంబత్తూర్ : దేశంలోనే ప్రశాంతమైన రాష్ట్రం తమిళనాడు అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళని స్వామి స్పష్టం చేశారు. తమిళనాడు రాష్ట్రం ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని, వారికి ట్రైనింగ్ సెంటర్ అయిందన్న కేంద్రమంత్రి పొన్ రాధాకృష్ణన్ వ్యాఖ్యలను పళని ఖండించారు. కొద్దిరోజుల క్రితం కేంద్రమంత్రి రాధాకృష్ణన్ మాట్లాడుతూ 'తమిళనాడులో శాంతి కరవైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నక్సలైట్లు, మావోయిస్టులు, తమిళనాడు ఉగ్రవాదులు చేతులు కలిపారు. దీనికి నిదర్శనమే జల్లికట్టుపై రాష్ట్రంలో జరిగిన ఆందోళన' అని పేర్కొన్నారు.

'తొలగింపు'పై తక్షణమే స్పందించండి

న్యూఢిల్లీ : ఇద్దరు ఎలక్షన్ కమిషనర్‌లను తొలగించాల్సి వచ్చినప్పుడు వారితో పాటు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను కూడా తొలగించాలా లేదా అన్న విషయంపై తక్షణమే స్పందించాలని సుప్రీం కేంద్రాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీనిపై నాలుగు వారాల గడువు మంజూరుచేస్తూ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎఎం ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి, న్యాయవాది అయిన అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్

జమ్ము : బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి (బీడీఓ)తో సహా నలుగురు ఉద్యోగులను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని జమ్ముకాశ్మీర్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అబ్దుల్ హక్ ఖాన్ జరిపిన ఆకస్మిక తనిఖీల్లో బీడీఓ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, డ్రాఫ్ట్‌మేన్ విధులకు హాజరు కానందున వారిపై సస్పెండ్ చేశామన్నారు. వారి నుంచి సంజాయిషీ తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. విధుల్లో అలసత్వాన్ని ప్రభుత్వం సహించబోదని ఖాన్ స్పష్టం చేశారు.

హత్యకేసులో దోషికి జీవితశిక్ష

ముజఫర్ నగర్ : పాలమ్ముకునే అన్వర్‌ను కాల్చిచంపిన కేసులో దోషికి జీవితకాల శిక్ష రూ. 50 వేల అపరాధరుసుం విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. దీనిలో సగం బాధిత కుటుంబానికి ఇవ్వాలని పేర్కొంది. దోషి షాపులో పాలు పోయనందుకు వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగి కాల్చివేతకు గురయ్యాడని ప్రాసిక్యూషన్ లాయర్ జితేంద్ర త్యాగి వెల్లడించారు. ఈ ఘటన 2004 అక్టోబర్ 4న జరిగిందన్నారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 302 ప్రకారం దోషికి జీవితకాల శిక్ష విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి గౌరవ్ శ్రీవాత్సవ తీర్పు వెలువరించారు.

పెట్రోలు బాటిల్‌తో ఎమ్మెల్యే హల్‌చల్

బెంగళూరు : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కొత్త చిక్కుల్లో పడింది. ఇటీవల ఓ ఎమ్మెల్యే సంచలనం సృష్టించగా, ప్రస్తుతం మరో ఎమ్మెల్యే వివాదం రేపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నారాయణస్వామి పెట్రోల్ బాటిల్‌తో ప్రభుత్వ కార్యాలయంలో రెచ్చిపోయారు. కార్యాలయం గోడలపై పెట్రోల్ చల్లుతూ అధికారిని హెచ్చరించారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికకు చెందిన కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. పెట్రోల్ తీసుకొచ్చి చల్లుతూ బెదిరింపులకు పాల్పడుతుండగా ఎవరో వీడియో తీశారు.

సీమలో హైకోర్టు ఏర్పాటుకు పీసీసీ తీర్మానం


విశాలాంధ్రబ్యూరో - కడప : రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేస్తున్నదని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు రాయలసీమ వాసులై ఉండి కనీసం హైకోర్టు సాధించుకోకపోతే సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ జాతీయ అధిష్ఠానంతో తాము మాట్లాడతానని స్పష్టం చేశారు. సీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలని గత నెల రోజుల నుంచి దీక్షలు చేస్తున్న న్యాయవాదుల దీక్షల శిబిరాన్ని రఘువీరారెడ్డి మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలీ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, మాజీ మంత్రులు తులసిరెడ్డి, రామచంద్రయ్య, డీసీసీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, పీసీసీ అధ్యక్షుడు సత్తార్, అధికార ప్రతినిధి నీలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో గంగాధరనెల్లూరు తహశీల్దార్



విశాలాంధ్ర - గంగాధరనెల్లూరు : అక్రమంగా ఒక రైతు నుంచి లంచం తీసుకుంటున్న చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండల తహశీల్దార్ సుశీలను అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని పాతపాళ్యం గ్రామ పంచాయతీలో రాజేంద్రన్ అనే రైతుకు కొంత భూమి వుంది. తండ్రి మరణానంతరం ఆ భూమిని తన పేర మార్చాలని రాజేంద్రన్ దరఖాస్తు చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో పొరపాటు వలన కొంత భూమి ఇతరుల లెక్కలోకి వెళ్ళింది. దీనిని సరిచేయాలని తహశీల్దార్‌కు బాధితుడు విన్నవించుకున్నాడు. తహశీల్దార్ సుశీల రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసింది. రూ.15 వేలకు బేరం కుదుర్చుకున్న రాజేంద్రన్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన అధికారులు మంగళవారం రాజేంద్రన్ నుంచి బహిరంగంగా లంచం తీసుకుంటుండగా సుశీలను పట్టుకున్నారు. బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ దాడులలో ఏసీబీ డీఎస్పీ శంకర్, సిఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో నక్షత్ర తాబేళ్లు అక్రమ రవాణా



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : అత్యంత విలువైన నక్షత్ర తాబేళ్లను రైలులో తరలిస్తున్నట్టు కేంద్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం రావడంతో మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఓ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి కొచ్చిన్‌కు నాలుగు సంచుల్లో 406 నక్షత్ర తాబేళ్లను తరలిస్తున్న ఓ ముఠాను ముందస్తు సమాచారంతో విజయవాడ ఆర్పీఎఫ్ అధికారుల సహాయంతో రైలు విజయవాడకు చేరుకున్న సమయంలో తనిఖీలు చేపట్టారు. జనరల్ బోగీలో సీటు కంద నాలుగు బుట్టల్లో ఈ నక్షత్ర తాబేళ్లను గుర్తించారు. తాబేళ్లతోపాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్నాటక రాష్ట్రంలోని మెల్లంపల్లి గ్రామానికి చెందిన సుందరమ్మ(55), మదపనల్లికి చెందిన శాంతిప్రియ(26)గా తెలిసింది. తాబేళ్లను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మార్కెట్‌లో ఒక్కో తాబేలు ధర రూ.1000కు పైగా ఉంటుందని అంచనా. కేంద్ర ప్రభుత్వ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.



రాజధానిలో డిసెంబరు నాటికి ఉద్యోగుల ఇళ్లు సిద్ధం చేస్తాం

విశాలాంధ్ర - తుళ్ళూరు : రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం, రోడ్లు, డ్రైయి న్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. రాజధాని లో నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రాజధానిలో మొత్తం 63 టవర్లలో 3,840 అపార్ట్‌మెంట్లను, గెజిటెడ్, క్లాస్ 4 ఉద్యోగుల కోసం నిర్మిస్తున్నామన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయడంతోపాటు 2019 మార్చి కల్లా ఇక్కడ నివాసాలు ఉండేలా అందిస్తామన్నారు. ఇంతపెద్ద ఎత్తున పనులు జరుగుతున్నప్పటికీ కనీసం ఒక్క ఇటుకైనా పెట్టారా అని వైసీపీ నేతలు విమర్శించడం సరికాదన్నారు. రాజధానికొచ్చి ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవుచెప్పారు. రాజధాని నిర్మాణానికి కనీసం రూ.48 వేల కోట్లు అవసరమవుతాయని, ఒక్క పరిపాలన నగరం నిర్మాణానికే రూ.11 వేల కోట్ల ఖర్చవుతుందన్నారు. కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,500 కోట్లు మాత్రమే ఇచ్చినందున మరింత సహాయం చేయాలని నారాయణ కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతకు వెనుకాడం

విశాలాంధ్ర - విశాఖసిటీ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదని, ఇదే వైఖరి కొనసాగిస్తే బుధవారం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు వెనుకాడబోమని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక నాయకులు ఆర్వేఎస్వీ కుమార్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసనలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న 23 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నా పాలకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగ్గునాయుడు, పరుశురాం, కేదారేశ్వరి, శారద, అచ్చెంనాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఇరాన్ దౌత్య అధికారుల బృందం



విశాలాంధ్ర - విశాఖపట్నం (మధురవాడ) : విశాఖజిల్లాలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం ఇరాన్ దౌత్య కార్యాలయ అధికారుల బృందం సందర్శించింది. ఇరాన్ దౌత్య కార్యాలయ రీసెర్చి కౌన్సిలర్ ప్రొఫెసర్ ఎస్.మహమ్మర్ రెజా ఖలీలి నేతృత్వంలో సయ్యద్ మహమ్మద్ హది తౌరావి, జావెదాన్‌తో కూడిన బృందం గీతం విశ్వవిద్యాలయంలోని సైన్స్, ఇంజనీరింగ్, పరిశోధనా కేంద్రాలను, సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సొల్యూషన్స్‌ను, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి సెంటర్‌ను పరిశీలించారు. పరిశోధకులతో చర్చించారు. గీతం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ॥ ఎమ్.ఎస్.ప్రసాద్‌రావు, వైస్‌ఛాన్సలర్ ప్రొ॥కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొ॥ ఎమ్.పోతరాజు, అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్ కె.పి.కిషన్‌లతో సమావేశమయ్యారు. ఇరాన్ దౌత్య కార్యాలయ అధికారులను వైస్ ఛాన్సలర్ సన్మానించారు.

బెజవాడ భూకబ్జాల నివారణకు త్రిసభ్య కమిటీ



విశాలాంధ్ర - విజయవాడ : రాజధాని ప్రాంతంలోని విజయవాడ నగరంలో భూకబ్జాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ప్రకటించారు. నగరంలో భూకబ్జాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ భూ కబ్జాల నివారణ కమిటీ కన్వీనర్ దోనేపూడి శంకర్ నేతృత్వంలో కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరం కబ్జాల రాజధానిగా మారిపోయిందని శంకర్ వివరించారు. కబ్జాదారుల చేతుల్లో భూములు కోల్పోతున్న బాధితులకు అండగా నిలిచేందుకు విజయవాడలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ముఖ్య నేతలు కలసి భూ కబ్జా నివారణ కమిటీగా ఏర్పడినట్టు వివరించారు. సమస్య తీవ్రతకు స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా జాయింట్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్-2, ప్రాజెక్ట్ డైరెక్టర్లతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

మత్స్యకారుల పథకానికి తూట్లు

- ఎస్‌డీపీ పథకంపై దళారుల కన్ను
- లబ్ధిదారుల నుంచి భారీగా వసూళ్లు
- చక్రం తిప్పుతున్న సొసైటీ పెద్దలు
- ఇంజన్ల ధరలపైనా భారీగా వడ్డింపులు

రెక్కాడితే గానీ డొక్కాడని మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని రాజకీయ దళారులు దోచుకుంటున్నారు. అత్యధిక సబ్సిడీ కలిగిన ఎస్డీపీ పథకం లబ్ధిదారులను బెదిరించి వసూలు చేస్తున్నారు. మత్స్యకారుల సొసైటీ పెద్దల పాత్రపైనా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.




విశాలాంధ్ర - సోంపేట : మత్స్యకారుల సంక్షేమం కోసం భారీ సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రత్యేక అభివృద్ధి పథకం (ఎస్డీపీ) దళారులకు వరంగా మారింది. సబ్సిడీ పోనూ మిగతా చెల్లింపులన్నీ బ్యాంకుల ద్వారా చేపడుతున్నప్పటికీ అధికారులు, రాజకీయ నేతల పేర్లుచెప్పి లబ్ధిదారుల నుంచి భారీగా దండుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాకు 400 యూనిట్లు మంజూరుకాగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 85 యూనిట్లు మంజూరయ్యాయి. సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులకు చేయూతనివ్వాలన్న లక్ష్యంతో 2017-18లో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద బోటు, వల, ఇంజన్ కలిపి ఒక యూనిట్‌కు రూ.2 లక్షలు కేటాయించింది. దీనిలో 24 అడుగుల పొడవు కలిగిన బోటు విలువ రూ.1,20,000, 5హెచ్‌పీ ఇంజన్ ధర రూ.39 వేలు, వల ధర రూ.41 వేలుగా నిర్ణయించింది. ఈ మొత్తంలో రూ.1,60,000 సబ్సిడీ పోనూ లబ్ధిదారుడు డీడీ చార్జీల విలువతో కలిపి రూ.40,200ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట మండలాల్లో 85 మంది లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లోని మత్స్యకార సమాఖ్య సొసైటీల ద్వారా ఎంపికచేశారు. సబ్సిడీ ఎక్కువ కావడంతో రాజకీయ దళారులు, గ్రామాల్లోని సొసైటీల అధ్యక్షుల కళ్లు ఈ పథకంపై పడ్డాయి. సొసైటీల ఖర్చులు, అధికారులు, రాజకీయనేతల మామూళ్ల పేరిట ఒక్కో లబ్ధిదారుని వద్ద రూ. 10వేల చొప్పున వసూళ్లకు తెరలేపారు. ప్రశ్నించిన వారికి పథకం లేదు పొమ్మనడంతో వారంతా కంగుతింటున్నారు. ఈ ఒక్క నియోజకవర్గ పరిధిలోని 85 యూనిట్ల ద్వారా 8 లక్షల రూపాయలకు పైగా దండుకున్నట్టు తెలుస్తోంది.

ఇంజన్ కెపాసిటీ పేరుతో భారీ వడ్డింపులు

లబ్ధిదారులు 5 హెచ్‌పీ ఇంజన్ కెపాసిటీ చాలదంటూ 9 హెచ్‌పీ ఇంజన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. 9 హెచ్‌పీ ఇంజన్ ధర రూ.68 వేలుగా పేర్కొంటున్న సంబంధిత కాంట్రాక్టర్ అదనంగా రూ.30 వేలు అదనంగా చెల్లించాలని కోరుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో 9 హెచ్‌పీ ఇంజన్ ధర రూ.45 వేల నుంచి రూ.50 వేలు మాత్రమే ఉందని కాంట్రాక్టర్ మాత్రం పెద్దమొత్తం దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. రూ.1,20,000కు ప్రభుత్వం సమకూర్చుతున్న 24 అడుగుల పొడవైన బోటు చాలదంటూ కొందరు 28 అడుగులు, మరికొందరు 31 అడుగులకు పెంచాలంటూ అదనపు మొత్తాలను ఆయా కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారు.


అక్రమంగా దోచుకుంటున్నారు



మత్స్యకారులకు ప్రభుత్వం భారీ సబ్సిడీ ఇచ్చినా సొసైటీ ప్రతినిధులు ఒక్కొక్కరి నుంచి రూ.10వేల చొప్పున అక్రమంగా దోచుకుంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

- లంద అప్పన్న, లబ్ధిదారుడు, ఇసకలపాలెం

ఖర్చుల కోసమే వసూలుచేశాం



బ్యాంకులు, అధికారుల వద్దకు తరచూ ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం అనేకమార్లు తిరగాల్సి ఉంటుంది. ఖర్చులకు వసూలు చేయాల్సివచ్చింది. అందరి మాదిరిగానే మేమూ చేశాం.

- కూర్మారావు, సొసైటీ ప్రెసిడెంట్, ఇసకలపాలెం

వసూళ్లతో మాకెలాంటి సంబంధం లేదు

ఎస్డీపీ పథకంలో లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తున్నట్టు మా దృష్టికి రాలేదు. వాటితో మాకెటువంటి సంబంధంలేదు. గ్రామాలకు వెళ్లి మామూళ్లు చెల్లించవద్దని చెబుతాం.

- సురేష్, ఎఫ్‌డీవో, ఇచ్ఛాపురం

అవిశ్వాసంపై మీనమేషాలు లెక్కించవద్దు

సీఎం చంద్రబాబునాయుడుకు ఉండవల్లి సూచన



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడంలో మీనమేషాలు లెక్కించవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు పార్లమెంటు మాజీ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్ సూచించారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం తీర్మానం పెట్టడానికి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. ఈ విషయమై రాజమండ్రిలో చాలాసార్లు అనుకున్నప్పటికీ సెలబ్రిటీ కనుక పవన్ కళ్యాణ్ అన్నదానికి జగన్ స్పందించారన్నారు. అవిశ్వాసం ఆఖరి అస్త్రం కావాలని చంద్రబాబు అనడం అర్థం కావడం లేదన్నారు. ఇదే ఆఖరి బడ్జెట్ అని, వచ్చే ఏడాది ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ వస్తుంది కాబట్టి అవిశ్వాసానికి ఇదే అదునుగా భావించాలన్నారు. ఈ బడ్జెట్ సెషన్‌లో జగన్ పెట్టబోయే అవిశ్వాసానికి చంద్రబాబు మద్దతు పలకాలని, కనీసం ఒక సభ్యుడు అవిశ్వాసం ప్రవేశపెడితే, దానికి మద్దతుగా 10 శాతం అంటే 54 మంది సభ్యులు మద్దతు పలికితే ఇక అన్నీ చర్చలు ఆపేసి, దానిమీదే చర్చించాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీలోనే చంద్రబాబు లెక్కలు చెబుతానంటున్న నేపథ్యంలో జగన్ పాదయాత్ర మానకుండా ఆ పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి హాజరయ్యేలా చూడాలని సూచించారు. అలా చేస్తే ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. లేనిపక్షంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల్లో టీడీపీ, బీజేపీ భాగస్వాములుగా వున్నందున నిజాలు బయటకు రావన్నారు. ఈ సమావేశంలో పొడిపిరెడ్డి అచ్యుత దేశాయ్, అల్లు బాబి, చెరుకూరి వెంకట రామారావు, పసుపులేటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెగా సీడ్ పార్కుకు అన్ని సౌకర్యాలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే మెగా సీడ్ పార్క్ పబ్లిక్ లిమిటెడ్ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సమావేశ భవన్‌లో మంగళవారం అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడుతూ తంగెడంచలో సీడ్ హబ్ కోసం కేటాయించిన 600 ఎకరాల్లో గత ఏడాది సెప్టెంబరులో మెగాసీడ్ హబ్‌కు శంకుస్థాపన చేశామన్నారు. అమెరికాలో వందేళ్ల చరిత్ర కలిగిన ఆయోవా స్టేట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ సీడ్‌పార్కుకు కాంపౌండ్, బిల్డింగ్, ల్యాబ్, రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనేక సీడ్ కంపెనీలు ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడుతున్నాయని, మరిన్ని కంపెనీలను ఏపీకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే బడ్జెట్‌లో ఈ కంపెనీకి రూ.190 కోట్లు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మొత్తం రూ.350 కోట్లు ఖర్చుచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రూ.1,300 కోట్లు ఖర్చుచేయడానికి మెగా సీడ్ కంపెనీ సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. బెస్ట్ మోడల్ సీడ్ పార్కుగా రూపొందించాలని కోరారు.

ఆయోవా సీఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 80 శాతం మంది రైతులు నాణ్యమైన సీడ్ విత్తనాలు వాడటం లేదన్నారు. దేశంలో వరి లో 14 రకాల వంగడాలు మాత్రమే ఉన్నాయని, మా వద్ద 700 రకాల సీడ్ విత్తనాలు ఉన్నాయన్నారు. ఆసియా ఖండంలో ఇదే అతిపెద్ద సీడ్‌పార్కు అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీవీ జయ నాగేశ్వరరెడ్డి, మణి గాంధీ, ఐజయ్య, వ్యవసాయశాఖ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ హరిషోత్తమరావు, కలెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లకు విస్తృత అవకాశాలు

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి



విశాలాంధ్ర - మంగళగిరి : నవ్యాంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రోసెసింగ్ (ఆహార తయారీ ప్రక్రియ) రంగం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పారిశ్రామల శాఖ మంత్రి ఎన్. అమరనాథరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లో లిండే గ్రూప్ ఏర్పాటు చేసిన ఫుడ్ ల్యాబొరేటరీ, ట్రెనింగ్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని ఫుడ్ ప్రోసెసింగ్ రంగంతో అనుసంధానం చేస్తే రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం, ఆక్వా రంగాల అభివృద్ధికి అవసరమైన సహజవనరులు రాష్ట్రంలో విస్తారంగా వున్నందున సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తుందని అమరనాథరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లిండే గ్యాసెస్ తూర్పు ఆసియా ప్రతినిధి మోలోయ్ బెనర్జీ పాల్గొన్నారు.



దేశంలో మోడీ పాలన బ్రిటిష్ హయాంను తలపిస్తోంది

విశాలాంధ్ర - కర్నూలు అర్బన్ : ప్రధాని నరేంద్రమోడీ పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తున్నదని ఏపీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుతో మంగళవారం కర్నూలులోని ఆ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ, నోట్లరద్దు, ఎఫ్ఆర్‌బీఐ వంటి సొంత నిర్ణయాలతో దేశాన్ని మోడీ భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు తదితర హామీల సాధనకోసం కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయించడతో టీడీపీ, వైసీపీతోపాటు బీజేపీ రాష్ట్ర విభాగం మద్దతు ఇస్తే ఒత్తిడి పెరుగుతుందన్నారు. కేంద్రానికి సెగ తగిలేలా మార్చి 2న జాతీయ రహదారుల దిగ్బంధనం చేయాలన్నారు. మార్చి 6, 7, 8 తేదీ ఢిల్లీలో నిరసన చేపట్టనున్నామన్నారు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక హోదా విషయంలో దొంగనాటకాలు ఆడుతున్నాయని, విభజన చట్టంలోని హామీలను అమలు చేసే వరకు మోడీ ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తి లేదన్నారు. డీసీసీ అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, నగర అధ్యక్షులు సర్దార్‌బుచ్చిబాబు, మాజీ జెడ్పీ చైర్మన్ ఆకేపోగు వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మదన్‌గోపాల్, డీసీసీ ఉపాధ్యక్షులు కె. లక్ష్మి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్‌పై విజి'లెన్స్'

- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రికార్డుల సేకరణ
- అనుమానిత ఆస్పత్రుల్లో ముమ్మర తనిఖీలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కదలికలతో బెంబేలు

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : రాష్ట్రంలో కలకలం సృష్టించిన నరసరావుపేట కిడ్నీ ముఠా రాకెట్ మూలాల కోసం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ముమ్మర దర్యాప్తు చేస్తోంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలో ఏఏ ఆస్పత్రిలో ఎంతమంది కిడ్నీలను మార్పిడి చేశారు, ఎలాంటి నిబంధనలను అనుసరించారు వంటి కీలక వివరాల సేకరణకు లోతుగా విచారణ చేస్తున్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రికార్డులు సేకరిస్తున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో గతనెలలో కిడ్నీ రాకెట్ వెలుగుచూసింది. ఆధార్ కార్డుపై ఫొటోలను మార్ఫింగ్ చేసి కిడ్నీలను విక్రయించే ప్రయత్నం చేయడంతో విషయం బయటపడింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు అనంతరం నలుగురిని అరెస్ట్ చేశారు. దీనిలో పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించిన మరో నలుగురు పరారీలో ఉన్నారు. వీరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ రాకెట్‌లో ఆస్పత్రుల పాత్రను తెలుసుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందాలు రంగంలోకి దిగాయి. గత పదేళ్లలో మూడు జిల్లాల్లోని ఆయా ఆస్పత్రుల్లో ఎంతమంది రోగులకు కిడ్నీలు మార్పిడి చేశారు, కిడ్నీల మార్పిడికి వైద్యులతో కూడిన కమిటీలు ఎలాంటి సిఫార్సులు చేశాయి వంటి ఎన్నో వివరాలు సేకరిస్తున్నాయి. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేదాంత ఆస్పత్రి, ఆయూష్ ఆస్పత్రితోపాటు మరికొన్ని ఆస్పత్రుల్లో కిడ్నీ మార్పిడి రోగుల వివరాలను విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్నారు. దీంతో వైద్యుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మూడు జిల్లాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు కిడ్నీల మార్పిడికి ఎలాంటి అనుమతులు తీసుకున్నాయి, అవి ఎంతకాలం వరకు పనిచేస్తాయి. కిడ్నీల మార్పిడి నిపుణులైన వైద్యుల బృందం సమక్షంలో జరుగుతుందా లేదా అనే కోణంలోనూ విచారణ జరుగుతున్నట్టు సమాచారం. కుటుంబసభ్యులు కాకుండా ఇతరుల కిడ్నీలు స్వీకరించినప్పుడు డబ్బు చేతులు మారుతుందా అనే విషయాలను దర్యాప్తుచేస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ పూర్తయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులు, వైద్యులపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

గుంటూరు జీజీహెచ్ పాత్రపైనా..

కిడ్నీ మార్పిడి వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్న గుంటూరు జీజీహెచ్ వైద్యుల బృందం ఆధ్వర్యంలోని కమిటీ పాత్రపైనా సమాచారం సేకరిస్తున్నారు. ఇక్కడి కమిటీ కిడ్నీ మార్పిడికి అనుమతులు ఇచ్చే సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించిందో విజిలెన్స్ అధికారులు జల్లెడపడుతున్నారు.

విచారణ కొనసాగుతుంది



కిడ్నీ మార్పిడి వ్యవహారంపై విజి లెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నాం. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. కిడ్నీ మార్పిడి ప్రక్రియలో మెరుగైన పద్ధతులపైనా కొన్ని సలహాలు ఇచ్చే అవకాశం ఉంది. ఒక పటిష్టమైన నియమావళి ప్రకారం కిడ్నీ మార్పిడి జరిగేలా సూచనలు ఇస్తాం.

శోభామంజరి, విజిలెన్స్ ఎస్పీ

ప్రత్యేక హోదా కోసం మహిళా సమాఖ్య వినూత్న నిరసన!

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించడంతో పాటు విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) వినూత్న నిరసన చేపట్టింది. లెనిన్ సెంటర్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డు పై కూరగాయలు అమ్ముతూ నిరసన తెలిపారు. సమాఖ్య నగర ప్రధానకార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ హోదా ఇవ్వకుంటే మహిళలు కూరగాయలు అమ్మకు బ్రతకాల్సిదేనన్న విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలన్న తలంపుతో ఈ కార్యక్రమం చేపట్టామని, రాష్ట్రంలో ఎంతో మంది యువతులు, మహిళలు ఉన్నత చదువులు చదివినా నిరుద్యోగ సమస్య వెంటాడుతుందన్నారు. రాష్ట్రాకి హోదా కల్పిస్తే పరిశ్రమలు ఏర్పడి తద్వారా మహిళలకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. విభజన హామీల చట్టంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, ఏపీకి రైల్వేజోన్ ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఏఒక్క అంశాన్ని ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. జాతీయహోదా కల్పించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం, అమరావతి నిర్మాణానికి నయా పైసా రాల్చకపోవడంపై దుయ్యబడుతూ దీనిపై ఎంపీలు, కేంద్ర మంత్రులు , రాష్ట్ర ముఖ్యమంత్రి పెదవివిప్పడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి హక్కుల సాధనకు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలు డిమాండు చేశారు. సమాఖ్య నగర అధ్యక్షులు ఓర్సు భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఇజ్జాడ లక్ష్మి, దుర్గాసి రమణమ్మ, మైనంపాటి సుబ్బలక్ష్మి, మచ్చా లక్ష్మి, డి.సీతారావమ్మ, నాగమణి, రాగూర్ లక్ష్మి, మాగం దుర్గ, ఎస్.శివకుమారి, వరలక్ష్మి, శాంతి, సుజాత, పద్మ పాల్గొన్నారు.



ప్రజాసమస్యలపై ఉధృత పోరు

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా మహాసభలో రామకృష్ణ పిలుపు

వేసంగి సత్యనారాయణరెడ్డి ప్రాంగణం నుంచి విశాలాంధ్ర బ్యూరో : పోలవరం, రాజధాని నిర్మాణం అంటూ నాలుగేళ్లు గడిపేసి ఇప్పుడు కేంద్రం ముందు పిల్లిమొగ్గలు వేయడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మానుకుని కేంద్రం లోని ఎన్డీయే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాం పెట్టాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా 25 మహాసభల్లో భాగంగా రెండో రోజు మంగళవారం తాడేపల్లిగూడెంలోని వేసంగి సత్యనారాయణ రెడ్డి ప్రాంగణంలో ప్రతినిధుల సభను రామకృష్ణ ప్రారంభించారు. స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో వేసంగి సత్యనారాయణరెడ్డి స్థూపాన్ని ఐఎస్ రాజు, పార్టీ సీనియర్ నాయకులు వంక సత్యనారాయణ, నాగమణి దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడేళ్ల కాలంలో పార్టీ రాజకీయ కార్యకలాపాల నివేదికను సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ ప్రవేశపెట్టారు. రామకృష్ణ ప్రసంగాన్ని కొనసాగిస్తూ, రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ప్యాకేజీ తీసుకురావడంలో రాష్ట్రానికి సీనియర్ నేతలుగా చంద్రబాబు, వెంకయ్య పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో 97 వేల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రం చంద్రబాబు పుణ్యమా అని రూ.2.26 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో నంద్యాల తరహాలోనే కోట్లు కుమ్మరించి 175 సీట్లు గెలుచుకోవాలని చంద్రబాబు కుయుక్తులకు పాల్పడుతున్నారని, అక్కడ ఉప ఎన్నికలో టీడీపీ రూ.80 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ రూ. 30 కోట్లు ఖర్చు చేసిందనీ, ఇదేనా ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. పేదల కోసం భూమి, భుక్తి తదితరాలతో పాటు భవిష్యత్‌లో మరిన్ని ఉధృత పోరాటాలకు సిద్దం కావాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టుల ఆలోచనా విధానంలో మార్పు రావాలని, రాజకీయాల్లో ఎదిగేవిధంగా మైండ్‌సెట్ మార్చుకో వాలని రామకృష్ణ సూచించారు. స్థానిక సమస్యలపై పోరాడేవాడే నిజమైన కమ్యూనిస్టు నాయకుడని రామకృష్ణ నొక్కి చెప్పారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్య నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోవడానికి వెళ్లిన వామపక్ష నాయకులను దౌర్జన్యంగా ప్రభుత్వం అరెస్టులు చేయించడం, జైళ్లల్లో పెట్టించడం ద్వారా ఉద్యమాన్ని అణగ దొక్కలేరని అన్నారు. పోలవరం నిర్వాసి తులకు ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యాగారమైన ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాకల్చర్ పెరిగిపోవడం వల్ల వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు ఒక్క ఎకరా భూమి పంచకుండా బూటకపు హామీలతో దళిత తేజం అంటూ వారిని వంచించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. వేలాది ఎకరాలు కార్పొరేట్ శక్తులకు పంచుతున్న ప్రభుత్వం మిగులు బంజరు భూములను పేదలకు పంచకుండా ఆయా వర్గాలను నిర్వీర్యం చేస్తున్నదని విమ ర్శించారు. ప్రతినిధుల సభకు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ, వంక నాగమణి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లపైనా పంజా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలోని రైల్వేస్టేషన్ల ఆధునీకరణ కోసం వాటిని ప్రైవేటు సంస్థలకు 99 ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని రైల్వేశాఖ నిర్ణయించినట్లు తెలిసింది. టెండర్లలో తెలిపిన విధంగా 45 సంవత్సరాల లీజు సమయం చాలదని, దానిని 99 ఏళ్లకు పెంపుదల చేస్తేనే బిడ్లను దాఖలు చేస్తామని పలు ప్రైవేటు సంస్థలు స్పష్టం చేయడంతో మరో మార్గం లేక ఆశాఖ అంగీకరించింది. దీనిపై త్వరలోనే చర్చించి విధివిధానాలు వెల్లడించే అవకాశం ఉంది. రైల్వే బోర్డు నిర్ణయానికి అనుగుణంగా మరికొద్ది నెలల్లోనే ఎంపిక చేసిన రైల్వేస్టేషన్ల పునరభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చెబుతున్నారు. బడ్జెట్‌లో 600 రైల్వేస్టేషన్లను ప్రపంచస్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. రైల్వేస్టేషన్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా రూ. లక్షకోట్ల ఆదాయం పొందాలని కేంద్రం భావిస్తోంది. గత ఏడాది 65 స్టేషన్లను పునరభివృద్ధి పథకంలో చేరుస్తూ ఆదేశాలు జారీ చేసింది. వీటిలో 23 స్టేషన్లలో ఆయా జోన్లకు, 12 స్టేషన్లలను ఇండియన్ రైల్వేస్టేషన్స్ డెవలెప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎస్‌డీసీ)కి, 10 స్టేషన్లను నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎన్‌బీసీసీ)కి, 18 ముంబై సబర్బన్ స్టేషన్లను ముంబై రైల్వే వికాస్ కార్పోరేషన్ (ఎంఆర్‌వీసీ), రైల్ ల్యాండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ)లకు అప్పగించింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ స్టేషన్‌ను ఆర్ఎల్‌డీఏ, ఐఆర్‌సీఓఎన్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తాయి. ఇక భువనేశ్వర్ స్టేషన్‌ను ఒడిశా



ప్రభుత్వంతో కలసి ఐఆర్ఎస్‌డీసీ అభివృద్ధి చేయనుంది. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో రూపుదిద్దుకుంటున్న భోపాల్‌లోని హబీబ్‌గంజ్ రైల్వేస్టేషన్ దేశంలోనే తొలి ప్రైవేట్ రైల్వేస్టేషన్‌గా నిలవనుంది. అలాగే దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి ప్రైవేటు పరం కానున్నాయి. వీటిలో సికింద్రబాద్, విజయవాడ, విశాఖ రైల్వేస్టేషన్ల అభివృద్ధి చేసే పనులు జోనల్ రైల్వేకు, మిగిలిన తిరుపతి, నెల్లూరులను ఎన్‌బీసీసీకి రైల్వేశాఖ అప్పగించింది. అలాగే ఈ ఏడాది ప్రకటించిన 600 స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరంగా మరిన్ని స్టేషన్లను అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే తనకు అప్పగించిన మూడు స్టేషన్లకు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్లను ఆహ్వానించింది. అయితే లీజు కాలం 45 సంవత్సరాలుగా పేర్కొనడంతో బిడ్లను దాఖలు చేసేందుకు ఏఒక్కరూ ముందుకు రాలేదు. ఇదే పరిస్థితి మిగిలిన జోన్లలోనూ చోటుచేసుకోవడంతో ఆయా జోన్ల నుంచి రైల్వేబోర్డుకు నివేదికలను అధికారులు అందచేశారు. ఈ విషయమై ఇటీవల రైల్వేశాఖమంత్రి పీయూష్‌గోయల్ ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రధానంగా లీజు విషయమై చర్చ జరగగా, 99 ఏళ్ల పాటు ఇచ్చేందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

విమానాశ్రయాలను తలదన్నే రీతిలో నిర్మాణాలు

రైల్వేస్టేషన్ల పునరభివృద్ధి కార్యక్రమంలో ఎంపిక చేసిన వాటిని విమానాశ్రయాలను తలదన్నే రీతిలో అత్యాధునిక సదుపాయాలను కల్పించాలని రైల్వేశాఖ యోచిస్తోంది. స్టేషన్ భవనాలను స్థానిక చారిత్రక, సామాజిక అంశాలను జోడించి రూపకల్పన చేయనుంది. అభివృద్ధి పనులను చేజిక్కించుకున్న సంస్థలు ప్రయాణీకులు రాకపోకలు సాగించేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయనున్నాయి. ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్రపంచస్థాయి విశ్రాంతి మందిరాలను ఏర్పాటు చేస్తాయి. అలాగే స్టేషన్ పరిసరాల్లో రైల్వేకు చెందిన ఖాళీ స్థలాల్లో సువిశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాతోపాటు స్టార్ హోటళ్లు, షాపింగ్‌మాల్స్, మినీ సినిమా థియేటర్లను నిర్మిస్తాయి. రైళ్లలో పార్శిల్స్‌ను ఎగుమతి, దిగుమతి చేసేందుకు వేరుగా సదుపాయాన్ని కల్పిస్తాయి. కాగా ఇప్పటికే దేశంలో పేరొందిన పలు ప్రైవేటు సంస్థలు బిడ్లను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ఎఫ్ఎస్), జీఎమ్మార్, టాటా రియాలిటీ, బ్రిగేడ్ గ్రూప్, మంత్రి డెవలెపర్స్, రహేజా, షాపూర్జీ-పల్లోంజీ, రిలయన్స్ ఇన్‌ఫ్రా, లాంకో ఇన్‌ఫ్రా, ఎస్సెల్ గ్రూప్ వంటి హేమాహేమీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం ఐఎల్ఎఫ్ఎస్, జీఎమ్మార్ సంస్థల మధ్య ప్రధానంగా పోటీ నెలకొని ఉంది. తిరుపతి, నెల్లూరులను కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలోని ఎన్‌బీసీసీ చేపట్టనుంది. ఇదిలా ఉండగా రైల్వేస్టేషన్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని రైల్వే కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పు పడుతున్నాయి. అదేవిధంగా 99 సంవత్సరల లీజును వ్యతిరేకిస్తున్నాయి. స్టేషన్ల పునరభివృద్ధి పేరుతో అంచెలంచెలుగా రైల్వేలో ముఖ్య విభాగాలను ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర చేస్తోందని, దీనిని ఎదుర్కొనేందుకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని ప్రధాన కార్మిక సంఘాల నేతలు తెలిపారు.

రాజధాని భూస్కాం ప్రధాన నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర-తుళ్ళూరు : మందడం సీఆర్‌డీఏ పరిధిలో జరిగిన భూకుంభకోణానికి సంబంధించిన ప్రధాన నిందితుడు పఠాన్ గౌస్‌ఖాన్‌ను అరెస్టు చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంద దంలోని తుళ్లూరు సబ్ డివిజనల్ కార్యాల యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో గౌస్‌ఖాన్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ మందడంలో జరిగిన భూకుంభకోణంపై ఈనెల 6న డిప్యూటీ కలెక్టర్ సాధన తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం గౌస్‌ఖాన్‌ను అరెస్టు చేశామన్నారు. గౌస్ అనేవ్యక్తి మందడంలోని సర్వే నంబర్ 207లో భూమి ఉందని చెప్పగా సీఆర్‌డీఏ అధికారులు దానిని ల్యాండ్ పూలిం గ్‌లో తీసుకున్నారని, మూడేళ్లు కౌలుకు ఇవ్వడంతోపాటు ప్లాట్లు కేటాయిం చారన్నారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌస్ అనేవ్యక్తిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశా మన్నారు. గౌస్‌ఖాన్ నుంచి రూ.లక్షా 15 వేలు స్వాధీన పరుచుకున్నామని, ఈ నగదు సీఆర్‌డీఏ అధికారుల కౌలు



రూపేణా తన బ్యాంకులో వేశారని గౌస్‌ఖాన్ తెలిపాడన్నారు. అలాగే ఇతనికి సీఆర్‌డీఏ అధికారులు రూ.50వేలు ఇచ్చారని అవి అతని కుమారుడు మీరా వలి వద్ద ఉన్నాయని వివరించాడని శ్రీనివాస్ తెలిపారు. మీరావలి ఖాన్‌ను, కంప్యూటర్ ఆపరేటర్ సందీప్‌ను త్వరలోనే పట్టుకుంటామని గౌస్‌ఖాన్‌ను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈకేసు తుళ్లూరు సీఐ యు.సుధాకర్‌రావు దర్యాప్తు చేశారని ఆయన పేర్కొ న్నారు. కానిస్టేబల్స్ డి.శ్రీకాంత్, ఆర్.వేణుగోపాల్, వి.అజయ్‌దేవ్, షేక్.షాహేల్ పాల్గొన్నారు.

రైతులకు చంద్రబాబు అన్యాయం

విశాలాంధ్ర - ఒంగోలు : చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో రైతుల ముఖంలో చిరునవ్వు మాయమైందని వైసీపీ అధ్యక్షుడు జగన్ దుయ్యబట్టారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర ప్రకాశం జిల్లాలో 93వ రోజు కొన సాగింది.అందులో బాగంగా కొండపి నియోజక వర్గం లోని తిమ్మపాలెం వద్ద జగన్ రైతులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం దారి పొడవునా రైతుల సమస్యలు వింటున్నామని, సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. నాలుగేళ్లుగా రైతులు ఏ పంట పండించినా గిట్టుబాటు ధర లేదన్నారు. ప్రకాశం జిల్లాలో శెనగ, మినుము, కంది, పొగాకు, జామాయిల్ ఎక్కువగా సాగు చేస్తారని, శెనగకు ఉత్పత్తికి అయ్యేది రూ.5,600 పైగా ఖర్చు అయితే, మార్కెట్‌లో రూ.3,500 మాత్రమే ధర వస్తోందన్నారు. చంద్రబాబు రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి పెడతానని మోసం రైతులను మోసం చేశాయన్నారు.10 సంవత్స రాల క్రితం సాగు ఖర్చు తక్కువని, ఇప్పుడు అన్నీ ధరలు పెరిగాయన్నారు. ఖరీఫ్‌లో బీమా కింద కట్టాల్సిన డబ్బు రాష్ట్ర ప్రభుత్వం కట్టలేదని దీంతో కేంద్ర ప్రభుత్వమూ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికా రం లోకి వస్తే., పెట్టుబ డులు తగ్గించటానికి రైతన్నలకు 9 గంటల పాటు పగటిపూటే ఉచితంగా కరెంటు ఇస్తా మన్నారు. వడ్డీ లేకుండా వ్యవసాయ రుణాలు ఇప్పించి, వడ్డీ డబ్బులు బ్యాంకులకు ప్రభుత్వం కడుతుందన్నారు. రైతులకు మే నెలలో రూ.12,500 ఇస్తామని, దీని ద్వారా పెట్టుబడులు ఖర్చు బాగా తగ్గుతా యన్నారు. ఐదు జిల్లాలు తిరిగి ఆరో జిల్లాకు వచ్చాన ఏ జిల్లాకు వెళ్లినా కో ఆపరేటివ్ యూనిట్లు అన్నీ మూతపడుతున్నా యన్నారు. చిత్తూరు డెయిరీ నుంచి ప్రకాశం డెయిరీ వరకు ఇదే పరిస్థితన్నారు. హెరిటేజ్ డెయిరీల కోసం కోఆపరేటివ్ డెయిరీలు మూతపడేలా చేశారని ఆయన విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వస్తే కో ఆపరేటివ్ డెయిరీ ప్రోత్సహించి, రైతన్న ముఖాల్లో చిరునవ్వు చూస్తామన్నారు.

చంద్రబాబుకు సమస్య వస్తే...
పవన్ బయటకొస్తున్నారు.. : బొత్సా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సీఎం చంద్రబాబుకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు పవన్ కళ్యాణ్ బయటకు వస్తున్నారని వైసీపీ రాష్ట్ర నాయకులు బొత్సా సత్యనారాయణ ఎద్దేవా చేశారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏపీ బడ్జెట్టులో రాష్ట్రానికి నెలకొన్న అన్యాయం, ప్రత్యేక.హోదా, విభజన హక్కుల సాధన అంశాలపై 20 రోజుల నుంచి ఓ అజ్ఞాతగా సీఎం చంద్రబాబు వ్యవహరించారని విమర్శించారు.ఏపీకి బడ్జెట్టులో నెలకొన్న అన్యాయంపై వైసీపీ ప్రతి విషయాన్నీ తేటతెల్లం చేసిందని పేర్కొన్నారు.నాలుగేళ్ల నుంచి టీడీపీ నేతలు దోపిడీ, బలహీన తలతో కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారని విమర్శించారు.బడ్జెట్టులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వామపక్షాలు చేపట్టిన బంద్‌కు వైసీపీ మద్దతిచ్చిందని, దాన్ని టీడీపీ ఎందుకు తప్పుపట్టిందో ప్రజలకు వెల్లడించాలని ప్రశ్నించారు.

బొగ్గుగనులు (మొదటిపేజీ తరువాయి)

మైనింగ్‌కు గేట్లు తెరిచినట్లైంది. కేబినెట్ భేటీ అనంతరం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ బొగ్గు రంగాన్ని జాతీయకరించిన దగ్గర నుంచి కూడా ప్రైవేట్ రంగంలో వాణిజ్య బొగ్గు మైనింగ్‌ను అనుమతించాలన్నది అత్యంత అభిలషణీ యంగా ఉన్నది. ప్రస్తుతం కేపటీవ్ వినియోగానికి మాత్రమే బొగ్గు రంగంలో ప్రైవేట్‌రంగాన్ని అనుమతిస్తున్నారు. పోటీతత్వాన్ని పెంచి తక్కువ విద్యుత్ ఛార్జీలు వుండే విధంగా చూడడంతో పాటు సీఐఎల్ గుత్తాధిపత్యానికి అడ్డుకట్టవేసే విధంగా తాజా సంస్కరణ ఉంటుందని గోయెల్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియాకు భారీ ప్రయోజనం కలగనుందన్నారు.

మహానది వివాదంపై ట్రిబ్యునల్ ఏర్పాటు

ఒడిశా, చత్తీస్‌ఘడ్ మధ్య మహానది జలాల పంపిణీపై వివాదం పరిష్కారం కోసం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపిందని అధికారవర్గాలు తెలిపాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదం పరిష్కారానికి నెల రోజులలోగా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు గత నెలలో ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నది.

రెండో రోజూ అదే జోరు

- కొనసాగిన అగ్రి బాధితుల రిలే నిరాహార దీక్షలు
- బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయింపులే ప్రధాన డిమాండు





విశాలాంధ్ర నెట్‌వర్క్ : అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహార దీక్షలతోనైనా ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించాలని లేనిపక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు స్పష్టం చేశారు. మార్చి 5వ తేది వరకు మాత్రమే ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకునే దిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు మూడు రోజుల దీక్షల్లో భాగంగా రెండోరోజు మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో దీక్షలు నిర్వహించారు. గుంటూరులో దీక్షా శిబిరాన్ని ముప్పాళ్ల సందర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జరిగిన దీక్షలో తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో నాయకులు మాట్లాడుతూ, అగ్రి బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ లక్షలాది మంది తరుపున అసోసియేషన్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. ప్రతి బాధితునికి చివరి పైసా వచ్చే వరకు ఈ పోరు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

గుంటూరు జిల్లాలో : గుంటూరు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. గుంటూరు నగరంతో పాటు చిలకలూరిపేట, గురజాల, రేపల్లె, నిజాంపట్నం, మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, పొన్నూరు తదితరుల ప్రాంతాలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.

గోదావరి జిల్లాల్లో : పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిలా రాజమహేంద్రవరం, పెద్దాపురంలో రెండోరోజూ దీక్షలు కొనసాగాయి. రాజమహేంద్రవరంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల సత్యనారాయణ పాల్గొనగా పెద్దాపురంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో : కృష్ణాజిల్లాలో గన్నవరం, రెడ్డిగూడెం, కలిదిండి, మచిలీపట్నంలో దీక్షలు జరిగాయి. గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితులకు మద్దతుగా రిలే నిరాహార దీక్షలు బుధవారం చేపట్టనున్నారు. రెడ్డిగూడెంలో జరిగిన నిరాహార దీక్షలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని రామారావు పాల్గొన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడారు. గన్నవరంలో సీపీఐ ఏరియా నాయకులు పెద్దు వెంకటరత్నం నిరాహార దీక్షలో పాలొ న్నారు. కలిదిండి తహశీల్దారు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో అసోసియేషన్ నియోజకవర్గ ప్రెసిడెంట్ చక్క జగన్మోహనరావు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేవీవీ ప్రసాద్ స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల నిరాహార దీక్షలు ప్రకాశం జిల్లాలో మంగళవారం రెండోరోజూ విజయవంతమయ్యాయి. యర్రగొండపాలెం తహశీల్దార్ కార్యాలయంవద్ద రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించిన ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించి బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ దీక్షలు ఒంగోలు, కందుకూరు, తాళ్లూరు, శింగరాయకొండ, కనిగిరి, మార్కాపురం, టంగుటూరు, వెలిగండ్ల తదితర మండల కేంద్రాల్లో జరుగుతున్నాయి. ఈ శిబిరాలకు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.

నెల్లూరు జిల్లాలో : నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట, నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట, సూళ్లూరుపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, కావలిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద, వెంకటగిరి, ఆత్మకూరు, సంగం, కలిగిరి, వెంకటాచలం మండలాలతో పాటు అన్ని మండలాల్లో అగ్రిగోల్డ్ ఏజెంట్స్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా సీపీఐ నాయకులు దీక్షలో పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో : కర్నూలు జిల్లాలోని కర్నూలు, డోన్, పత్తికొండ, ఆదోని, ఆలూరు, బనగానపల్లె, హొళగుంద, బేతంచెర్ల, ఆత్మకూరు, దేవనకొండ, ఆళ్లగడ్డ, ఆలూరు, కొలిమిగుండ్లల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు, సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కడప జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళ వారం కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పోరుమామిళ్ళ, పులివెందుల, రాజంపేట, రాయచోటి, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాలలో జరిగాయి. బడ్జెట్‌లో అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 4వేల కోట్లు కేటాయించాలని డిమాం డుచేశారు. బాధితులను ఆదుకునేంతవరకు పోరాటాలను ఆపేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విశాఖ జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం అదే జోరుతో కొనసాగాయి. అనకాపల్లిలో జరిగిన దీక్షలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మద్దతు తెలిపి దీక్షను ఉద్దేశించి మాట్లాడారు. మోసపోయిన 20 లక్షల అగ్రిగోల్డు బాధితుల సమస్యను రాజకీయ కోణం నుండి కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని అన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు వైఎస్ భద్రం మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఇంకా వైసీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు. పద్మనాభంలో అగ్రిగోల్డ్ కస్టమర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అచ్చిలనాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.సన్ని బాబు, భాస్కరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ సీపీఐ పోరాడుతుందని జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు అన్నారు. నెల్లిమర్ల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. సీపీఐ నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు తాలాడ సన్నిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మజ్జి సూరప్పడు పాల్గొన్నారు.

పార్వతీపురం దీక్షా శిబిరంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ ఆర్‌విఎస్ కుమార్, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు జమ్మాన ప్రసన్నకుమార్, అలజంగి జోగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీరామూర్తిలు మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో: శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద దీక్షలో పైడి గోవిందరావు, లక్ష్మణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జయసింహ, ప్రధాన కార్యదర్శి పైడి గోవిందరావు, కార్యవర్గ సభ్యులు లక్ష్మణమూర్తి, గంగు శ్రీను, కింజరాపు రాజారావు తదితరులు పాల్గొన్నారు. సోంపేటలో పొందర లోకనాథం, పొందర హేమరాజు బెహరా, దొండపల్లి బాలకృష్ణ, తోట యాదవరావు తదితరులు పాల్గొన్నారు. పలాసలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వైసీపీ కన్వీనర్ డా. సీదరి అప్పలరాజు డిమాండు చేశారు.

నాలుగేళ్లుగా అన్యాయాలే (మొదటిపేజీ తరువాయి)

మాత్రమే విదిలించింది. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి 2019కల్లా పూర్తిచేస్తామని చెప్పారు. 2014-15 అంచనాల ప్రకారం రు.54 వేల కోట్లు ఖర్చయ్యే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికీ రు.4,662 కోట్లు మాత్రమే ఇచ్చింది. నిర్వాసితుల పునరావాసం కింద రు.33 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా, కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అరకొర నిధులతో 2019 కల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవ్వడం అసాధ్యం. అన్నీ మెరుగైన అవకాశాలు ఉన్నప్పటికీ విశాఖ రైల్వేజోన్ ప్రకటించలేదు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం తీవ్రమైన ఉద్యమాలు సాగుతున్నా పట్టించుకో లేదు. రాష్ట్రంలో కేంద్రీయ విద్యాసంస్థలు ఏర్పాటుకు రు.11,670 కోట్ల నిధులకు గాను కేవలం రు.520 కోట్లు మాత్రమే కేటాయించారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి కేంద్రం రు.1,500 కోట్లు మాత్రమే విదిల్చింది. ప్రకాశంజిల్లా రామాయపట్నంలో కొత్త సీపోర్టు, చెన్నై-వైజాగ్ కారిడార్, అనంతపురం జిల్లాను చేర్చి చెన్నై-బెంగళూరు కారిడార్ ఏర్పాటుపై ప్రాథమికమైన చర్యలు కూడా లేవు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు చేసేవారికి రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తామన్న కేంద్రం హామీలు అమలుకు నోచుకోలేదు. ఇక రాష్ట్రానికి 5 ఏళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. సాక్షాత్తూ ఆ పార్లమెంటులోనే బీజేపీ నాయకులైన వెంకయ్య నాయుడు, అరుణ్‌జైట్లీ 10 ఏళ్లు ప్రత్యేక హోదా కావాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తే 10 ఏళ్లపాటు ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని' పొందుపరిచారు. మీరేమో స్వయాన నరేంద్రమోడీ సమక్షంలోనే ఏపీకి 15 ఏళ్లు ప్రత్యేక హోదా కావాలని కోరారు. కాని అన్ని హామీలను అటకెక్కించారు. కనీసం ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుంటుందని ప్రజలు ఆశించారు. కాని అరకొర నిధులతో సరిపెట్టి మరో దఫా ఈ రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసింది. ప్రతి దఫా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న ప్పటికీ మీరు సర్దుకుపోయారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని బీజేపీ, టీడీపీ రెండు పార్టీల అంశంగా చూశారే తప్ప రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తుకి సంబంధించిన సమస్యగా గుర్తించలేదు. కనీసం ఏనాడూ ఈ విషయాలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయలేదు. మీ అవకాశవాదం వల్ల ఏపీకి తీరని అన్యాయం జరిగింది. దీనికితోడు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ కూడా పోటీపడి నరేంద్రమోడీ ప్రభుత్వానికి మద్దతు పలకడం వలన ఆంధ్రప్రదేశ్‌కు గత నాలుగు సంవత్సరాలుగా నష్టం జరిగింది. ఈ రోజు మీరు తీసుకునే కఠినతర నిర్ణయాలు ఆ రోజే తీసుకుని ఉంటే ఏపీకి ఈ దుస్థితి దాపురించేది కాదు. రాష్ట్రాభివృద్ధి అంశం ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో సంబంధించినది కాదని ఇప్పటికైనా మీరు గుర్తించాలి. అందరినీ కలుపుకుని ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి. కనుక రాష్ట్రానికి విభజన హామీల అమలు తీరు, ప్రత్యేక హోదా, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేంద్రం చేసిన అన్యాయాలపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. దీనికి రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలను, ఉద్యమ సంఘాలను ఆహ్వానించాలని ఆ లేఖలో రామకృష్ణ కోరారు.

కోహ్లి అరుదైన రికార్డు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్లో భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. దీంతో ఐసీసీ తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లి అరుదైన ఘనతను అందుకున్నాడు. అటు టెస్టు బ్యాట్స్‌మెన్ల జాబితాలో 912 పాయింట్లతో రెండో ర్యాంకులో కొనసాగుతోన్న కోహ్లి.. వన్డేల్లోనూ 909 పాయింట్లతో అగ్రస్థానంలో దూసుకుపోతున్నాడు. టెస్టు, వన్డే ఇలా రెండు ఫార్మాట్లలో ఏకకాలంలో 900లకు పైగా పాయింట్లు సాధించిన రెండో బ్యాట్స్‌మెన్‌గా కోహ్లి రికార్డు సృష్టించాడు. గతంలో మిస్టర్ 360, దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఏకకాలంలో రెండు ఫార్మాట్లలో 900లకు పైగా పాయింట్లు సాధించిన మొదటి బ్యాట్స్‌మెన్‌గా చరిత్ర సృష్టించాడు. తాజాగా ఈ ఘనతను రికార్డుల రారాజు కోహ్లి అందుకున్నాడు. ఐసీసీ మంగళవారం వన్డే ర్యాంకింగ్స్‌ను వెల్లడించింది. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన వన్డే సిరీస్‌లో కోహ్లి 558 పరుగులు సాధించాడు. ఈ ప్రదర్శనతో ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో 909 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు ఏ భారత బ్యాట్స్‌మన్ కూడా 900 రేటింగ్ పాయింట్లు సాధించలేదు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 1998లో తన కెరీర్‌లో అత్యధికంగా 887 పాయింట్లు సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో అంతగా రాణించని రోహిత్ శర్మ రెండు స్థానాలు కోల్పోయి ఆరో స్థానంలో, వందో వన్డేలో శతకం సాధించిన ధావన్ నాలుగు స్థానాలు ఎగబాకి పదో స్థానంలో కొనసాగుతున్నారు. ఇక బౌలర్ల జాబితాలోనూ మన ఆటగాళ్లు సత్తా చాటారు. బుమ్.. బుమ్.. బుమ్రా.. అఫ్ఘనిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్‌తో కలిసి అగ్రస్థానాన్ని పంచుకున్నాడు. అలాగే మణికట్టు మాంత్రికులు చాహల్, కుల్‌దీప్ ఏకంగా 21, 47 స్థానాలు ఎగబాకి 8, 15 ర్యాంకులను దక్కించుకున్నారు. ఇక జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్(123) అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా(117), ఇంగ్లాండ్(116), న్యూజిలాండ్(115), ఆస్ట్రేలియా(112) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

చరిత్రకు మ్యాచ్ దూరంలో...

- నేడే రెండో టీ20
- సఫారీలకు చావోరేవో..
- కోహ్లి డౌటే..!



సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై వరుస విజయాలతో దూసుకుపోతున్న కోహ్లిసేన మరో సిరీస్‌పై కన్నేసింది. టెస్టు సిరీస్‌లో 1-2తో ఓటమికి ప్రతీకారంగా ఇప్పటికే 5-1 తేడాతో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకున్న భారత్, సఫారీలపై ఏ మాత్రం కనికరం చూపించడం లేదు. బ్యాటింగ్‌లో ధావన్, బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్ చెలరేగడంతో తొలి టీ20లో 28 పరుగుల తేడాతో గెలుపొందిన విరాట్ సేన బుధవారం సెంచూరియన్‌లో జరిగే రెండో టీ20లో విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. దాంతో పాటు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే, టీ20 సిరీస్‌లు గెలిచిన జట్టుగా చరిత్ర లిఖించాలని పట్టుదలతో ఉంది. ప్రస్తుత టీ20 సిరీస్‌ను 3-0తో కోహ్లిసేన కైవసం చేసుకుంటే ర్యాంకింగ్ పరంగా భారత్ రెండో స్థానానికి చేరుకుంటుంది. అయితే బుధవారమే జరిగే ముక్కోణపు సిరీస్ ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఆస్ట్రేలియా ఓడిస్తే మాత్రం ఎప్పటిలాగే మూడో స్థానంలో ఉంటుంది.

కోహ్లి డౌటే..!

తొలి టీ20లో గాయం కారణంగా ఫీల్డింగ్ సమయంలో డగౌట్‌లో విశ్రాంతి తీసుకున్న టీమిండియా సారథి విరాట్ కోహ్లి రెండో మ్యాచులో ఆడతాడా లేదా అన్నది అనుమానమే! జట్టు యాజమాన్యం అధికారికంగా ప్రకటించే వరకు ఈ విషయంపై స్పష్టత రావడం కష్టమే. అయితే గాయం తీవ్రత తక్కువే కావడంతో విరాట్ మ్యాచ్ ఆడే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. డర్బన్ వన్డేలో ఫీల్డింగ్ చేసినప్పుడు గాయపడ్డా ఆ తర్వాత శతకం బాదిన సంగతి తెలిసిందే. అందులోనూ విరాట్‌కు ఇవన్నీ అలవాటే! ఐపీఎల్, ఇంగ్లండ్‌లో సుదీర్ఘ పర్యటన నేపథ్యంలో ఒకవేళ కోహ్లికి ముందు జాగ్రత్తగా విశ్రాంతినిస్తే అతడి స్థానంలో స్ట్రోక్ ప్లేయర్ కేఎల్ రాహుల్ తుది జట్టులోకి వస్తాడు. మనీశ్ పాండే కోసం తొలి టీ20లో అతడు తన స్థానం త్యాగం చేయాల్సి వచ్చింది. చాలా కాలంగా జట్టు ఎడమచేతి వాటం పేసర్‌ను క్రమం తప్పకుండా టీ20ల్లో ఆడిస్తోంది. ఈ నేపథ్యంలో జయదేవ్ ఉనద్కత్ స్థానానికి ఢోకా లేనట్టే! ప్రస్తుత మ్యాచ్ జరిగే సూపర్ స్పోర్ట్ పార్క్ పిచ్ మందకొడిగా ఉండటంతో భారత్ 'చాహల్-కుల్‌దీప్' మణికట్టు ద్వయాన్ని ఆడించే అవకాశాలున్నాయి. చాన్నాళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన సురేశ్‌రైనా కోసం కోహ్లి తన స్థానం త్యాగం చేశాడు. అయితే మిడిలార్డర్ మాత్రం ఇంకా సమస్యాత్మకంగా కనిపిస్తోంది. ధోనీ ఆశించిన వేగంతో ఆడటం లేదు.

ప్రొటీస్‌కు చావోరేవో..!

సెంచూరియన్ మ్యాచ్ నేపథ్యంలో భారత్ నిశ్చింతగా ఉండగా ఆతిథ్య దక్షిణాఫ్రికా మాత్రం తీవ్ర ఒత్తిడి అనుభవిస్తోంది. ఈ మ్యాచ్ చేజారితే సిరీస్ పోయినట్టే. అందుకే చావో రేవో తేల్చుకోవాలని సఫారీలు భావిస్తున్నారు. గాయం కారణంగా అనుభవజ్ఞుడు ఏబీ డివిలియర్స్ లేకపోవడంతో ఆ జట్టులో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. అతడి స్థానంలో బోర్డు మరొకరిని ప్రకటించకపోవడంతో ఉన్నవారితోనే జట్టును ఎంపిక చేసుకోవాల్సి వస్తోంది కెప్టెన్ జేపీ డుమినికి. హెన్రిక్స్, బెహార్డిన్ బ్యాటింగ్‌లో అదరగొట్టినా ఓపెనర్ స్మట్స్, మిడిలార్డర్‌లో డుమిని, మిల్లర్, ఫెలుక్‌వాయో విఫలమయ్యారు. గత మ్యాచ్‌లో మాదిరిగానే సఫారీలు రెండో టీ20లోనూ షార్ట్‌పిచ్ బంతులతోనే దాడి చేసే వ్యూహం అనుసరించవచ్చు.

జట్లు:

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, సురేశ్ రైనా, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, జయదేవ్ ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా: జేపీ డుమిని (కెప్టెన్), బెహార్డిన్, జూనియర్ డాలా, రెజీ హెన్రిక్స్, క్రిస్టియన్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, క్రిస్ మోరిస్, డేన్ ప్యాటర్సన్, ఆరోన్ ఫాంగిసో, ఫెలుక్‌వాయో, షంసీ, జేజే స్మట్స్.



చీరలు పోయె.. కోట్లు వచ్చె..!

న్యూఢిల్లీ : కామన్వెల్త్, ఆసియా గేమ్స్, ఒలింపిక్స్ ఇలా ఏ అంతర్జాతీయ టోర్నీకైనా భారత క్రీడాకారిణులు చీర కట్టుతో జాతీయ పతాకాలను చేత పట్టుకుని ప్రారంభ వేడుకల రోజు సందడి చేసేవారు. ఇక నుంచి వారు చీరలకు బదులు కోట్లు, ప్యాంట్లు ధరించి కనిపిస్తారు. భారత ఒలింపిక్ సమాఖ్య తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 'ఈ ఏడాది ఏప్రిల్ 4న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభంకానున్నాయి. ఈ మెగా టోర్నీ ప్రారంభ వేడుకల్లో భారత బృందంలోని మహిళా క్రీడాకారిణులు ఎప్పటిలా చీరలు ధరించడంలేదు. వాటి స్థానంలో కోట్లు, ప్యాంట్లు ధరించనున్నారు' అని భారత ఒలింపిక్ సమాఖ్య జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహతా తెలిపారు. 'అథ్లెట్లను సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రారంభ వేడుకలు సుమారు నాలుగు నుంచి ఐదు గంటలపాటు సాగుతాయి. దీంతో మహిళా అథ్లెట్లు కాస్త ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అంతేకాదు ఎక్కువ మంది అమ్మాయిలకు చీర కట్టుకోవడం రాదు. తోటి వారి సాయం తీసుకుంటున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకునే కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళా అథ్లెట్లు కోట్లు, ప్యాంటు ధరించేలా నిర్ణయం తీసుకున్నాం' అని రాజీవ్ వివరించారు. 'కోట్లు, ప్యాంట్లు ధరించడం వల్ల మాకు చాలా సమయం ఆదా అవుతుంది. అంతేకాదు చాలా హాయిగా ఫీలవుతాం. కోట్లు-ప్యాంట్లు బదులు కోట్లు-స్కర్టులు ఉంచితే ఇంకా సంతోషించే వాళ్లం' అని షూటర్ హీనా సిద్దు తన అభిప్రాయం వ్యక్తం చేసింది.

కెప్టెన్‌గా మార్‌క్రమ్ సరికాదు : స్మిత్



జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా సారథి డూప్లెసిస్ గాయపడటంతో ఆ స్థానంలో భారత్‌తో వన్డే సిరీస్‌కు మార్‌క్రమ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఐతే ఈ నిర్ణయం సరైంది కాదని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు గ్రేమ్ స్మిత్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. తాజాగా స్మిత్ మాట్లాడుతూ..'డూప్లెసిస్ స్థానంలో మార్‌క్రమ్‌కు జట్టు నాయకత్వ బాధ్యతలు అందించడం సరైన నిర్ణయం అని నేను అనుకోవట్లేదు. భారత్‌తో వన్డే సిరీస్ ఓటమితో ఇప్పుడు ఈ అంశంపైనే అందరూ మాట్లాడుకుంటున్నారు. తక్కువ వయసులో, కేవలం 10 వన్డేలు కూడా ఆడని ఆటగాడికి ఎలా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారు. దీని వల్ల ఆటగాడు ఎంతో ఒత్తిడికి గురవుతాడు. మార్‌క్రమ్ విషయంలో అదే జరిగింది. ఒత్తిడి కారణంగానే అతడు పరుగులు కూడా చేయలేకపోయాడు. భారత్‌ను ఎదుర్కొనేందుకు సఫారీ జట్టు వద్ద ప్లాన్ బీ, సీలు లేవు. భాగస్వామ్యాలు నెలకొల్పడంలో పూర్తిగా విఫలమవుతోంది' అని స్మిత్ తెలిపాడు. గాయం కారణంగా వన్డే, టీ20 సిరీస్‌కు డూప్లెసిస్ దూరమయ్యాడు. ప్రస్తుతం ఇరు జట్ల మధ్య జరుగుతోన్న టీ20 సిరీస్‌కు జేపీ డుమిని నాయకత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య బుధవారం రెండో మ్యాచ్ జరగనుంది.

చారిత్రాత్మక టెస్టుకు కోహ్లి దూరం..?

న్యూఢిల్లీ : గత ఏడాది టెస్టు హోదా దక్కించుకున్న దేశాలు అఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్. ఈ రెండు దేశాలు ఈ ఏడాదిలో తొలి టెస్టు ఆడబోతున్నాయి. అఫ్ఘనిస్థాన్.. భారత్‌తో, ఐర్లాండ్.. పాకిస్థాన్‌తో అరంగేట్రం చేయనున్నాయి. ఇందుకు ఎప్పటినుంచో సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ ఏడాది జూన్‌లో భారత్-అఫ్ఘనిస్థాన్ మధ్య ఏకైక టెస్టు బెంగళూరు వేదికగా జరగనుంది. ఐతే.. ఈ చరిత్రాత్మక టెస్టుకి భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లి దూరం కానున్నట్లు సమాచారం. ఎందుకంటే అదే నెలలో కోహ్లిసేన ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనుంది. బిజీ షెడ్యూల్‌ను ద ృష్టిలో పెట్టుకుని బీసీసీఐ కోహ్లిని అఫ్ఘనిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టు నుంచి విశ్రాంతి కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగనున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ భారత జట్టు కోసం ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేస్తోంది. జూలై 3 నుంచి భారత్-ఇంగ్లండ్ మధ్య టీ20, వన్డే, టెస్టు సిరీస్‌లు ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం భారత్ నెల ముందే ఇంగ్లాండ్‌కు వెళ్లనుంది.

'తొలి డబుల్'పై అమ్మాయిల చూపు



సెంచూరియన్: ఐదు టీ 20ల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్టుతో జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘన విజయం సాధించి, మూడో మ్యాచ్‌లో ఓటమి పాలైన భారత జట్టు నాలుగో టీ 20 విజయంపై దృష్టి సారించింది. గత టీ 20లో ఎదురైన ఓటమిని త్వరగా మర్చిపోయి తిరిగి గాడిలో పడటానికి కసరత్తులు చేస్తోంది. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగే తదుపరి టీ 20లో భారత మహిళా జట్టు మరొకసారి సత్తాచాటుకుని సిరీస్‌ను సాధించాలనే పట్టుదలగా ఉంది. సెంచూరియన్‌లో సాయంత్రం గం.4.30 ని.లకు(భారత కాలమాన ప్రకారం) ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఆరంభం కానుంది. తొలి టీ 20లో ఏడు వికెట్ల తేడాతో గెలిచిన భారత మహిళా జట్టు.. రెండో టీ 20లో తొమ్మిది వికెట్లతో విజయం సొంతం చేసుకుంది. కాగా, మూడో టీ20లో భారత జట్టుకు ఐదు వికెట్ల తేడాతో పరాజయం ఎదురుకావడంతో నేటి మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు గెలిస్తే.. సిరీస్‌ను 3-1తో ఇంకా మ్యాచ్ మిగిలి ఉండగానే సాధిస్తుంది. అదే సమయంలో దక్షిణాఫ్రికా పర్యటనలో ఒకేసారి వన్డే, టీ 20 సిరీస్‌లను గెలిచిన తొలి భారత జట్టుగా నిలుస్తుంది. మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు 2-1తో గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇది దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్‌కు మొదటి టీ 20 సిరీస్ కావడంతో 'తొలి డబుల్'ను సాధించే అవకాశం అడుగు దూరంలో ఉంది. మరొకవైపు 2015-16 సీజన్‌లో ఆస్ట్రేలియాలో ఆ జట్టుతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత మహిళా జట్టు గెలుచుకుంది. ఆ తర్వాత ఇదే భారత మహిళా జట్టుకు మొదటి విదేశీ టీ20 సిరీస్. ఈ నేపథ్యంలో విదేశాల్లో వరుసగా రెండో టీ 20 సిరీస్‌ను కూడా సాధించి అరుదైన మైలురాయిని సొంతం చేసుకోవాలని టీమిండియా మహిళా బృందం భావిస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.